తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
# తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం
సంపుటి:02 సంచిక :213 హైదరాబాద్: సంపాదకులు : గున్నాల అనిల్ రెడ్డి 16 శనివారం నవంబర్ 2024 పేజీలు : 12 వెల:రూ.5/-
Published from : Hyderabad, Rangareddy, Nizamabad, Adilabad, and Bhadradri Kothagudem, , Vijayawada, Vishakapatnam, Kurnool, Anantapur

## వరి సాగులో తెలంగాణ
# అగ్రస్థానం

7411ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం :

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, నవంబర్ 15 తెలుగు వెలుగు :**

వరి సాగు ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కోటీ 53లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడితో సన్న రకాలు 25నుంచి 40లక్షల ఎకరాలకు పెరిగిందని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రకటించడమే అందుకు కారణమని అన్నారు.

వివరాలు 2లో

## మామీద కోపంతో పేదలకు
# నష్టం చేయొద్దు

రైతులను జైళ్ల నుంచి విడుదల చేయాలి

రేవంత్‌కు తప్పకుండా పేదోడి ఉసురు తగులుతుంది : కేటీఆర్

**సంగారెడ్డి, నవంబర్ 15 తెలుగు వెలుగు :**



మామీద ఉన్న కోపంతో పేదలకు నష్టం చేయొద్దని, సీఎం రేవంత్ రెడ్డి దమ్ముంటే మాతో కొట్లాడు.. రాజకీయంగా తలపడు కానీ పేదలకు మాత్రం కష్టం కలిగించొద్దు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు.

వివరాలు 2లో

## డిసెంబర్ 21న జీఎస్టీ కౌన్సిల్
# సమావేశం

దేశ రాజధాని ఢిల్లీలో కౌన్సిల్ భేటీ

2025-26 బడ్జెట్‌పై చర్చించే అవకాశం



**న్యూఢిల్లీ, నవంబర్ 15తెలుగు వెలుగు :**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన 55వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం డిసెంబర్ 21న జరగనుంది. దేశ రాజధాని ఢిల్లీలో ఈ భేటీ జరగనుంది. ఈ సమావేశంలో 2025-26 బడ్జెట్‌పై చర్చించనున్నారు. ఈ సమావేశానికి అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులు హాజరుకానున్నారు.

వివరాలు 2లో

## ఇస్రోకు ఆర్థిక మద్దతు
# అంతంత మాత్రంగానే..?

ఇస్రో 55 పెట్టుబడులు నాసాకు ఒక్క బడ్జెట్‌తోనే సమానం

**న్యూఢిల్లీ, నవంబర్ 15 తెలుగు వెలుగు :**

చంద్రయాన్, మంగళ్‌యాన్‌లతో సామాన్యులను సైతం సైన్స్ వైపు ఆకర్షించిన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు ఆర్థిక మద్దతు అంతంత మాత్రంగానే ఉంది. 2014-2024 మధ్య కాలంలో మన దేశ జీడీపీకి అంతరిక్ష రంగం నుంచి 60 బిలియన్ డాలర్లు సమకూరింది. జాతీయ రోదసి దినోత్సవం సందర్భంగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ గురువారం విడుదల చేసిన నివేదిక ప్రకారం, రోదసి రంగంలో 400కుపైగా ప్రైవేట్ కంపెనీలు ఉన్నాయి. వీటి వల్ల 6.3 బిలియన్ డాలర్ల రెవెన్యూ వస్తుండగా, 47 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి.

వివరాలు 2లో




## బిర్సాముండా పేరిట పోస్టల్ స్టాంపు
# ఆవిష్కరణ

- ఆదివాసీ మహిళ ముర్మును రాష్ట్రపతిని చేశాం
- గిరిజనులకు అత్యున్నత గౌరవం ఇచ్చిన ఘనత మాదే
- పీఎం జన్‌మన్ యోజన పథకం ఘనత ముర్ముదే
- బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా నివాళి
- ఆదివాసీలను గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయన్న మోడీ



**పట్నా,నవంబర్15తెలుగు వెలుగు :**

దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఓ ఆదివాసీ మహిళకు తమ ప్రభుత్వం అత్యున్నత రాష్ట్రపతి పదవిని ఇచ్చి గౌరవించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆదివాసీ బిడ్డ ద్రౌపదీ ముర్మును రాష్ట్రపతిని చేయడం ఎన్డీఏ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. మొదట్లో ఆ పదవికి ఆమె పేరును ప్రతిపాదించగానే ముర్మును భారీ మెజారిటీతో గెలిపించాలని బిహార్ సీఎం నితీశ్ కుమార్ దేశం మొత్తానికి పిలుపునిచ్చారని ప్రధాని గుర్తుచేసుకున్నారు. పీఎం జన్‌మన్ యోజన పథకం ద్వారా పనుల ప్రారంభ ఘనత ద్రౌపదీ ముర్ముదే అని కొనియాడారు. ఆదివాసీల కష్టాలను తీర్చేందుకు ఈ పథకం ద్వారా రూ.24వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రధాని నరేంద్రమోదీ వెల్లడించారు. బిహార్‌లో నిర్వహించిన సభలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు.

వివరాలు 2లో

# వారిది ఔరంగజేబ్ ఫ్యాన్స్ క్లబ్

మహారాష్ట్ర ప్రచారంలో అమిత్ షా విమర్శలు

హెలికాప్టర్‌ను తనిఖీ చేసిన ఎన్నికల అధికారులు

**ముంబై,నవంబర్15తెలుగు వెలుగు :**




మహారాష్ట్రలోని మహా వికాస్ అఘాడి(ఎంవిఏ)ని 'ఔరంగ్ జేబ్ ఫ్యాన్ క్లబ్' అని కేంద్ర మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. అంతేకాక వీర్ సావర్కర్, శివసేన వ్యవస్థాపకుడు బాల్ థాకరేను దమ్ముంటే ప్రశంసించాలని రాహుల్ గాంధీకి సవాలు విసిరారు.

వివరాలు 2లో

# కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండూ ఒక్కటే



- కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంగా తెలంగాణ రాష్ట్రం
- కెసిఆర్ బాటలోనే సిఎం రేవంత్ రెడ్డి
- తిట్ల పురాణంతో తెలంగాణ పరువు తీస్తున్నారు
- పోలీస్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- చర్చల వ్యవహారం..కలెక్టర్‌పై దాడి వరకు వెళ్లింది
- మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదు...
- పేదల ఇళ్లు కూల్చివేతకే తాము వ్యతిరేకం
- మూసీ పరివాహక ఇళ్లల్లో నేడు బిజెపి నేతల నిద్ర
- రైతులకు బోనస్ ఇస్తామని..బోగస్ చేశారు
- శిల్పకళావేదికలో 21 నుంచి 24 వరకు లోక్ మంథన్
- మీడియా సమావేశంలో బిజెపి నేత, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

వివరాలు 12లో

## త్వరలోనే బిఆర్ఎస్ నుంచి
# మరిన్ని చేరికలు

కాంగ్రెస్‌లో చేరేందుకు రెడీగా ఎమ్మెల్యేలు

పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి

**హైదరాబాద్,నవంబర్15తెలుగు వెలుగు :**

కాంగ్రెస్ పార్టీలో త్వరలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల చేరికలు ఉంటాయని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు.బీఆర్ఎస్ పార్టీలోని అగ్ర నాయకులు, మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్ ఒకే పార్టీలో ఉండరని ఈ సందర్భంగా ఆయన జోస్యం చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి కేబినెట్ విస్తరణపై ఇప్పటికే సంప్రదింపులు పూర్తయ్యాయని తెలిపారు.



వివరాలు 2లో

## శ్రీలంక ఎన్నికల్లో దిస్సనాయకె పార్టీ
# గెలుపు

132 సీట్లు దక్కించుకున్న ఎన్‌పిపి

**జాఫ్నా, నవంబర్ 15తెలుగు వెలుగు :**

శ్రీలంక పార్లమెంట్ ఎన్నికల్లో అధ్యక్షుడు అనూర కుమార దిస్సనాయకెకు చెందిన నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి) ఘన విజయం సాధించింది.



వివరాలు 2లో

తెలుగు-వెలుగు

# సంపాదకీయం

## బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్
# భూసేకరణ తీరు!

భూసేకరణ విషయంలో గత బిఆర్ఎస్ అనుసరించిన నిరంకుశ విధానాలనే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తోంది. రైతులను భూములు లేకుండా చేయడం సరికాదు. ఆరార్ ప్యాకేజీ ఇవ్వండ కాదు..భూమికి భూమి ఇవాలన్న నిబంధనలతో ముందుకు సాగాలి. అలాగే ప్రభుత్వ భూములు ఉన్న దగ్గర మాత్రమే పరిశ్రమలు పెట్టాలి. గతంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్ భూసేకరణ అంతా బలవంతంగా సాగింది. రైతులను రోడ్డున పడేశారు. వారికి భూమి లేకుండా చేశారు. దీంతో రెండు నష్టాలు ప్రధానంగా జరుగనున్నాయి. ఒకటి వ్యవసాయం దెబ్బతినడంతో పాటు..రైతులు వారి కుటుంబాలు దిక్కుదివాణం లేకుండా పోతున్నాయి. బిఆర్ఎస్ హయాంలో ఇదే జరిగింది. రైతుల భూములు గుంజుకుని వారికి అరకొరగా ప్యాకేజీ ఇచ్చి రోడ్డున పడేశారు. అధికారులు బాగుపడ్డారు. లీడర్లు బాగుపడ్డారు. ఇళ్లూ, భూములు ఇచ్చిన రైతులు మాత్రం దిక్కులేని వారు అయ్యారు. పరిశ్రమలు, ప్రాజెక్టుల కోసం భూ సేకరణ జరిగిన ప్రతి ప్రాంతంలో ఇదే జరిగింది. వైఎస్ హయాంలో గంగవరం పోర్టు కోసం జాలర్లను బలవంతంగా ఖాళీ చేయించారు. పోర్టు వచ్చింది. వారి కుటుబాల్లో మాత్రం ఉద్యోగాలు రాలేదు. వారికి సక్రమమైన రీతిలో ఆర్ఆర్ ప్యాకేజీ రాలేదు. చివరకు గంగవరం పోర్టును ఆదానీ ఎగురేసుకు పోయారు. మచిలీపట్నం పోర్టు కావచ్చు..పోలవరం పరాజెక్టు కావచ్చు...మరే ఇతర ప్రాజెక్టు అయినా కావచ్చు..అలాగే జరిగింది. పోలవరం నిర్వాసితులకు ఇప్పటికీ కనీసం ఇల్లు కూడా సక్రమంగా కట్టి ఇవ్వలేదు. గుంజుకున్న భూములకు భూములు ఇవ్వలేదు. మల్లన్నసాగర్ రైతుల గతి కూడా అంతే అయ్యింది. ప్రజెక్టు వచ్చాక భూములు ఉన్నవారు, కొనుక్కున్న వారు బాగుపడ్డారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డు...ఇలా చెప్పుకుంటూ పోతే... అనేక ఉదాహరణలు మన కళ్లకు కనబడుతున్నాయి. ఎక్కడా భూములు ఇచ్చిన వారు బాగపడలేదు. భూములు తీసుకున్న వారు, ఆ చుట్టుపక్కల కొనుక్కున్న వారు మాత్రమే బాగుపడ్డారు. ఇప్పుడు కూడా లగచర్లలో ఏర్పాటయ్యే ఫార్మా కంపెనీ ద్వారా కూడా అదే జరుగుతుంది. అందువల్ల భూసేకరణ పద్ధతి మారాలి. అవసరం కోసం భూములు ఫార్మా పరిశ్రమలు పెట్టే వారే కొనుక్కోవాలి. ఫార్మకంపెనీలకు భూసేకరణ ద్వారా భూములు ఇవ్వడం కాకుండా వేలం పాట ద్వారా కావాల్సిన భూములు కొనుగోలు చేసుకునేలా చేయాలి. కంపెనీలు పెట్టాలనుకునే వారు భూములు కొనుక్కునేలా చేయాలి. ఇకపోతే భూములన్నీ పరిశ్రమలకు కేటాయిస్తూ పోతే వ్యవసాయం దెబ్బతింటుందని గుర్తించాలి. రైతులను వ్యవసాయం చేసి, మనకు అసవరమైన ఆహారధాన్యలు పండించేలా ప్రోత్సహించాలి. మనదేశం నూనెల కోసం ఇతర దేశాలపై ఆధారపడుతోంది. దానినుండి బయటపడేందుకు మన భూమల్లో నూనెగింజలు పండించేలా రైతులను ప్రోత్సహిస్తే బంగారం పండుతుంది. వేరుశనగ, నువ్వులు, పొద్దు తిరుగుడు పంటలు పుష్కలంగా మన నేలల్లో పండుతాయి. ఈ పంటలను ప్రోత్సహిస్తే..అవసరాలు తీరడంతో పాటు, రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతారు. వ్యవసాయాధారిత కుటీర పరిశ్రమలతో నిరుద్యోగులకు ఉపాధి కల్పించ వచ్చు. ఉపాధి, ఉద్యోగాలకు పరిశ్రమలే రావాల్సిన అవసరం లేదు. వ్యవసాయం, అనుబంధ రంగాలను ప్రోత్సహిస్తే గ్రామిణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కాగలదు. నిరుద్యోగ సమస్య తీరగలదు. లగచర్ల విషయానికి వస్తే రైతులను సంప్రదించాలి. అఖిలపక్షంలో చర్చించాలి. అసలు ఫార్మా అవసరమా లేదా అన్నది కూడా విస్తృతంగా చర్చించాలి. ఇప్పటికే కాలుష్యంతో చస్తున్నాం. ఈ ఫార్మా కంపెనీతో కాలుష్యం పెరుగుతుంది. అందువల్ల బిఆర్ఎస్ అనుసరించిన నిరంకుశ విధానాలను రేవంత్ సర్కార్ విడనాడాలి. రైతులను రోడ్డున పడేసే కార్యక్రమాలను పక్కన పెట్టాలి. జీవనాధారమైన భూములు లాక్కొని అభివృద్ధి చేస్తామంటే... నమ్మడానికి లేదు. భూములు ఇచ్చిన రైతులు కుటుంబంతో ఎక్కడికి పోవాలి? ఎలా బతకాలి? అన్నది కూడా ఆలోచన చేయాలి. మమ్మల్ని చంపినా మా భూములివ్వం... ఇంచుభూమిని కూడా వదులుకోం అని లగచర్లతోపాటు సమీపంలోని పెచ్చెర్లగడ్డ తండా, ఆర్బీ తండా బాధిత రైతు కుటుంబాలు మొత్తుకుంటున్న వేళ, పాలకులు వారి గురించి ముందు ఆలోచించాలి. మీడియా ముందుకు వచ్చిన వారి గోడును వినాలి. వారి భూములు తీసుకోవాల్సి వస్తే..భూమికి భూమి ఇవ్వాలి. అలాగే ఇల్లుకు ఇల్లు ఇవ్వాలి. దాంతో పాటే పరిహారం కూడా ఇవ్వాలి. అల ఇవ్వడానికి వారిని ఒప్పించాలి. అంతేగాని బలవంతంగా భూసేకరణ సరికాదు. మా ఇండ్ల వద్దకొచ్చి.. మీ భూములు ఇచ్చేయండి, ఫార్మా కంపెనీ పెడుతున్నమని చెప్తున్నారు. సర్వేల పేరుతో రోజూ మా ఇండ్ల చుట్టూ తిరుగుతున్నరు. అధికారులు కూడా మా భూములు తీసుకుంటా మని బెదిరిస్తున్నరు. మాకు ఫార్మా కంపెనీ అక్కర్లేదు.. కంపెనీ పెడితే మా భూములు నాశమవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతుల బాధలను ఆలోచించాలి. ఉన్న భూములను సర్కారు లాక్కుంటే తామెలా బతకాలని బాధితులంతా గోడు వెళ్లబోసుకున్నారు. తమ ప్రాణాలు పోయినా భూములు ఇవ్వబోమని తేల్చి చెప్పారు. నోటీసులు కూడా ఇవ్వలేదని స్పష్టంగా చెప్తున్నారు.. ఫార్మా ఎందుకు పెడుతున్నారో చెప్పలేదని వారు తెలిపారు. 9 నెలలుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని బాధితులే అంటున్నారు. ఈ ఫార్మా సిటీ వల్ల మాకున్న భూమి, ఇల్లుతో సహా సర్వం పోతుందని వాపోతున్నారు. పుట్టిన నాటి నుంచి ఈ భూములతో మాకు అనుబంధం ఉంది. ఒక్కసారిగా భూములు ప్రభుత్వానికి అప్పజెప్పాలని అంటే మేం ఎక్కడికి వెళ్లాలి, ఎలా బతకాలని వారు వేస్తున్న ప్రశ్నలకు నేరుగా సిఎం రేవంత్ రెడ్డి, అధికారులు సమాధానం ఇవ్వాలి. మాకున్న పొలమే మాకు జీవనాధారం. ఫార్మా కంపెనీ కోసం మా పొలాలు కావాలని అడగడం సరికాదు. నోటికాడి కూడును లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉన్న భూమి పోతే ఎలా బతకాలి? అధికారులొచ్చి ఫార్మా కంపెనీకి భూములియ్యమంటున్నారు. మీకు మా భూములే దొరికాయా. ఉన్న భూములు ఇచ్చేసి మేమెలా బతకాలి? అలాగని మా భూములు తీసుకుంటామంటే అస్సలు ఊరుకునేది లేదు. జానెడు భూమికి కొట్టుకుసచ్చే రోజులివి. నాకున్న భూమి మొత్తం ఇవ్వమంటే ఎలా? అంటూ ఒక్కో కుటుంబం ఒక్కో గాథ వినిపిస్తోంది. నిజంగానే ఇది కన్నీటి వ్యథ. దీనిని అంతా ఆలోచించాలి. ప్రభుత్వమే తన విధానాలను మార్చుకోవాలి. రైతులను వేధించి భూములు తీసుకోవడం సిరికాదు. ఆర్ఆర్ ప్యాకేజీలు భూమికి భూమి, ఇంటికి ఇల్లు అన్న పద్దతిలో ముందుకు రావాలి. లేదా భూములను అమ్ముకునే రైతుల నుంచి మాత్రమే సేకరించాలి. లేదా ప్రభుత్వ భూముల్లో మాత్రమే పరిశ్రమలు పెట్టాలి. అలా కాకుండా రైతుల భూములను గుంజుకుని పరిశ్రమలు పెడతామంటే కుదరదు. ప్రభుత్వ భూములను అమ్ముకుంటూ పోవడం వల్లనే ఇప్పుడీ దుస్థితి వచ్చిందన్నది కూడా గుర్తించాలి.

## వరి సాగులో తెలంగాణ
# అగ్రస్థానం

మొదటి పేజీ తరువాయి

సంక్రాంతి నుంచి రేషన్‌తో సహా అన్ని హాస్టళ్లకు సన్న బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. దొడ్డు రకం వరి సాగు 41లక్షల నుంచి 21 లక్షల ఎకరాలకు పడిపోయిందని చెప్పారు. రాష్ట్ర అవసరాలే కాకుండా ఇతర దేశాలకు ఎగుమతి అయ్యే అవకాశం ఉందన్నారు. 7411ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అధికారం కోల్పోయిన పార్టీ అధికారం కోసం రైతుల ఆత్మ స్థైర్యం దెబ్బ తీసే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. "అన్ని గ్రామ పంచాయితీల్లో కొనుగోలు కేంద్రాలు పెట్టం. వడ్లు ఆరపోసిన దగ్గర రైతులు ఆందోళన చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఆధిపత్య పోరు ఉండొచ్చు. రాష్ట్రంలో రెండో స్థానం కోసం బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఆధిపత్య పోరు ఉండొచ్చు. మీ ఆధిపత్య పోరు కోసం రైతాంగాన్ని ఆందోళనకు గురిచేయొద్దు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గైడ్ లైన్స్ ప్రకారమే మేము ధాన్యం కొనాలి. మీకు రైతుల మీద ప్రేమ ఉంటే గైడ్ లైన్స్ మార్చండి..కృత్రిమ ఆందోళనతో శునకానందం పొందడం సరికాదు. సబ్ కమిటీ రిపోర్ట్ వచ్చాక రైతు భరోసా ఇస్తాం. రైతులను ఇబ్బంది పెట్టే రాజకీయ క్రీడను పార్టీలు మానుకోవాలి" అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## డిసెంబర్ 21న జీఎస్టీ కౌన్సిల్
# సమావేశం

మొదటి పేజీ తరువాయి

ఆయా రాష్ట్రాల నుంచి వచ్చే సిఫార్సులను ఆర్థికమంత్రిశాఖ స్వీకరించనుంది. ఈ సమావేశానికి తెలుగు రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సహా ఆయా రాష్ట్రాల ఆర్థిక మంత్రులు హాజరుకానున్నారు. ఇక కేంద్ర బడ్జెట్ ఫిబ్రవరి 1, 2025న ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. గత బడ్జెట్‌లో ఏపీకి భారీ ఆర్థిక సాయాన్ని కేంద్రం ప్రకటించింది. ఈసారి కూడా ఏదొక సాయం చేయొచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం ఎన్డీఏ కూటమిలో తెలుగు దేశం పార్టీ కీలక రోల్ పోషిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర బడ్జెట్‌లో మరొకసారి ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యత దక్కొచ్చని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. డిసెంబర్ 21న జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్‌తో పాటు పలు కీలక సమస్యలను పరిష్కరించే అవకాశం ఉంది. ఆరోగ్యం, బీమాపై జీఎస్టీ మినహాయింపుపై నిర్ణయం తీసుకునే ఛాన్సుంది. అలాగే సాధార వస్తువులపై కూడా పన్ను రేట్ల హేతుబద్ధీకరణను పరిగణించవచ్చని తెలుస్తోంది. రాష్ట్ర మంత్రుల ప్యానెల్ నుంచి వచ్చే సిఫార్సుల ఆధారంగా రేట్లను 12 శాతం నుంచి 5 శాతం వరకు తగ్గించవచ్చని సమాచారం.గత బడ్జెట్‌లో బీహార్, ఏపీకే కేంద్రం ప్రాధాన్యత ఇచ్చిందంటూ ప్రతిపక్ష కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు చేసింది. మిత్రులను మచ్చిక చేసుకునేందుకు మిగతా రాష్ట్రాలను పట్టించుకోలేదని పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. 2025లో ప్రకటించబోయే బడ్జెట్‌లోనైనా ఏవైనా మెరుపులు ఉంటాయేమో చూడాలి.

## త్వరలోనే బిఆర్ఎస్ నుంచి
# మరిన్ని చేరికలు

మొదటి పేజీ తరువాయి

తనకు, సీఎం రేవంత్ రెడ్డికి మధ్య మంచి సన్నిహిత సంబంధాలున్నాయన్నారు. అయితే బీఆర్ఎస్‌లోని పలువురు కీలక నేతలు బీజేపీలోకి వెళ్తారని ఆయన పేర్కొన్నారు. ఇక శనివారం నుంచి తాను జిల్లాల పర్యటన చేస్తానని.. అందులోభాగంగా ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తానని చెప్పారు. అలాగే పార్టీల్లో ఉన్న ఇబ్బందులను సైతం సరి చేస్తానని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. మరోవైపు ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా కేబినెట్ విస్తరణతోపాటు పలు అంశాలపై పార్టీ పెద్దలతో ఆయన చర్చించినట్లు తెలుస్తుంది. అలాగే రాష్ట్రంలో ప్రస్తుతం కుల గణన జరుగుతుంది. అదే విధంగా మరికొద్ది రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఆయా అంశాలపై సైతం ఆయన పార్టీ సీనియర్లతో చర్చించినట్లు సమాచారం. ఇంకోవైపు గతేడాది చివరల్లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో తెలంగాణ ఓటరు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం కొలువు తీరింది. దాంతో బీఆర్ఎస్ ప్రతిపక్షానికి పరిమితమైంది. ఇక సీఎం రేవంత్ రెడ్డి చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్‌లో పలువురు బీఆర్ఎస్ అగ్రనేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో బీఆర్ఎస్ పార్టీలో కేవలం కేసీఆర్ ఫ్యామిలీ మాత్రమే ఉన్నదన్నట్లుగా పరిస్థితి మారింది.ఇక ఈ ఏడాది మే, జూన్ మాసాల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు దాదాపు అన్ని ఎంపీ స్థానాలను కైవసం చేసుకున్నాయి. అదే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు కనీసం డిపాజిట్ కూడా దక్కక పోవడం గమనార్హం. మరికొద్ది రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో సైతం అన్ని విజయావకాశాలను ఒడిసి పట్టుకోవాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. అందుకోసం రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్‌లోని అగ్రనేతలను సైతం పార్టీలోకి తీసుకు వచ్చేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్తుంది. ఈ నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌పై విధంగా వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తుంది.

## శ్రీలంక ఎన్నికల్లో
# దిస్సనాయకె పార్టీ గెలుపు

మొదటి పేజీ తరువాయి

శుక్రవారం విడుదలైన పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో మొత్తం 225 సీట్లకు గాను ఎన్‌పిపి కి 132 సీట్లు దక్కాయని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఓట్ల కౌంటింగ్ చివరి దశలో కొనసాగుతోంది. ఎన్‌పిపికి సీట్లు సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. కొన్ని రోజుల క్రితం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో సాజిత్ ప్రేమదాస నాయకత్వంలోని ప్రతిపక్ష పార్టీల కూటమి (సమాజి జన బలవెగయ)కు కేవలం 18 శాతం ఓట్లు దక్కగా.. అధ్యక్షుడు దిస్సనాయకె కు చెందిన ఎన్‌పిపి.. 62 శాతానికి పైగా ఓట్లు సాధించి విజేతగా నిలిచింది. ఎన్నికలు కూడా ప్రశాంతంగా ముగిశాయి. ఎక్కడా హింసాత్మక ఘటనలు జరగలేదు. అయితే సెప్టెంబర్ లో జరిగిన అధ్యక్ష ఎన్నికల కంటే పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గింది. అధ్యక్ష ఎన్నికల్లో 80 శాతం మంది ఓటు వేయగా.. ఈ సారి 70 శాతం మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. మాజీ ఎంపీ, మార్క్సిస్ట్ లీడర్ అయిన దిస్సనాయకె శ్రీలంకలో అవినీతిని అంతం చేస్తానని, దోపిడికీ గురైన ప్రభుత్వ నిధులను తిరిగి తీసుకు వస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. గత రెండేళ్లుగా శ్రీలంకలో ఆర్థిక సంక్షోభం నెలకొంది. అక్కడ ప్రజలకు సరిపడ ఆహారం, వైద్య సదుపాయాలు కూడా కరువయ్యాయి. దేశంలో సంక్షోభ పరిస్థితులతో ప్రజలు తిరుగుబాటు చేశారు. దీంతో దేశ సంపదను దోచుకొని 2022లో అప్పటి అధ్యక్షుడు గోటబయ రాజపక్స దేశ విడిచి పారిపోయాడు. 2022లో ఎన్‌పిపి పార్లమెంటులో మిగతా పార్టీలతో పోలిస్తే.. చాలా చిన్న స్థాయిలో ఉండేది. అయితే ప్రస్తుతం మార్పు కోరుకుంటున్న ప్రజలు మతవాదాన్ని వీడి లెఫ్టిస్టు భావజాలమున్న దిస్సనాయకె కు అధికారం కట్టబెట్టారు. శ్రీలంకలో తమిళ జనాభా ఉన్న ఉత్తర జాఫ్నా లో కూడా దిస్సనాయకె పార్టీకి ప్రజలు జై కొట్టారు. శ్రీలంకు స్వాతంత్ర్యం లభించినప్పటి నుంచి జాఫ్నాలో ఒక సింహళ నాయకుడి పార్టీ విజయం సాధించడం ఇదే తొలిసారి. ఆర్థిక సంక్షోభంలో ఉన్న శ్రీలంకను గాడిలో పెట్టేందుకు దిస్సనాయకె తన మార్క్సిస్టు భావజాలాన్ని పక్కన బెట్టి.. లిబరల్ విధానాలను అనుసరిస్తున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించగానే ఆయన ఇంటర్నేషన్నల్ మానిటర్ ఫండ్ (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకు నుంచి 2.9 బిలియన్ డాలర్ల అప్పుకోసం చర్చలు జరిపారు. అయితే ఆ అప్పు పుట్టాలంటే ప్రజలు, కంపెనీలపై ఎక్కువ పన్నులు వేయాలని ఐఎంఎప్ షరతులు విధించింది. ముందే కష్టాల్లో ఉన్న ప్రజలపై అధిక పన్నులు వేయడం ఇష్టంలేని దిస్సనాయకె ఇంకా నిర్ణయం తీసుకోలేదు.దిస్సనాయకె నిర్ణయాలతో శ్రీలంక స్టాక్ మార్కెట్ 16 శాతం అభివృద్ధి సాధించింది. ఆయనకు కార్పొరేట్ కంపెనీలు కూడా మద్దతు తెలిపాయి. ప్రతిపక్షాలు కూడా బలహీనంగా ఉండడంతో దిస్సనాయకె దేశాన్ని గాడిలో పెట్టేందుకు తీసుకునే నిర్ణయాలకు అడ్డులేకుండా పోయింది. దీంతో శ్రీలంకలో ఇప్పుడు దిస్సనాయకె తిరుగులేని నాయకుడిగా ఎదిగారు.

## మామీద కోపంతో పేదలకు
# నష్టం చేయొద్దు

మొదటి పేజీ తరువాయి

లగచర్ల రైతులపై నమోదు చేసిన కేసులన్నీ రద్దు చేసి, వెంటనే వారిని జైళ్ల నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. సంగారెడ్డి జైల్లో లగచర్ల రైతులతో ములాఖత్ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ శివార్లలో ఫార్మాసిటీ కేసీఆర్ పెడితే రేవంత్ వాళ్ల కుటుంబ సభ్యుల కోసం మార్చారు. లగచర్లతో పాటు సంగారెడ్డి జిల్లా న్యాలకల్‌లో కూడా రైతులు పోరాటం చేస్తున్నారన్నారు. కేసీఆర్ మీకు అండగా ఉంటారు... ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఎదుర్కొంటాం.. ఈ ప్రభుత్వానికి తప్పకుండా పేదవాడి ఉసురు తగులతది. 30, 40 కిలోల బరువు లేని పిల్లలు కలెక్టర్‌పై హత్యాయత్నం చేశారని కేసులు పెట్టడానికి మనసు ఎలా ఒప్పింది రేవంత్ రెడ్డి..? చేతనైతే మాతో కొట్లాడు. రాజకీయంగా మాతో తలపడు. పేదలకు కష్టం కలిగించొద్దు. ఈ కేసులన్నీ రద్దు చేసి రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాను. రైతులకు, పేదలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. గర్భిణి అయిన జ్యోతిని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ రేపు హాస్పిటల్‌కు తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయిస్తుంది. పేద వర్గాలకు అండగా నిలబడడమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని కేటీఆర్ స్పష్టం చేశారు.

## ఇస్రోకు ఆర్థిక మద్దతు
# అంతంత మాత్రంగానే..?

మొదటి పేజీ తరువాయి

ప్రపంచంలో అతి పెద్ద రోదసి ఆర్థిక వ్యవస్థల్లో మన దేశం ఎనిమిదో స్థానంలో ఉంది. 2024నాటికి మన దేశ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ విలువ సుమారు రూ.6,700 కోట్లు. ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో ఇది 2-3 శాతం కాగా, వచ్చే దశాబ్దానికి దీనిని 10 శాతానికి పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే నాసా బడ్జెట్ కన్నా ఇస్రో బడ్జెట్ 15 రెట్లు ఎక్కువ. ఇస్రోను స్థాపించి 55 ఏండ్లు అవుతున్నది. ఈ మొత్తం కాలంలో ఇస్రో పెట్టుబడులు నాసా ఒక ఏడాది బడ్జెట్ కన్నా తక్కువ. ఇస్రో ప్రస్తుత వార్షిక బడ్జెట్ సుమారు 1.6 బిలియన్ డాలర్లు కాగా, నాసా వార్షిక బడ్జెట్ 25 బిలియన్ డాలర్లు. ఇస్రో చైర్మన్ సోమనాథ్ ఇటీవల కర్ణాటక విద్యార్థులతో మాట్లాడుతూ, అంతరిక్ష రంగంలో భాగస్వాములైన దేశాలతో ఆధిపత్యం కోసం పోరాడటం కన్నా దేశానికి సేవ చేయడంపైన మాత్రమే ఇస్రో దృష్టి సారించిందన్నారు.

# వారిది ఔరంగజేబ్ ఫ్యాన్స్ క్లబ్

మొదటి పేజీ తరువాయి


'ఉద్ధవ్ గారు, ఒకవేళ మీకు దమ్ముంటే వీర్ సావర్కర్, బాలాసాహెబ్ మీద రెండు మంచి మాటలు రాహులు గాంధీతో అనిపించండి' అన్నారు. మహారాష్ట్రలోని హింగోలిలో జరిగిన ర్యాలీలో ఆయన ప్రసంగిస్తూ ఈ విషయం చెప్పారు. నవంబర్ 20 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగడానికి ముందు ఆయన ఈ విషయం చెప్పారు.'రాహుల్ బాబా కాంగ్రెస్ పార్టీ కశ్మీర్ లో 370 ఆర్టికల్ తిరిగి తీసుకొస్తామని తీర్మానం చేసింది. జాగ్రత్తగా విను, నువ్వే కాదు?నీ నాలుగో తరం కూడా తీసుకురాలేదని షా తెలిపారు. ఇదిలావుంటే మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలవేళ.. ప్రచారంలో పాల్గొనే నేతల బ్యాగులు, హెలికాప్టర్లలో తనిఖీల పరంపర కొనసాగుతోంది. తాజాగా హింగోలి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రచారం కోసం వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా హెలికాప్టర్‌ను అధికారులు తనిఖీ చేశారు. ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించిన ఆయన.. ఇందుకు సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఎన్నికల ప్రచారం కోసం ఇక్కడకు వచ్చిన క్రమంలో నా హెలికాప్టర్‌ను అధికారులు తనిఖీ చేశారు. నిష్పక్షపాత, ఆరోగ్యకరమైన ఎన్నికల వ్యవస్థను భాజపా విశ్వసిస్తోంది. ఇందుకు మనమంతా సహకరించాలి. ప్రపంచంలో శక్తిమంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థగా భారత్‌ను కొనసాగించడంలో మన బాధ్యతలను నిర్వర్తించాలి' అని అమిత్ షా పేర్కొన్నారు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే బ్యాగులను ఎన్నికల అధికారులు పలుమార్లు తనిఖీ చేయడం ఇటీవల చర్చనీయాంశమైంది. విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకున్నారంటూ ఎన్నికల అధికారుల తీరుపై ఆయన విమర్శలు గుప్పించారు. దాంతో ఇది సాధారణ ప్రక్రియే అంటూ ఈసీ కూడా క్లారిటీ ఇచ్చింది. అప్పటి నుంచి బ్యాగులు, హెలికాప్టర్ల తనిఖీల పరంపర కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, డిప్యూటీ సీఎం అజిత్ పవార్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బ్యాగులను అధికారులు తనిఖీ చేశారు. మహారాష్ట్రలో నవంబర్ 20న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

## బిర్సాముండా పేరిట పోస్టల్ స్టాంపు
# ఆవిష్కరణ

మొదటి పేజీ తరువాయి

ఆదివాసీలు తమ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ధర్తీ అబా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా బీహార్‌లోని జాముయ్‌లో ప్రధాని మోడీ ఆయనకు నివాళులర్పించి, ఆయన పేరిట పోస్టల్ స్టాంపును విడుదల చేశారు. 6000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. గిరిజన సమాజాన్ని నిర్లక్ష్యం చేయడానికి గత ప్రభుత్వాలే కారణమని ప్రధాని మోడీ అన్నారు. గత ప్రభుత్వాల వల్ల గిరిజన సమాజం నిర్లక్ష్యానికి గురైందన్నారు. గిరిజన సమాజం దేశాభివృద్ధి రేసులో వెనుకబడింది. దేశ స్వాతంత్ర్యానికి ఒక పార్టీ లేదా ఒక కుటుంబం సహకరించిందని చేసే ప్రచారం తప్పన్నారు. గిరిజన సమాజంలోని ఎందరో మహానాయకులు త్యాగాలు చేశారని ప్రధాని మోడీ అన్నారు. గిరిజన సమాజం చేసిన కృషికి చరిత్రలో సముచిత స్థానం దక్కలేదన్నారు. ఏళ్ల తరబడి గిరిజన సంఘం నిర్లక్ష్యానికి గురైంది. గిరిజన సమాజం, సహకారం, త్యాగాన్ని తుడిచిపెట్టే ప్రయత్నం జరిగిందన్నారు. అత్యంత వెనుకబడిన గిరిజనులపై ఎలాంటి శ్రద్ధ తీసుకోలేదన్నారు. వారి జీవితాల్లోని కష్టాలను తగ్గించడానికి, మా ప్రభుత్వం 24 వేల కోట్ల రూపాయలతో ప్రధానమంత్రి జన్మన్ యోజనను ప్రారంభించింది. దేశంలోని అత్యంత వెనుకబడిన గిరిజనుల ఆవాసాల అభివృద్ధికి ఈ పథకం భరోసా ఇస్తోందని అన్నారు. అత్యంత వెనుకబడిన గిరిజనులకు మన ప్రభుత్వం వేల సంఖ్యలో శాశ్వత గృహాలను ఇచ్చిందని ప్రధాని అన్నారు. రాముడిని యువరాజును చేసింది గిరిజన సమాజమేనని ప్రధాని మోడీ అన్నారు. భారతదేశ సంస్కృతిని, స్వాతంత్ర్య పరిరక్షణ కోసం వందల ఏళ్లుగా పోరాటానికి నాయకత్వం వహించినది గిరిజన సమాజం. భారతదేశ సంస్కృతి, స్వాతంత్య పరిరక్షణ కోసం గిరిజన సమాజం వందల ఏళ్ల పాటు పోరాటాన్ని నడిపిందన్నారు. గిరిజన సమాజం ప్రకృతిని, ప్రాచీన వైద్య విధానాలను సజీవంగా ఉంచిందన్నారు. గత ప్రభుత్వాలు వెనకబడిన వర్గాల సంక్షేమం గురించి ఎప్పుడూ ఆలోచించలేదని.. వారి అభివృద్ధి కోసం కృషి చేయలేదని ప్రధాని విమర్శించారు. సమాజానికి దూరంగా నివసిస్తున్న ఆదివాసీలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. వారు పండించే దాదాపు 90 అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఇచ్చామన్నారు. ఆదివాసీ యువత క్రీడలలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారని.. వారిని మరింత ప్రోత్సహించడానికి అనేక క్రీడా సౌకర్యాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఆదీవాసీలకు చదువు, సంపద, వైద్య సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. వారి సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటుచేశామని.. బడ్జెట్‌ను రూ.25,000 కోట్ల నుంచి రూ.1.25 లక్షల కోట్లకు పెంచామని ప్రధాని వెల్లడించారు.

# రాజ్యాంగానికి వ్యతిరేకంగా వక్ఫ్ బోర్డు
## కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ కొండా



**హైదరాబాద్,నవంబర్15తెలుగు వెలుగు :** రాజ్యాంగానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ వక్ఫ్ బోర్డును తీసుకొచ్చిందని, సుప్రీంకోర్టుకు మించి వక్ఫ్ బోర్డుకు అధికారాలిచ్చారని బిజెపి ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. వక్ఫ్ బోర్డు అనేది ఒక క్రూరమైన హాస్యం. నవ్వాలో.. ఏడవాలో.. బాధపడాలో తెలియని పరిస్థితిగా ఉందని అన్నారు. ఔరంగజేబు విధానాలు ఇప్పటికీ ప్రజలను పీడిస్తున్నాయని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. '300 ఏళ్ల క్రితం ఔరంగజేబు నోటి మాటతో భూములు ఇచ్చి ఉండొచ్చు. కానీ, నేడు కుప్పలు కుప్పలుగా డాక్యుమెంట్స్‌తో ఆ భూములు మావి అని అంటున్నారు. ప్రజాస్వామ్యంలో సుప్రీంకోర్టు కీలకం.. ఎవరైనా సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించాల్సిందే.. శీతాకాల సమావేశాల్లో వక్ఫ్‌బోర్డు బిల్లు పార్లమెంట్‌లో పాస్ అవుతుంది. వక్ఫ్ బోర్డు సవరణ చట్టం ముస్లిం సమాజానికి వ్యతిరేకం కాదు' అని ఎంపీ అన్నారు.

# జిల్లాలో గ్రూప్ - 3 పరీక్ష నిర్వహణకు అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి

## పరీక్ష రాసే అభ్యర్థులు చెప్పులు మాత్రమే ధరించాలి

**పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే (ఉదయం 9 గంటల 30 నిమిషాలకు, మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు) పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేత**

**సమన్వయంతో పరీక్షను విజయవంతంగా పూర్తి చేయాలి**

**అభ్యర్థులు పరీక్ష కేంద్రాన్ని ముందే చూసుకోవాలి**

**జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**



**మెదక్, నవంబర్ 15:(తెలుగు వెలుగు ప్రతినిధి),**

ఈ నెల 17,18 వ తేదీలలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంట వరకు , మధ్యాహ్నం 03.00 గంటల నుండి సాయంత్రం-5-30 కొనసాగే గ్రూప్-111 పరీక్షకు జిల్లాలో 5867 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లాలో 19 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ -06, రూట్ ఆఫీసర్స్ -06, డిపార్ట్మెంట్ ఆఫీసర్స్ -19, విధులు నిర్వహిస్తారని తెలిపారు.కేవలం చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరూ పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్ తీసుకెళ్లవద్దని స్పష్టం చేశారు. ప్రతి కేంద్రంలో మహిళలు, పురుషులకు వేరువేరుగా తనిఖీ గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసి ఉంచాలని, ఆర్టీసీ అధికారులు అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు నడిపించాలని, సెస్ అధికారులు విద్యుత్ సరఫరాలో లోపం లేకుండా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు ఉండాలని సూచించారు. అదేవిధంగా ప్రతి పరీక్షా కేంద్రం వద్ద మంచినీరు, టాయిలెట్లు సక్రమంగా ఉండేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

**పరీక్షా పేపర్లు**

భద్రపరచేందుకు స్ట్రాంగ్ రూము ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పరీక్ష నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

ఒక్కో సెంటర్ కు( 05) మంది పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసి అందరి సమన్వయంతో పటిష్ట భద్రత నడుమ పరీక్షలు విజయవంతంగా కొనసాగడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ కీలక సూచనలు**

అభ్యర్థులు టీజీపీఎస్సీ వెబ్ సైట్ ద్వారా గ్రూప్-3 హాల్ టికెట్ లు డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. పరీక్షార్థులు హాల్ టికెట్ ను ఏ4 సైజ్ పేపర్ లో కలర్ ప్రింట్ తీసుకోవాలని సూచించారు. హాల్ టికెట్ పై అభ్యర్థులు తమ తాజా పాస్ పోర్టు ఫోటోను అతికించాలన్నారు. డౌన్లోడ్ చేసిన హాల్ టికెట్ పై ఫోటో సరిగా ముద్రించి లేకుంటే, అభ్యర్థి గెజిటెడ్ అధికారి లేదా చివరగా చదువుకున్న విద్యాసంస్థ ప్రిన్సిపల్ అటెస్ట్ తో మూడు పాస్ పోర్టు ఫోటోలతో పాటు వెబ్ సైట్ లో పొందుపరిచిన ధ్రువీకరణ పత్రాన్ని పూర్తిచేసి ఇన్విజిలేటర్ కు అందించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని, పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే (9:30 గంటలకు) గేట్లు మూసివేస్తామని, పరీక్ష రాసే అభ్యర్థులు చెప్పులు మాత్రమే ధరించాలని, అభరణాలు ధరించరాదని సూచించారు. పరీక్షార్థులు మెహిందీ, తాత్కాలిక టాటూలను వేసుకోరాదని స్పష్టం చేశారు. పరీక్ష రాసే అభ్యర్థులు హాల్ టికెట్ ను, బ్లూ (లేదా) బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తో పాటు గుర్తింపు పొందిన ప్రభుత్వ ఒరిజినల్ ఐడెంటిటీ కార్డును తప్పనిసరిగా తమ వెంట తీసుకెళ్లాలని సూచించారు. పరీక్ష సమయ పాలనకు సూచికగా ప్రతీ అర్ధగంటకోసారి బెల్ మోగుతుందని తెలిపారు.

# బిర్సా ముండా...150వ జయంతి వేడుకలు...

**పాల్గొన్న ఎంపీ రఘునందన్ రావు కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్,**



**మెదక్, నవంబర్ 15:(తెలుగు వెలుగు ప్రతినిధి),**

కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ధర్తి ఆబా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకల సందర్భంగా ,జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో. గౌరవనీయులైన జిల్లా కలెక్టర్ గారి అధ్యక్షతన , జన్ జాతీయ గౌరవ దివాస్ కార్యక్రమాన్ని జరుపుకోవడం జరిగింది.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ధర్తి ఆబ జన గ్రామ ఉత్కర్ష్ అభియాన్ సంకల్పం నుండి సత్వర ఆచరణ దిశగా రూ.6,900 కోట్ల పథకాల శుభారంభం ప్రారంభోత్సవం కార్యక్రమం జరిగింది.కేంద్ర ప్రభుత్వం 70శాతం నిధులతోను, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులతో దేశంలోని 26 రాష్ట్రాలు, 4 కేంద్ర పాలిత ప్రాంతాలలో ఉన్న 700 పైగా గిరిజన తెగల ప్రజల అభివృద్ధి కి మౌలిక సదుపాయాల కల్పన వసతులు చేపట్టాలని 79వేల 156 కోట్లతో 63 వేల843 గ్రామాల్లో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు.తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ జిల్లాలో 10 మండలాలయిన నర్సాపూర్, హవేలీ ఘన్పూర్, రామాయంపేట, కౌడిపల్లి, నర్సాపూర్, పాపన్నపేట్, టేక్మాల్, రేగోడు , మాసాయిపేట, శంకరంపేట ఆర్ లను ఎంపిక చేశారు.ఆయా మండలాలలో మౌలిక వసతుల కల్పన కోసం గ్రామాలలో ఎంపిక చేసిన పనులకు నిధుల మంజూరి కోసం ప్రతిపాదనలు పంపించవలసి ఉంటుంది.ఈ సందర్భంగా ఎంపీ మాధవనేని రఘునందన్ రావు కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్,సంబంధిత గిరిజన సంక్షేమ అధికారులతో కలిసి తో బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం సభను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ మాధవనేని రఘునందన్ రావు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం, గిరిజన బిడ్డల అభ్యున్నతి, ఆదివాసి హక్కుల కోసం సముచిత లక్ష్యం దిశగా పోరాడిన గొప్ప మహనీయుడు బిర్సా ముండా అని అన్నారు. నేటి బాలురే రేపటి పౌరులు మీ తెగల భవిష్యత్తు బాగుండాలంటే విద్యార్థులకు బిర్సా ముండా గారి చరిత్రను తెలియజేయాలన్నారు మీ తాండాలో భారత ప్రభుత్వం మీ తెగల సంక్షేమం కోసం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు గ్రామస్థాయిలో అవగాహన చేసుకోవాలన్నారు. ఒక దీపం ఇంకొక దీపాన్ని వెలిగించిన విధంగా ఒక గిరిజన బిడ్డల చైతన్య వచ్చిన ఒకరికి సంక్షేమ పథకం అందిన వారి నుంచి గ్రామస్థాయిలో అభివృద్ధి పథకాలు విస్తరిస్తాయన్నారు.

ఆంగ్లేయులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో భారత సంగ్రామ చరిత్రలో బిర్సా ముండా గారి పేరు లేకుండా చరిత్ర రాయలేని గొప్ప నాయకుడు అని కొనియాడారు. ఆదివాసుల స్థితిగతులను మెరుగుపరచడానికి వివిధ పథకాలను ప్రారంభిస్తున్నారని తెలిపారు దీనిలో భాగంగా ఆదివాసి గూడాలలో తాండాలలో మౌలిక వసతులు కల్పన మరియు విద్యార్థుల విద్య కొరకు 1000 ఆశ్రమ గురుకుల పాఠశాల ఏర్పాటు చేస్తున్నారని లి తెలిపారు.కేంద్ర ప్రభుత్వ పథకాలపై భారత ప్రభుత్వం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గారు ఆదివాసి సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలు ప్రపంచానికి తెలియజేయడం జరిగిందన్నారు .2014 సంవత్సరంలో దేశ ప్రధానమంత్రిగా బాధ్యతలు తీసుకున్న ఆయన అనుక్షణం గిరిజన అభ్యున్నతి లక్ష్యంగా దేశంలోని కరెంటు లేని 18 వేల గ్రామపంచాయతీలకు కరెంటు ఇచ్చారని వివరించారు. అలాగే మొబైల్ హెల్త్ వ్యాన్లు ఏర్పాటు చేశారని, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన అనే పథకం ద్వారా అన్ని గ్రామపంచాయతీలో రోడ్లు నిర్మించడం జరిగిందని, తెలిపారు.గిరిజనులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకొని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ గిరిజన జాతి ఆత్మగౌరవం ఇనుమడింప జేసిన చైతన్య దీప్తి. ఆశా జ్యోతి... ధర్తి ఆబా భగవాన్ బిర్సా ముండా అన్నారు.బ్రిటిష్ వారి ప్రాబల్యం ఉన్నప్పుడే విల్లంబులచే చిన్న కుగ్రామం నుండి వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడన్నారు. విద్యా, వైద్యం ,ఉపాధి, వ్యవసాయం అనే అంశాలలో ప్రతి అంశాన్ని పరిగణలోకి తీసుకొని అన్ని శాఖల సమన్వయంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో గిరిజనులు ఉపయోగించుకునే విధంగా అవగాహన చేయడం దరఖాస్తులు స్వీకరించడానికి గిరిజనులకు గ్రామస్థాయిలో ప్రోత్సహించాలని చెప్పారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వినియోగించుకోవాలన్నారు.





**కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న పథకాలు**

1. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ)లో 20 లక్షల పక్కా గృహాలు
2. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన లో 25 వేల కిలోమీటర్ల పొడవైన రహదారులు
3. జల్ జీవన్ మిషన్ లో 29,462 గ్రామాలు
4. గృహ విద్యుత్ మరియు ఆఫ్ గ్రిడ్ సౌర మరియు నూతన సౌర విద్యుత్ పథకం లో విద్యుత్ సౌకర్యం లేనటువంటి 2.35 లక్ష కుటుంబీకులకు మరియు ప్రజా సంస్థలు గ్రిడ్ ద్వారా సౌకర్యం లేనటువంటి ప్రతి కుటుంబానికి మరియు ప్రజా సంస్థలు
5. అటవీ హక్కుల చట్టం 2006 (ఎఫ్ఆర్ఏ) లో ఎఫ్ఆర్ఏ విభాగాల ఏర్పాటు మరియు సిఎఫ్ఆర్ నిర్వహణ పరమైన పథకాల అమలు
6. ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన లో 11,539 గ్రామాలు
7. జాతీయ ఆరోగ్య మిషన్ లో 1000 సంచారం మెడికల్ యూనిట్లు
8. జాతీయ సికిల్ సెల్ మిషన్ లో సికిల్ సెల్ వ్యాధి కొరకు అధీకృత మరియు అవగాహన కేంద్ర ఏర్పాటు
9. సమగ్ర శిక్ష అభియాన్ లో 1000 వసతి గృహాలు
10. ఎం ఓ ఎఫ్ డబ్ల్యూ బహుళ పథకాలు లో రెండు లక్షల లబ్ధిదారులు అయినటువంటి %ఖీ=ూ% పట్టాదారులను స్థిర వ్యవసాయం దిశగా ప్రోత్సహించడం
11. అంగన్వాడి సేవలు లో 8000 అంగన్వాడి కేంద్రాలు
12. టెలికాం సాంకేతిక అభివృద్ధి నిధి లో 5000 గ్రామాలు
13. స్వదేశీ దర్శన్ లో 1000 గిరిజన గృహ నివాసితులకు
14. పీఎం మత్స్య సంపద యోజన లో 10000 సామాజిక మరియు 1లక్ష వ్యక్తిగత లబ్ధిదారులకు చేపల పెంపకం పై సహకారం
15. నైపుణ్య భారత మిషన్ లో గిరిజన జిల్లాల్లో 1000 నైపుణ్య కేంద్రాలు %ఎణఎఖ% లు గిరిజన సమూహాలు తదితరాలు ఉన్నాయన్నారు

తదనంతరం విద్యార్థిని విద్యార్థుల నృత్యాలు, ఆలపించిన చైతన్య గీతాలు సభికులను అలరింప జేశాయి.

మెదక్ జిల్లా గిరిజన బాల బాలికలు రాష్ట్రస్థాయిలో క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి సమున్నత స్థానాన్ని సంపాదించుకున్న క్రీడాకారులను అభినందిస్తూ మెమొంటో మెడల్స్ తో ముఖ్య అతిథులు సత్కరించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మంచు నగేష్ , గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ ఆఫీసర్ శ్రీమతి ఇందిర, జెడ్ పి సి ఈ ఓ శ్రీ ఎల్లయ్య , జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి శ్రీమతి నీలిమ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, గిరిజన సంఘాల నాయకులు, వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన గిరిజనులు, విధియార్థినీ విద్యార్థులు మరియు గిరిజన అభివృద్ధి అదికారి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అప్గ్రేడ్ అయిన అంగన్వాడీ లకు పెండింగ్ వేతనాలు త్వరగా జమ చేయండి:

## మంత్రి సీతక్క ను కోరిన ఆడెపు వరలక్ష్మీ

**తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి నవంబర్ 15**

రాష్ట్రంలో ఉన్న 3989 మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్వాడీ కేంద్రాలుగా అప్గ్రేడ్ చేసి, జనవరి నెల నుండి ప్రధాన అంగన్వాడీ లతో సమానంగా వేతనాలు అందజేస్తున్న మినీ అంగన్వాడీ లకు కొన్ని సాంకేతిక కారణాల వల్ల గత ఐదు నెలల నుండి పాత వేతనాలు జమ చేస్తున్నారు,దీంతో మినీ అంగన్వాడీ లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు అని,ప్రధాన అంగన్వాడీ టీచర్లకు నెలకు రూ.13,500, మినీ అంగన్వాడీల టీచర్లకు రూ.7,500 చెల్లించేవారు. అప్గ్రేడ్ చేయడంతో అందరికీ సమాన వేతనం లభించే అవకాశం ఏర్పడింది. ఏప్రిల్, మే నెలలో రూ.13,500 ఇచ్చినా, జూన్ నుంచి మళ్లీ రూ.7,500 మాత్రమే జమ చేస్తున్నారు. మరి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా ట్రెజరీలో సాంకేతిక సమస్యనే దీనికి కారణమని అధికారులు చెబుతున్నారు (మినీ) అంగన్వాడీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మీ అన్నారు.ఇటీవలే మంత్రి సీతక్క తో జరిపిన ముఖాముఖిలో మినీ అంగన్వాడీ ల పెండింగ్ వేతనాలు త్వరగా జమ చేయాలని వారిని కోరారు.కాగా, ప్రధాన కేంద్రంలో ఒక టీచర్, ఒక హేల్పర్ విధులు నిర్వహిస్తుండగా.. అప్గ్రేడ్ అయిన మినీ కేంద్రాల్లో ఒక్క టీచర్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇద్దరి పనిని ఒకరే చేస్తూ ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు అని,త్వరగా పెండింగ్ వేతనాలు జమ చేసి, ఆయా లను త్వరగా నియమించాలని ఆడెపు వరలక్ష్మీ మంత్రి సీతక్క ను ఒక్క ప్రకటన లో కోరారు.



# సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న, హుజరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్

## గందె రాధిక శ్రీనివాస్..

**( తెలుగు వెలుగు కరీంనగర్ బ్యూరో నవంబర్ 15 )**

కరీంనగర్ జిల్లా హుజరాబాద్ పట్టణ కేంద్రంలో గల ప్రముఖ దేవాలయం పాటి మీద ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆలయ అర్చకులు తిరుమల్, విశ్వనాధ శర్మ, లలిత్, సురేష్, ప్రదీప్, రాకేష్,అధ్యక్షతలో ఘనంగా నిర్వహించారు..సత్యనారాయణ స్వామి వ్రతంలో,హుజురాబాద్ బల్దియా చైర్ పర్సన్ గందె రాధిక శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నారు.. అనంతరం వారు మాట్లాడుతూ...పవిత్రమైన కార్తీక మాసంలో వెలిగించిన దీపకాంతులు హుజురాబాద్ ప్రాంత ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.కార్తీక పౌర్ణమి వేళ ఈ వ్రతం నిర్వహించడం శుభప్రదమని పేర్కొన్నారు.పురాణాల్లో సైతం కార్తీక పౌర్ణమి రోజు చేయవలసిన పూజలు, వ్రత విధానాల గురించి పండితులు పేర్కొనడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఈ వ్రత కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..



# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ తో కలిసి పరిశీలించిన

## జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు

**తెలంగాణ తెలుగు వెలుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ : 15**

కొమురంభీమ్ అసిఫాబాద్ జిల్లా కేంద్రంలో పోలీస్ స్టేషన్ పరిధిలోని అప్పపల్లి గ్రామం లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఐఏఎస్ తో కలిసి జిల్లా ఎస్పీ డివి శ్రీనివాస రావు ఐపీఎస్ సందర్శించడం జరిగింది. అక్కడ విధుల్లో ఉన్న అధికారులను కొనుగోలు ప్రక్రియను గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని మాయమాటలు చెప్పే దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు వెంటనే సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం నిర్వాహకులను వివరాలను అడిగారు, అలాగే రైతుల వివిధ సమస్యలు తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఏదేని సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.



# నిరుపేద విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించండి

**- బీఆర్ఎస్ నేత చిమ్ముల గోవర్ధన్ రెడ్డిని కోరిన మంబాపూర్ గ్రామ ప్రజలు**

**తెలుగు వెలుగు ప్రతినిధి**

నిరుపేద విద్యార్థులకు రవాణా సౌకర్యాన్ని కల్పించాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డిని మంబాపూర్ గ్రామ ప్రజలు కోరారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలో నిరుపేద విద్యార్థులకు కేవలం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల 5వ తరగతి వరకే ఉండడం. ఆపై చదువుల కొరకు మండల కేంద్రమైన గుమ్మడిదల లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి ఉంటుంది. మంబాపూర్ గ్రామం నుండి గుమ్మడిదల మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేరా దూరం.. విద్యార్థులు రావాల్సి ఉంటుంది. దీంతో విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు వచ్చి వెళ్ళేందుకు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మంబాపూర్ గ్రామ ప్రజాప్రతినిధులు ప్రజలు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డిని కలిశారు. తమ గ్రామ నిరుపేద విద్యార్థులకు రవాణా సౌకర్యాన్ని కల్పించాలని ఆయనను కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన గోవర్ధన్ రెడ్డి త్వరలోనే విద్యార్థుల కొరకు ప్రత్యేకంగా ఆటో రవాణా సౌకర్యాన్ని కల్పిస్తామని గ్రామ ప్రజలకు హామీ ఇచ్చారు. తాజా మాజీ సర్పంచ్ కంజర్ల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ దయానంద్, నాయకులు బి ఆర్ ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు చాకలి ప్రకాష్ ,దయానంద్ ,లక్ష్మణ్, రాజు, నాగరాజు, సాయి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# గుడికోటలో సామూహిక సత్యనారాయణ వ్రతం

**తెలుగు వెలుగు ప్రతినిధి. రాయికల్ నవంబర్ 15**

.రాయికల్: రాయికల్ పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి పంచముఖ లింగేశ్వర ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని ఆలయ అర్చకులు వినయ్ కుమార్ శర్మ నిర్వహించారు.ఇట్టి సత్యనారాయణ స్వామి వ్రతం లో దాదాపు 60 జంటలు పాల్గొన్నారు.సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న జంటలకుకమిటీ సభ్యులుఅన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాయికల్ మండల గిరిదావార్ పద్మయ్య,కమిటీ సభ్యులు, చండీపరివార్ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.






# సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

**( తెలుగు వెలుగు ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 15)**

తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన సత్యనారాయణస్వామి వ్రతంలో కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్రమైన కార్తీక మాసంలో వెలిగించిన దీపకాంతులు ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. కార్తీక పౌర్ణమి వేళ ఈ వ్రతం నిర్వహించడం శుభప్రదమని పేర్కొన్నారు. పురాణాల్లో సైతం కార్తీక పౌర్ణమి రోజు చేయవలసిన పూజలు, వ్రత విధానాల గురించి పండితులు పేర్కొనడం జరిగిందని ఆయన గుర్తు చేశారు.సనాతన ధర్మంలో హింధువులకు అత్యంత ముఖ్యమైన పండుగలో కార్తీక పౌర్ణమి కూడా ఒకటని,పరమశివుడితోపాటు శ్రీమహావిష్ణువుకు కూడా అత్యంత ఇష్టమైన పర్వ దినమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి, రేణిగుంట గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్కపల్లి రాజు, కవ్వంపల్లి యువసేన జిల్లా అధ్యక్షుడు నోముల అనిల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్కపల్లి శ్రీధర్, తమ్మనవేని రాములు యాదవ్, సురేందర్ రెడ్డి, బోయినపల్లి కృష్ణ బాబు, ఎండి హసన్, రవి, వచ్చునూరు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.





# గండ్ర సత్యన్న పై అవధుల్లేని అభిమానాన్ని చాటుకున్న

## ఆకుతోట కుమారస్వామి, వైనాల రమేష్

**- పుట్టిన రోజు కానుకగా గండ్ర సత్యన్న చేస్తున్న సేవలపై సాంగ్**

**- సీడీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**( తెలుగు వెలుగు ప్రతినిధి నవంబర్ 15)**

భూపాలపల్లి అభివృద్ధి ప్రదాతగా.. పేద ప్రజల పెన్నిధిగా..నిరంతరం ప్రజాసేవకై పరితపిస్తున్న బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి కిరణంలా..నిస్వార్థ సేవకు నిలువెత్తు నిదర్శనంలా పేరు ప్రఖ్యాతులు గడించిన..జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్ధారం గ్రామంలో గండ్ర సుశీల-సమ్మారావు దంపతులకు 15 నవంబర్ 1960న జన్మించిన కోహినూర్ వజ్రం గండ్ర సత్యనారాయణ రావు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి నేతృత్వంలో మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బాణాసంచా పేల్చి సంబరాలను జరుపుకున్నారు. అనంతరం కేక్ ను కట్ చేసి..పండ్లు, స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, మండల నాయకుడు వైనాల రమేష్ లు గండ్ర సత్యన్న పై అవధుల్లేని అభిమానాన్ని చాటుకున్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని వైనాల రమేష్ సాంగ్ ను రాయగా..ఆకుతోట కుమారస్వామి ప్రొడ్యూసర్ గా వ్యవహరించారు. కాగా ఆ సాంగ్ ను సిడి చేయగా..భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు శుక్రవారం రేగొండ మండలంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం నందు ఆ సీడీని ఆవిష్కరించారు. అలాగే మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని సాంబశివ సామూహిక దేవాలయంలో గండ్ర సత్యన్న నిండు నూరేళ్లు కలకాలం ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకుతోట కుమార్ స్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో చిట్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుదర్శన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు తక్కల్లపల్లి రాజు, కాంగ్రెస్ పార్టీ మొగుళ్లపల్లి మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండి రఫీ, జిల్లా నాయకులు కేతిపల్లి తిరుపతిరెడ్డి, మండ రవీందర్ గౌడ్,





పిఏసిఎస్ వైస్ చైర్మన్ కొమురోజు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మొగుళ్లపల్లి టౌన్ ప్రెసిడెంట్ క్యాతరాజు రమేష్, జిల్లా, మండల నాయకులు నల్ల లింగారెడ్డి, చర్లపల్లి శ్రీధర్, కూస సుమన్, ఎలేటి శివారెడ్డి, పడిదల ప్రకాష్ రావు, మల్సాని రాజేశ్వర్ రావు, బండారి ఓదెలు, దానవేణి మొగిలి, యార అజయ్, మధుకర్, విజేందర్, మహిపాల్ రెడ్డి, గజ్జి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గండ్ర సత్యన్నకు అభినందనల వెల్లువ

**-మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పోలినేని లింగారావు**

**(తెలుగు వెలుగు ప్రతినిధి నవంబర్ 15)**

భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పుట్టినరోజు సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మొగుళ్ళపల్లి మాజీ పీఏసీఎస్ చైర్మన్ పోలినేని లింగారావు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావును శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి..పుష్పగుచ్ఛం అందించి..ఆయన సమక్షంలో కేక్ కట్ చేసి..జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భూపాలపల్లి అభివృద్దే లక్ష్యంగా..ప్రజల సమస్యలే తన ఎజెండా..బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి కిరణంలా..ముందుకు సాగుతున్న గండ్ర సత్యన్న ఆ భగవంతుని దీవెనలతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని, ప్రజల ఆశీస్సులతో మరింత ఉన్నతమైన స్థానంలో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.




## అయ్యప్ప ఆలయంలో

# ప్రత్యేక పూజలు...

**తెలుగు వెలుగు ప్రతినిధి. రాయికల్ .నవంబర్ 15.**

రాయికల్ అయ్యప్ప ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో స్వాములు అయ్యప్ప దీక్ష చేపట్టారు.. అయ్యప్ప దీక్షపరులకు సాయప్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో నేటి నుంచి సంక్రాంతి వరకు మధ్యాహ్నం బిక్ష, రాత్రి అల్పాహారం ఏర్పాటు చేయగా సాయాప్ప ట్రస్ట్ చైర్మన్ నివేదిత కృష్ణారావు ప్రారంభించారు .. దీక్షపరులు వినియోగించుకోవాలని సూచించారు.. ఈ కార్యక్రమంలో సాయప ట్రస్టు వైస్ చైర్మన్ హిమవంత రావు దంపతులు పురపాలిక చైర్మన్ మోర హన్మాండ్లు, పురపాలిక వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి,భరత్ రెడ్డి, ఎనుగందుల రమేష్, రామకృష్ణ, సింగని రమేష్, నిరటి శ్రీను, మరిపెల నారాయణగౌడ్, గన్నె రాజ రెడ్డి వేణు,సత్తయ్య, గురు స్వాములు తదితరులున్నారు.





# తల్లి కొడుకుల హత్య దారుణం

**సమాజంలో హింసకు తావు లేదు**

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి**

**అంతక్రియల ఖర్చు నిమిత్తం బాధిత కుటుంబానికి 20వేల ఆర్థిక సహాయం**

**తెలుగు వెలుగు ప్రతినిధి**


తల్లి కొడుకుల హత్య దారుణమని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం గుమ్మడిదల మండల పరిధిలోని బొంతపల్లి వీరభద్ర నగర్ కాలనీలో చోటుచేసుకున్న తల్లి కొడుకుల హత్యపై బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక మనిషిని మరో మనిషి ప్రాణం తీస్తూ హత్య చేయడం దారుణమని అన్నారు. మండలంలో మునుపెన్నడు చోటుచేసుకుని విధంగా తల్లి కొడుకుల హత్య తనను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. సమాజంలో హింసలకు తావు లేదని అన్నారు. మరోసారి ఇలాంటి అమానుష ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ.. అంతక్రియల ఖర్చు నిమిత్తం 20000 రూపాయల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబ సభ్యురాలు జ్యోతి కి అందజేశారు.



# కూసుమంచి గణపేశ్వరాలయానికి పోటెత్తిన భక్తజనం

**(తెలుగు వెలుగు ప్రతినిధి నవంబర్ 15)**

కూసుమంచి : కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని కూసుమంచిలోని గణపేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. శుక్రవారం తెల్లవారుజామున కార్తిక స్నానాలు ఆచరించి శివాలయానికి వచ్చి మహాశివుని దర్శించుకున్నారు. స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీకమాసములో పౌర్ణమి రోజు చాలా పవిత్రమైనదిగా భావిస్తారు. ఈ కార్తీక పౌర్ణమి అనేది హరి, హారులకు అత్యంత ప్రీతికరమైన మాసం. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు శేషగిరి శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే పెద్ద ఎత్తున వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. దీంతో శివాలయం కోలాహాలంగా మారింది. శివాలయానికి వచ్చిన భక్తులకు ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో పులిహోర ప్రసాదం అందజేశారు





# కులగణన దేశానికి రోల్ మోడల్

**కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి**

**వెలిచాల రాజేందర్ రావు**

(తెలుగు వెలుగు ప్రతి నిధి కరీంనగర్ నవంబర్ 15 )

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా కుల గణన కార్యక్రమాన్ని చేపట్టిందని, ఇది దేశానికి రోల్ మోడల్ గా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్ లోని 22వ డివిజన్ పరిధి వావిలాల పల్లిలో చేపట్టిన కుల గణన ఇంటింటా సమగ్ర సర్వేను వెలిచాల రాజేందర్ రావు స్థానిక కార్పొరేటర్ గంట కళ్యాణి-శ్రీనివాస్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వేకు సంబంధించిన వివరాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజేందర్ రావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మరింత పకడ్బందీగా సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందేలా సమగ్ర సర్వేను చేపట్టిందని పేర్కొన్నారు. సర్వే తో ఇంకా అనేక ప్రయోజనాలను ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లుగా కుల గణన చేపట్టకుండా కాలయాపన చేస్తుండడంతో రాష్ట్ర ప్రభుత్వమే ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. దేశంలోనే ఈ సర్వే ఆదర్శంగా నిలుస్తుందని, తద్వారా కేంద్ర ప్రభుత్వమే త్వరలో కులగణన దేశవ్యాప్తంగా చేప ట్టాల్సిన పరిస్థితి వస్తుందని చెప్పారు. ప్రజలంతా ఎలాంటి ఆందోళన చెందకుండా అన్ని వివరాలను సర్వే సిబ్బందికే అందించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న దని రాజేందర్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గంట కళ్యాణి-శ్రీనివాస్, కాంగ్రెస్ నేత తుమ్మనపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



# హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి లో వైద్యుల నిర్లక్ష్యానికి పసికందు మృతి

**ఆసుపత్రి వద్ద మృత శిశువుతో బంధువుల ఆందోళన...**

**పోలీసులకు ఫిర్యాదు....**

( తెలుగు వెలుగు ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 15 )



ప్రసూతి వైద్యం కోసం కరీంనగర్ జిల్లా హుజురాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళితే అక్కడ వైద్యుల నిర్లక్ష్యానికి గర్భ శిశువు బలైంది.బాధితులు తెలిపిన కథనం ప్రకారం...వివరాల్లో.....కరీంనగర్ కు చెందిన కళ్లెం లక్ష్మి ప్రెగ్నెన్సీ డెలివరీ కోసం హుజురాబాద్ బుడిగ జంగ కాలనీలోని తన తల్లి గంధం రాజేశ్వరి వద్దకు వచ్చి,ఇక్కడే ఉంటూ రెగ్యులర్ గా హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటుంది. లక్ష్మికి గురువారం రోజున సాయంత్రం పురిటినొప్పులు రావడంతో హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్తే..వెంటనే ఆపరేషన్ చేయాలని చెప్పిన వైద్యులు సమయానికి చికిత్స చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పుట్టిన ఆడ శిశువు మృతి చెందిందని బాధితురాలి బంధువులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం రాత్రి మృతి చెందిన శిశు మృతదేహంతో బాధితురాలు లక్ష్మీ భర్త కళ్లెం నాగరాజు, తల్లి రాజేశ్వరి, బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. తమ పురిటి బిడ్డ మృతికి కారణమైన హుజరాబాద్ ప్రభుత్వ వైద్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోని, తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితురాలు తల్లి రాజేశ్వరి సర్కిల్ ఇన్స్పెక్టర్ కు ఫిర్యాదు చేశారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సి. డి. ఎఫ్. డి. కేంద్రాన్ని చూపించిన సైంటిస్ట్ ఎలగందుల రమేష్.

( తెలుగు వెలుగు ప్రతినిధి నవంబర్ 15 )

రాజాపేట మండల కేంద్రానికి చెందిన సైంటిస్ట్ ఎలగందుల రమేష్ రాజపేట ప్రభుత్వ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు హైదరాబాదులోని సి.డి.ఎఫ్. డి. కేంద్రాన్ని చూపించారు. ఈ సందర్భంగా సైంటిస్ట్ ఎలగందుల రమేష్ మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలలో చదివే విద్యార్థులకు తన వంతు బాధ్యతగా ప్రతి సంవత్సరం బాలల దినోత్సవం రోజు వైజ్ఞానిక కేంద్రాలకు తీసుకు వెళ్ళనున్నట్లు చెప్పారు. సి.డి.ఎఫ్. డి. సెంటర్లో ఫోరెన్సిక్ ల్యాబ్, జన్యు లోపం పై రీసెర్చ్, కరోనా సమయంలో సెంటర్ చేసిన ప్రయోగాలు, విజయాలను, రెగ్యులర్ రీసర్చ్ లను స్వయంగా విద్యార్థులకు వివరించినట్లు వారి అనుమానాలను నివృత్తి చేసినట్లు చెప్పారు. పిల్లలు ఇన్స్పైర్ అయ్యే విధంగా తాను ఈ కార్యక్రమాలను ప్రతి సంవత్సరం నిర్వహించనున్నట్లు రమేష్ చెప్పారు. ఈ సందర్భంగా సైంటిస్ట్ ఎలగందుల రమేష్ ను మండల విద్యాధికారి చందా రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సట్టు జయంత, పాల్గొన్న ఉపాధ్యాయులు జానయ్య, సంజీవులు, అనిత, ఆశాబేగం లో కృతజ్ఞతలు చెబుతూ అభినందించారు.




# సత్యనారాయణ రావు ని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన

**మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇంగిలే రామారావు.**

( తెలుగు వెలుగు ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 15)

శుక్రవారం భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు,జన్మదినం సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇంగిలే రామారావు, టేకుమట్ల మండలంలో ఎమ్మెల్యే ని కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసీ శాలువాతో సత్కరించి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉప్పల శ్రీనివాస్ రెడ్డి గొడిశాల పరమేష్ మూడేత్తుల మల్లేష్ సింగిరెడ్డి గోపాల్ రెడ్డి ఎడ్ల కిషన్ రెడ్డి ఎండి లాల్ రాష్ట్ర నాయకులు గాజర్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# కులగణనకు వ్యతిరేకంగా భాజపా కుట్ర

**-బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్**

( తెలుగు వెలుగు ప్రతినిధి నవంబర్ 15)



రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన కులగణనకు వ్యతిరేకంగా భాజపా కుట్రలు చేస్తుందని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ మండిపడ్డారు. శుక్రవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. కులగణనను వ్యతిరేకిస్తున్న పార్టీలకు పుట్టగతులుండమన్నారు. బీసీ రిజర్వేషన్లను పెంచేందుకే ప్రభుత్వం కులగణన చేపట్టిందన్నారు. కులగణన కోసం వచ్చే అధికారులకు ఆటంకం కలిగించ వద్దన్నారు. అగ్రకులాల కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. బీసీలు కులగణనలో కులాన్ని నమోదు చేసుకోవాలన్నారు. స్థానిక ఎన్నికల లోపు కులగణనను పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా కులగణనపై ప్రభుత్వం ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాజ్యాధికారం సాధించేవరకు ఉద్యమాలు కొనసాగుతాయన్నారు.

# కులగణన సర్వేలో వ్యక్తిగత వివరాలు సేకరించొద్దు

**ప్రజల సందేహాలను అఖిలపక్షంలో ప్రభుత్వం నివృత్తి చేయాలి .**

**సీపీఐ(ఎం) సదాశివపేట ఏరియా కార్యదర్శి వి ప్రవీణ్ కుమార్ డిమాండ్**

(సంగారెడ్డి జిల్లా తెలుగు వెలుగు ప్రతినిధి- సదాశివపేట )



రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వే పేరుతో వ్యక్తిగత వివరాలు సేకరించడం తగదని సీపీఐ(ఎం) సదాశివపేట ఏరియా కార్యదర్శి వి ప్రవీణ్ కుమార్ తెలిపారు. దేశ జనాభా లెక్కల్లో కులగణన చేర్చాలనే చర్చ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. ఈ సర్వే పత్రంలో కులంతోపాటు ఆస్తులు, రాజకీయ, వ్యవసాయ భూములకు సంబంధించిన వ్యక్తిగత వివరాలతో కూడిన ప్రశ్నలున్నాయని వివరించారు. ఆ వివరాలు ఇవ్వడానికి పలు అనుమానాలు, వ్యతిరేకత ప్రజల్లో వ్యక్తమవుతు న్నాయని తెలిపారు. అటువంటి ప్రశ్నలను మినహాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. వ్యక్తిగత ప్రశ్నలకు సంబంధించిన వివరాలు వెల్లడిరచడానికి ప్రజలు విముఖత వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. కొన్ని చోట్ల ఎదురు తిరుగుతున్నట్టు, దాడులు చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయని తెలిపారు. రేషన్ కార్డులు తొలగించడానికి, సంక్షేమ పథకాలు రద్దు చేయడానికే ఈ సర్వే చేస్తున్నారంటూ ప్రజల్లో సందేహాలు రేకెత్తుతున్నాయని పేర్కొన్నారు. కొన్ని చోట్ల సర్వే చేస్తున్న వారిని వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లను అనుమానించే సందర్భాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. అందువల్ల పై అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి సందేహాలను నివృత్తి చేయాలని కోరారు.

# నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లకు సన్మానం..

**కాంగ్రెస్ పార్టీ మాజీ యువజన కాంగ్రెస్ ప్రదాన కార్యదర్శి**

**మిదిదొడ్డి శ్రీనివాస్.**

(తెలుగు వెలుగు ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 15)

కరీంనగర్ జిల్లా హుజరాబాద్ నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లకు సన్మానం చేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,మాజీ యువజన కాంగ్రెస్ నియోజక వర్గ ప్రదాన కార్యదర్శి మిదిదొడ్డి శ్రీనివాస్.కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా, పార్టీ కష్టకాలంలో ఉన్న వ్యక్తుల గుర్తించి పార్టీలో తగిన గుర్తింపునిచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ కి,కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్ బాబు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భగా మిదిదొడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.. హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ రైతులకు ఎలాంటి సమస్య తలెత్తకుండా చూడాలని , రైతు పక్షపాతి ప్రభుత్వం అయినా కాంగ్రెస్ పార్టీ విధివిధానాలను విస్మరించకుండా చూడాలని ఆయన కోరారు.. ఈ కార్యక్రమం లో ఉట్ల రత్నాకర్ రెడ్డి, రాజు,లతో పాటు తదితరులు పాల్గొన్నారు



# క్యూలైన్‌లో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య సాధారణ వ్యక్తి మాదిరిగా కంటి పరీక్షలు ఇలాంటి నాయకులు ఒక్కరు ఇప్పుడు ఉన్న జనరేషన్ లో లేరు

తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి

ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా నిరాడంబర జీవనం గడిపే ఖమ్మం జిల్లా ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ఏళ్లు గడుస్తున్నా అదే ఒరవడి సాగిస్తున్నారు. సైకిల్‌పై వెళ్లడం,ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం వంటివి ఆయన విషయంలో సర్వసాధారణంగా కనిపిస్తాయి.ఇదే క్రమాన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రిలో కంటి పరీక్షల కోసం బుధవారం ఆయన వచ్చారు.అక్కడ అందరితోపాటే ఓపీ చీటీ తీసుకుని వైద్యుల గది ముందు క్యూలో వేచి ఉండి తన వంతు వచ్చాక పరీక్ష చేయించుకున్నారు.వార్డుమెంబర్,ఎంపీటీసీలే హంగూ ఆర్భాటాలతో జీవిస్తుండగా 25 ఏళ్లు ఎమ్మెల్యేగా కొనసాగిన గుమ్మడి నర్సయ్య అందుకు విరుద్ధంగా వ్యవహరించడాన్ని పలువురు అభినందించారు.....



# దోపిడి పీడనకు అమరులైన వీరులకు విప్లవ జోహార్లు

**తిమ్మిడి హనుమంతరావు.**

తెలుగు వెలుగు కూసుమంచి నవంబర్ 15

ఈ దేశంలో మనిషిని మనిషిని దోపిడీ చేసే వ్యవస్థ మార్పు కోసం. భూస్వామ్య పెట్టుబడుదారి సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా. భూమి కావాలని ఈ దేశ విముక్తి కోసం జరిగిన పోరాటంలో ఎందరో వీరులను ప్రభుత్వాలు ఎన్కౌంటర్ల ద్వారా హత్య చేయబడిన అని. అనారోగ్యతో మరణించి నవంబర్ నెలలో అమరవీరుల వారోత్సవాలు భాగంగా ఈరోజు తిరుమలాయపాలెం మండలం బచ్చోడు గ్రామంలో జరిగిన అమరవీరుల సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతున్న అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఏఐపీకేఎంఎస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిరి హనుమంతరావు మాట్లాడుతూ. నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు పేద ప్రజలకు భూమి. భుక్తి కోసం అమరులైన కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి. పైల వాసుదేవరావు. రాయల సుభాష్ చంద్రబోస్. రామనర్సయ్య. డివి కృష్ణ. శ్రీపాద శ్రీహరి. చంద్ర కృష్ణమూర్తి. కోటన్న. చింతా లక్ష్మక్క. సుజాత. రంగవల్లి. సురేష్ అన్న. కందాల నరసింహారెడ్డి. రాయల నాగేశ్వరరావు. కల్లూరు వాసయ్య. మందుల చంద్రయ్య. మెట్టు భద్రయ్య. రాయల రాంబయమ్మ. సిరా శివయ్య ఎందరో వీరులు వారి అమూల్యమైన ప్రాణాలను అర్పించారని అన్నారు. వారి ఆశయ సాధనలో ప్రతి ఒక్కరు పరిచేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. బచ్చోడు సెంటర్ గా 20 గ్రామాలు ఉన్నటువంటి బచ్చోడు గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేసేంతవరకు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్( ప్రజాపంధ ) పోరాటం ఉధృతం చేస్తామని తిమ్మి డి హనుమంతరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీని ఎన్నికల్లో గెలిపిస్తే 6 నెలలు గడవక ముందే బచ్చోడు గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తానని పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారని వెంటనే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో దార మల్ల వెంకన్న. గొర్రెపాటి వీరయ్య. కారుపాటి వెంకయ్య. తిమ్మిడి రఘుబాబు. గొర్రెపాటి లచ్చయ్య. గొర్రెపాటి రాములు. అంగిరేకుల మల్లయ్య. గొర్రెపాటి నరసయ్య. గొర్రెపాటి ఉప్పమ్మ. జిల్లా కోటమ్మ. భద్రమ్మ. రవణ. గట్టిగుండ్ల సాలమ్మ. కుమారి. బిక్షం. నందిపాటి నాగేష్ తదితరులు. ఇట్లు తిమ్మిడి హనుమంతరావు కార్యదర్శి. అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా కమిటీ. ఫోటోలు ఉన్నది.




# అన్న ఎన్టీఆర్ క్యాంటీన్లో పేదలకు అన్నదానం

నవంబర్ 15 తెలుగు వెలుగు ఖమ్మం

తెలంగాణ రాష్ట్ర "వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు గౌరవ శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారి" జన్మదినం సందర్భంగా మోహన సాయి మరియు పవన సాయి టూ వీలర్ ఫైనాన్స్ వారి ఆధ్వర్యంలో కాల్వ ఒడ్డు లోని స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు గారి స్మారకం గా నిర్వహిస్తున్న ఖమ్మం అన్న క్యాంటీన్ వ్యవస్థాపకులు శ్రీ నల్లమల్ల రంజిత్ చౌదరి నిర్వహిస్తున్న క్యాంటీన్ లో నిరుపేదలకు అన్నదానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పోలూరి రమేష్ ,నెల్లురి సాయి రాజా నెల్లూరి వినోద్,రిషి మరియు సిబ్బంది చందు, మైఖేల్, తదితరులు పాల్గొన్నారు..



# గ్రూప్-3 పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్**

**ప్రశ్నాపత్రాలను స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచిన అధికారులు..**

(తెలుగు వెలుగు ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 15)

ఈనెల 17, 18 తేదీల్లో జరిగే గ్రూప్-3 పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ (స్థానిక సంస్థలు) పేర్కొన్నారు. జిల్లాలోని 56 కేంద్రాల్లో 26,415 మంది పరీక్ష రాయనున్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రశ్నాపత్రాలను ఉన్నతాధికారుల సమక్షంలో భద్రపరిచారు. అనంతరం పకడ్బందీగా సీలు వేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు.పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బ్యాగులను లోనికి అనుమతించమని పేర్కొన్నారు.బయోమెట్రిక్ విధానం కారణంగా మెహందీ , టాటూలు పెట్టుకోవద్దని సూచించారు. వారి వెంట ఆర్డీవో మహేశ్వర్, సూపరింటెండెంట్ కాళి చరణ్, పలువురు అధికారులు ఉన్నారు.





# ప్రతి ఒకరు పొగాకు వినియోగం కు దూరం గ ఉండాలి

**(సంగారెడ్డి జిల్లాతెలుగు వెలుగు ప్రతినిధి - సదాశివపేట )**

పొగాకుతో తయారయిన వస్తువులను మనిషి ఉపయోగించడం ఆరోగ్యానికి హానికరమని పొగాకు నియంత్రణ విభాగం జిల్లా సూపర్వైజర్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు.జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా సదాశివపేట లోని వివిధ కూడలి వద్ద మరియు బస్టాండ్ పరిసరాల దగ్గర, గాంధీ చౌక్ వద్ద, గురు నగర్ కాలనీలో అవగాహన నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పొగాకు ఉత్పత్తులు మనిషి వాడకం వల్ల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని,ప్రతి ఒక్కరూ పొగాకు వల్ల జరిగే నష్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.పొగాకు ఉత్పత్తులైన బీడీ చుట్ట,సిగరెట్,జరదా,తంబాకు,పాన్ మసాలా లాంటివి ఉపయోగించరాదన్నారు.వీటి వాడకం వల్ల మనుషుల్లో హైపర్ టెన్షన్,నోటి క్యాన్సర్,శ్వాసకోస మరియు గుండె సంబంధిత వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు.అదేవిధంగా బహిరంగ ప్రదేశాలలో ధూమపానం చేయడం సెక్షన్ 4 ప్రకారం నేరమని రూ. 200లు జరిమానా కూడా విధిస్తామన్నారు. విద్యాలయంలో చుట్టూ ఉత్పత్తుల అమ్మకం నిషేధం విద్యాలయాల చుట్టూ ఎవరైనా పొగా ఉత్పత్తి అమ్మినచో జరిమానా విది చాడం జరుగుతుంది అంతేకాకుండా ఈ కార్యక్రమంలో టీబీ కోఆర్డినేటర్ అరుణ టీబీ పైన పైన అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది ప్రకాష్ , ఇతరులు మరియు ప్రయాణికులు పాల్గొన్నారు




# కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా లో గ్రూప్ 3 పరీక్ష కేంద్రల వద్ద భారీ బందోబస్త్ :

## ఎస్పీ శ్రీనివాస రావు

**తెలంగాణ తెలుగు వెలుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ : 15**

కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ఈ నెల 17, 18 తేదీలల్లో గ్రూప్ 3 రాత పరీక్షల కారణంగా జిల్లా లోని 18 పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ - 163 సెక్షన్ విధించినట్టు జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ, పరీక్ష కేంద్రం వద్ద నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుంపులు గుంపులుగా కుడి ఉండవద్దు అన్నారు. రెండు సేషన్లలో ఈ పరీక్ష నిర్వహించనుండగా, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్ 1, మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 5:30 నిమిషాల వరకు పరీక్ష నిర్వహిస్తారు. నవంబర్ 18 వ తేదీన పేపర్-3 పరీక్షను ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు పరీక్షను నిర్వహిస్తారు. పరీక్ష సమయానికి 2 గంటలు ముందే సెంటర్ కు చేరుకోవాలి, ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలని సూచించారు.



# భద్రాద్రి జిల్లాస్థాయి వైజ్ఞానిక సదస్సు నిర్వాహణకు తోడ్పాటు అందించండి ఎమ్మెల్యే జారె...

## రాజ్య స్థరీయ బాల్ వైజ్ఞానిక్ ప్రదర్శిని

**అన్నపురెడ్డిపల్లి: నవంబర్ 15 (తెలుగు వెలుగు ప్రతినిధి)**

అన్నపరెడ్డిపల్లి మండల కేంద్రంలో ఈనెల 18 నుంచి మూడు రోజులపాటు అన్నపురెడ్డిపల్లిలో నిర్వహించే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాస్థాయి వైజ్ఞానిక సదస్సు విజయవంతం చేయడానికి తోడ్పాటు అందించాలని కోరుతూ సదస్సుకు రావలిసిందిగా పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు , భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు ,కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ,ఇల్లెందు శాసనసభ్యులు కోరం కనకయ్య , రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు ,అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మర్యాదపూర్వకంగా కలసి ఆహ్వాన పత్రికలను అందించారు..







# మెదక్ జిల్లా చేనేత ఐక్యవేదిక అధ్యక్షులుగా మహంకాళి కృష్ణమూర్తి.

## నియామక పత్రాన్ని అందజేసిన రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీర మోహన్.

**తెలుగు వెలుగు న్యూస్ పెద్ద శంకరంపేట్**

,పెద్ద శంకరంపేట గ్రామానికి చెందిన చేనేత సహకార సంఘం మాజీ చైర్మన్ మహంకాళి కృష్ణమూర్తినీ మెదక్ జిల్లా చేనేత ఐక్యవేదిక అధ్యక్షులుగా రాష్ట్ర చేనేత ఐక్యవేదిక అధ్యక్షులు రాపోలు వీర మోహన్ నిమ్మకాయ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహంకాళి కృష్ణమూర్తి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మెదక్ జిల్లా చైతన్య వేదిక అధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు వీర మోహన్.పద్మశాలి మెదక్ జిల్లా సంఘం అధ్యక్షులు జయ రాములు. గుజ్జరి కనకరాజు లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ పద్మశాలి కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి చైతన్య వేదిక ద్వారా తీసుకెళ్తానని అన్నారు.



# "షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం సమన్ సామాగ్రి ద్వాసం

**సంగారెడ్డి జిల్లా తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి**

అల్లాదుర్గం : అల్లాదుర్గం మండలంలోని చిల్వర్ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల నాగయ్య ఇంట్లో గురువారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్ తో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు ఫైర్ ఇంజన్ తో గ్రామానికి చేరుకునే లోపే ఇంట్లో ఉన్న నగదు తో పాటు నిత్యావసర సరుకులు మంటల్లో ఆహుతి అయినట్లు స్థానికులు తెలిపారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఇంటి యజమాని నాగయ్య మేకలు మేపేందుకు పొద్దున్నే వెళ్లి సాయంత్రం వచ్చి చూసేసరికి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. బాధితుడికి లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆయన అధికారులను కోరారు.



# అన్నపురెడ్డిపల్లిలో మంత్రి తుమ్మల పుట్టినరోజు వేడుకలు....

**అన్నపురెడ్డిపల్లి: నవంబర్ 15 (తెలుగు వెలుగు ప్రతినిధి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ఈరోజు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వనమా గాంధీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు అభిమానులు కేక్ కట్ చేసి టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోత్రనామాలతో పూజలు నిర్వహించి, శివాలయంలో అభిషేకాలు నిర్వహించినారు.ఈ కార్యక్రమంలో మండల యువజన అధ్యక్షులు లివేముల నరేష్ బాబు, మైనారిటీ నియోజకవర్గ నాయకులు సయ్యద్ అహ్మద్, సీనియర్ నాయకులు వేముల నారాయణ , మైనార్టీ నాయకులు గఫార్, రాజీవ్ హమాలి సంఘం, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు చల్లా పుల్లయ్య ,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు యాదల వెంకన్న, సేవాదళ్ మండల అధ్యక్షులు ఇమ్రాన్, ఖాదర్ బాబా, కాంగ్రెస్ నాయకుల వనమా శీను , కల్లోజు నరసింహారావు, దారా ప్రదీప్, కొత్తకోళ్ల మహేష్ , నందిగామ రమేష్, బోయినపల్లి అనీష్ , ఆచంటి ఆంజనేయులు, రుంజా భూక్షమ్మ తలారి శంకర్, ఖాదర్, ముస్తాఫా, బతిన్ శ్రీనివాసరావు, మాయర శీను, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెంకే పెద్దబ్బాయి, రేగులగడ్డ రమేష్, చంటి, కొత్త గుండ్ల తేజ మూర్తి, అశ్వరావుపేట నియోజకవర్గ యువ నాయకులు భుఖ్య చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.




## ఎమ్మెల్యేలకు కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జీ

# వెలిచాల రాజేందర్ రావు పరామర్శ ..

**(తెలుగు వెలుగు ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 15 )**

కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావును శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పరామర్శించారు. ఇటీవల గంగుల కమలాకర్ తల్లి నర్సమ్మ మృతి చెందింది. ఈ మేరకు కరీంనగర్ లోని గంగుల కమలాకర్ ఇంటికి రాజేందర్ రావు వెళ్లి ఆయనను పరామర్శించారు. నర్సమ్మ మృతి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే బుధవారం పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మామ మాధవరావు మృతి చెందారు. దీంతో ఎమ్మెల్యే విజయరమణారావును ఎలిగేడు మండలం శివపెల్లిలోని ఆయన నివాసంలో రాజేందర్ రావు పరామర్శించారు. ఈ సందర్భంగా మాధవరావు మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కరీంనగర్ లోని 45వ డివిజన్ కార్పొరేటర్ పిట్టల వినోద అత్తమ్మ మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను రాజేందర్ రావు పరామర్శించారు. తీగలగుట్టపల్లికి చెందిన దాసరి నారాయణ తండ్రి వెంకట్రాజం మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను రాజేందర్ రావు పరామర్శించారు. వెంకట్రాజం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఇందులో కాంగ్రెస్ నేత తుమ్మనపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




# అతి పురాతనమైన శ్రీ రామలింగేశ్వర మందిరాన్ని దర్శించుకున్న

## మంత్రి కొండా సురేఖ

**(సంగారెడ్డి జిల్లా తెలుగు వెలుగు ప్రతినిధి)**

సదాశివపేట మండలంలోని నందికందిలో కార్తీక పౌర్ణమి సందర్భంగా పురాతనమైన కొన్ని వందల సంవత్సరాల క్రితం నాటి రామలింగేశ్వర మందిరంలో మంత్రి కొండా సురేఖగారు వారి సకుటుంబ సమేతంగా పూజలు నిర్వహించడం జరిగింది, మంత్రి కొండా సురేఖ గారు మాట్లాడుతూ ఎంతో పురాతనమైన మందిరము ను దర్శనం చేసుకోవడం నాకు ఎంతో ఆనందంగా ఉందని మందిరం డెవలప్మెంట్ కు నా వంతు సహాయ సహకారాలు చేస్తానని వారు మాట్లాడడం జరిగింది, ఈ కార్యక్రమంలో నంది కంది గ్రామ ప్రజలు భక్తులు పూజారులు పాల్గొనడం జరిగింది.





# ఆకాష్ ద్వీప్ లక్ష దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న

- పూజ్య శ్రీ శ్రీ శ్రీ సంగ్రామ్ మహారాజ్ అఖిల భారతీయ సాధుసంతుల ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రం

భారత దేశం దేశం ప్రపంచానికి అన్నపూర్ణ లాంటిది

- సంగ్రామ్ మహారాజ్

**తెలుగు వెలుగు నాగల్ గిద్ద ప్రతినిధి నవంబర్ 15**

దేవదాస్ మహారాజ్ ఇరక్ పల్లి మెగా నాయక్ తాండ గ్రామపంచాయతీ పరిధిలో తను ఏర్పాటు చేసుకున్నటువంటి గుంప ఆశ్రమంలో గత నాలుగు సంవత్సరాల నుండి కార్తిక మాసంలో నిర్వహించినటువంటి ఆకాష్ ద్వీప్ లక్ష దీపోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది దేవిదాస్ మహారాజ్ గతంలో ఈ భారతదేశానికి పట్టిపీడిస్తున్నటువంటి కరోనా వైరస్ ని నిర్మూలన జరగాలని భారత దేశంలో ఉన్నటువంటి ప్రజలు సుఖంగా ఈ మహమ్మారి నుండి రక్షించబడాలని తను శ్రీ జగదాంబ భవాని మాత తుల్జా భవాని మాత సంత శ్రీ సేవాలాల్ మహారాజ్ పార్వతీ పరమేశ్వరులను కొలుచుకొని తను మొక్కు బడి మొక్కి శ్రావణ మాసంలో నెల రోజులపాటు హెూమా నిర్వహించి అదే విధంగా ఈ పవిత్ర మాసమైనటువంటి కార్తీకమాసంలో ఎవరు చేయని విధంగా కనీ విని ఎరగని రీతిలో తాను ఏదైతే పార్వతీ పరమేశ్వరులను అమ్మవారిని మోక్కారో ఆ ముక్కు తీర్చుకొనుటకై ఈరోజు లక్షద్వీప్ ఆకాద్వీప్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది సంగ్రామ్ మహారాజ్ దేవిదాస్ మహారాజ్ను అభినందిస్తూ ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ హిందువులు అతి పవిత్రంగా కొలిచే మాంసం ఎవరైతే ఈ మాసంలో 365 ద్వీపాలు వెలిగించినట్టయితే ముక్కోటి దేవి దేవతలకు కొలుచునట్టుగా అవుతుందని తెలిపారు కావున ఈ మాసంలో ప్రతి ఒక్కరూ తమ తమ మందిరాల యందు తమ తమ గృహములో నిత్యం దీపోత్సవం నిర్వహించి భక్తిశ్రద్ధలతో ఉండాలని తెలిపారు కావున ఈ భారతదేశం భక్తికి ముక్తికి ప్రపంచానికి అన్నపూర్ణ లాంటి దేశం మన ఈ భారతదేశం ఇలాంటి గొప్ప సంస్కృతి సాంప్రదాయాలు ఈ మన భారతదేశంలోనే కలదు కావున ఈ భారత దేశంలో ఉన్నటువంటి హిందువులందరూ కూడా సంఘటితంగా ఉంటూ తన ధర్మాన్ని రక్షించుటకై నిరంతరం పాటుపడాలని తెలిపారు గోవులను రక్షించాలి గోసంతతిని పెంచాలి గో ఆధారిత వ్యవసాయలను చేయాలి రానున్న కాలంలో ఈ భారతదేశానికి పెను ప్రమాదం రాబోతుంది కనుక హిందువులందరూ సంఘటితంగా ఉండి ధర్మరక్షణలో పాటుపడాలని తెలిపారు ఈ దేశ రక్షణలో బంజారా అన్నిటికన్నా ముందుండే బంజారా సమాజం ఈ బంజారా సమాజంలో పుట్టిన వ్యక్తి దేవిదాస్ మహారాజ్ ఇంత గొప్ప కార్యక్రమం నిర్వహించడం అభినందనీయదాయకం అని కొనియాడారు. కార్యక్రమంలో రమేష్ చౌహాన్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం చాలా పవిత్రమైన కార్యక్రమం ఈ కార్యక్రమంలో పాలు పంచుకోవడం నా జన్మ ధన్యంగా భావిస్తూ మనమందరం చీకటిని ప్రాలదోలి వెలుగును నింపాలని ఈ కార్తీకమాసంలో నిర్వహించే ఈ దీపోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది కావున మన బంజారా సమాజం అందరూ సంఘటితంగా ఉంటూ తమ సమాజాన్ని తమరే మనమందరము రక్షించుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి పట్ల చంద్రశేఖర్ రెడ్డి చైతన్య మహారాజ శివ మహారాజ్ పౌర దేవి రామ్ మహారాజ్ ఇరాక్ పల్లి తాజా మాజీ సర్పంచ్ విట్టల్ రావు పాటిల్ నారాయణఖేడ్ నాయబ్ తాసిల్దార్ రాజు పటేల్ మాద్వార్ తండా తాజా మాజీ సర్పంచ్ రాజు నాయక్ శివాజీ జైపాల్ ప్రహల్లాల్ దిగంబర్ దాసు సురేష్ నాయక్ మెగా తాండ నాయక్ మరియు కార భారీ తాండ పెద్ద మనుషులు వివిధ తండాల పూజారులు భక్తులు తదితరులు పాల్గొన్నారు





# పట్టణంలో పల్లెలలో గుప్పుమంటున్న గంజాయి..

## విద్యార్థులే టార్గెట్ గా గాంజా గ్యాంగ్.

**(తెలుగు వెలుగు ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 15)**

విద్యార్థులే టార్గెట్ గా గంజాయి వ్యాపారులు చెలరేగిపోతున్నారు. మొదటగా ఒకరిద్దరికి అలవాటు చేసి వారితో తమ చైన్ ను పెంచుకునేందుకు వీరు ప్రయత్నం చేసి సక్సెస్ అవుతున్నట్లు సమాచారం.తాజా గా హుజురాబాద్,ఎల్కతుర్తి సమీపంలో ఎస్ ఆర్ కళాశాల వసతిగృహం లో శుక్రవారం ఐదుగురు విద్యార్థులు గంజాయి సేవిస్తుండగా పట్టుకుని హాసన్ పర్తి పోలీసులకు అప్పగించారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణ కేంద్రంలో సైతం అనేక గంజాయి కేసులు నమోదు అయ్యాయి...ఈ గంజాయి సప్లై చేసే బ్యాచ్ భద్రాచలం నుంచి వరంగల్,కరీంనగర్ జిల్లాలకు దొంగచాటుగా సరఫరా చేస్తున్నట్లు సమాచారం.కొంత మంది ముఠాగా తయారై కళాశాల విద్యార్థులే టార్గెట్ చేసుకొని గంజాయి వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్టు సమాచారం........ఒకరిద్దరు విద్యార్థుల ను పరిచయం పెంచుకుని వారు ద్వారా గంజాయి నీ కళాశాల లోపలికి తీసుకెళ్ళి వ్యాపారం నడిపిస్తున్నట్లు సమాచారం.... హనుమకొండ లోని ఇంజనీరింగ్ కళాశాల లను టార్గెట్ గా చేసుకున్న ఈ గాంజా గ్యాంగ్,ఇటీవల హుజురాబాద్ పట్టణానికి చెందిన ఒక వ్యక్తి నీ హనుమకొండ జిల్లా వెలేర్ పోలీసులు అదుపులోకి తీసుకొని గాంజా గ్యాంగ్ లో సభ్యుడుగా గుర్తించారు. సైకిల్ సైతం లేని వ్యక్తులు కారులో తిరగడంతో వీరి వ్యాపారం పై మక్కువ పెంచుకున్న మరికొందరు వీరి ముఠా లో సభ్యులుగా చేరడంతో వీరి కార్య క్రమాలు దినదినం విస్తరిస్తూ పట్టణాలు కాకుండా పల్లెలకు సైతం విస్తరిస్తున్నాయి..




# ప్రభుత్వ ఉపాధ్యాయుడి హఠాన్మరణం.

## ప్రభుత్వ ఉపాధ్యాయుడి మరణంతో

## ఉపాధ్యాయ సబ్బండ వర్గాలలో విషాదఛాయలు.

**(తెలుగు వెలుగు ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 15)**

కరీంనగర్ జిల్లా హుజరాబాద్ నియోజకవర్గం పరిధిలోని స్థానిక జమ్మికుంట పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు “సాధుల వెంకట నరసయ్య” ఈ రోజు ఉదయం అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించారు. వివరాల్లోకి వెళ్లితే ఇల్లందకుంట మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల చిన్న కోమటిపల్లి లో సదరు ప్రభుత్వ ఉపాధ్యాయుడు (సాధుల వెంకట నర్సయ్య) విధులను నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయుడి మరణంతో కుటుంబ సభ్యులతో పాటు ఉపాధ్యాయ సబ్బండ వర్గాలలో విషాద ఛాయలు నెలకొన్నాయి. వీరి మరణం పట్ల పలు ఉపాధ్యాయ సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపాయి.



# ఇందని గ్రామంలో అగ్ని ప్రమాదం కాలిపోయిన పత్తి

**తెలంగాణ తెలుగు వెలుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ : 15**

కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం ఇందని గ్రామంలో అగ్నిప్రమాదం జరిగింది. ఇందని గ్రామానికి చెందిన చాప్లే ప్రకాష్ ఇంట్లో శుక్రవారం సాయంత్రం షార్ట్ సరక్యిట్ తో అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అంతలోనే ఇంట్లో ఉన్న 30 క్యూంటాల పత్తితో పాటు కొంత నగదు మరియు నిత్యావసర వస్తువులు సరుకులు, రెండు మేక పిల్లలు మంటల్లో అహుతి అయినట్లు స్థానికులు తెలిపారు. ఇంట్లో ఎవ్వరు లేకపోవడం వలన ప్రమాదం తప్పింది.



## బీఆర్ఎస్ కార్యకర్తలపై

# కక్షసాధింపు

## కాంగ్రెస్ కార్యకర్తలను వదిలేసి బీఆర్ఎస్ నాయకులనే జైల్లో వేశారు

## విలువైన భూములను వడ్డీపావుసేరులో గుంజుసుకునే ప్రభుత్వం

## లగచర్ల రైతన్నలతో కేటీఆర్ ములాఖత్

**సంగారెడ్డి, నవంబర్ 15 తెలుగు వెలుగు :**



కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని కావాలనే జైల్లో పెడుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. లగచర్లలో అధికారులపై దాడికి పాల్పడ్డ వారిలో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఉన్నారని కేటీఆర్ తెలిపారు. సంగారెడ్డి జైల్లో లగచర్ల రైతన్నలతో కేటీఆర్ శుక్రవారం ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. తమ భూములు తమకే ఉండాలని లగచర్ల రైతులు పోరాడుతున్నారు. మార్కెట్‌లో ఎకరం రూ. 70 లక్షల విలువ ఉన్న భూములను అడ్డికి పావుశేరుకు రియల్ ఎస్టేట్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం గుంజేసుకుంటుందని రైతులు చెబుతున్నారు. కేవలం ఎకరం భూమి రూ. 10 లక్షలకు గుంజేసుకుంటున్నారని రైతులు బాధపడుతున్నారు. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా రైతులు 9 నెలలగా పోరాటం చేస్తున్నారు. లగచర్ల, హకీంపేటతో పాటు మరో రెండు తండాల ఆడబిడ్డలు రోదిస్తున్నారు. కష్టపడి సాధించుకున్న తెలంగాణలో రేవంత్ రెడ్డి రాబందు మాదిరిగా వ్యవహరిస్తున్నారు. ఫార్మా కంపెనీలు కాలుష్యమని ఆయన ప్రచారం చేశారు. అదే ఫార్మాను కొడంగల్ తెస్తా.. 3 వేల ఎకరాలు రావాలని పేదల భూములు గంజుకుంటున్నారు. దీంతో స్థానిక రైతులు మర్లబడ్డారు. 9 నెలలుగా పోరాటం చేస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. అధికారుల ముందు నిరసన తెలిపితే దాడుల పేరిట అరెస్టులు చేసి జైల్లో వేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఇవాళ లగచర్లలో దుర్మార్గమైన పరిస్థితి నెలకొని ఉంది. కులగణనలో పాల్గొని వచ్చిన పంచాయతీ సెక్రటరీని కూడా అరెస్టు చేసి జైల్లో వేశారు. ఆ సంఘటనలో పాల్గొనలేదు.. అయినా తనను జైల్లో వేశారని ఆ యువకుడు చెబుతున్నాడు. ఇంకో యువకుడు వనపర్తిలో చదవుకుంటున్నాడు. ఈ ఘటన గురించి తెలుసుకుని మా ఇంటి వాళ్లు ఎలా ఉన్నారో అని వస్తే నన్ను కూడా తీసుకెళ్లారని చెప్పారు. 70 మందిని అరెస్టు చేసి రెండు డీసీఎంలలో తీసుకెళ్లారని చెప్పారని కేటీఆర్ తెలిపారు. దుద్యాల మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్ అనుచరులు కూడా ఈ దాడుల్లో పాల్గొన్నారు. వారి భూములు కూడా ఈ ఫార్మా విలేజ్‌లో పోతున్నాయి. రమేశ్, నర్సింహులు, రాములు అనే కాంగ్రెస్ కార్యకర్తలు కూడా దాడులు చేశారు. 70 మందిని తీసుకెళ్తే.. తిరుపతి రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ కార్యకర్తలను వదిలేశారట. బీఆర్ఎస్ వాళ్లు 21 మందిని రిమాండ్‌కు పంపి.. మిగతా వారిని ఇంటికి పంపించచారట. కేవలం బీఆర్ఎస్ వాళ్లనే మాత్రమే జైల్లో పెట్టాలని అనుముల తిరుపతి రెడ్డి ఆదేశాలు ఇచ్చారట. ఎలాంటి పదవి లేని తిరుపతి రెడ్డికి అధికారులు, పోలీసులు మోకరిల్లుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు....

# భగలాముఖి శక్తిపీఠం మహాద్వారం నిర్మాణం అభినందనీయం.....

## టూరిజం శాఖ రాష్ట్ర డైరెక్టర్ మామిడి హరికృష్ణ..

## నిర్మాణదాతలను అభినందించిన అమ్మవారి ఉపాసకులు

## శాస్త్రుల వెంకటేశ్వర శర్మ..

**మెదక్ జిల్లా తెలుగు వెలుగు శివ్వంపేట ప్రతినిధి**

శివ్వంపేట శ్రీబగలాముఖీ శక్తిపీఠం ప్రాంగణంలో స్వర్గీయ ఉదండపురం శంకర్ గౌడ్ జ్ఞాపకార్థం 10 లక్షల రూపాయలతో ఆయన కుటుంబ సభ్యులు వుదండపురం పద్మ, వుదండపురం అశ్విని, ఉదండపురం రాజేశ్వర్ గౌడ్ లు నిర్మించడం ఎంతో అభినందనీయమని టూరిజం శాఖ రాష్ట్ర డైరెక్టర్ మామిడి హరికృష్ణ, బగలాముఖీ శక్తిపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు, అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ అన్నారు. శుక్రవారం బగలాముఖీ శక్తిపీఠం మహాద్వారం ప్రారంభత్సవ కార్యక్రమం వుదండపురం పద్మ కుటుంబసభ్యులతో కలిసి నిర్వహించడం జరిగినది. ఈసందర్భంగా మామిడి హరికృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడ ఆధ్యాత్మిక కలిగి ఉండాలని, అతి చిన్న వయసులోనే వుదండపురం అశ్విని తన తండ్రి స్వర్గీయ వుదండపురం శంకర్ గౌడ్ పేరిట అమ్మవారి శక్తిపీఠం మహాద్వారం నిర్మించడం గొప్పదేనని ఆయన అన్నారు. అమ్మవారి చల్లని ఆశీస్సులు ఉదండపురం పద్మ కుటుంబంపై ప్రతినిత్యం ఉండాలని కోరుకుంటూన్నట్లు అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వర అన్నారు. ఈకార్యక్రమంలో అమ్మవారి శక్తిపీఠం స్థలదాతలు పబ్బ రమేష్ గుప్త, ట్రస్ట్ సభ్యులు పత్రాల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ రాజీపేట పద్మ వెంకటేష్, ఉదండపురం ప్రకాష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.






# అమ్మవారి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన

## శ్రీగురుపీఠం ట్రస్ట్ చైర్మన్ శివకుమార్ గౌడ్ - రమాదేవి దంపతులు..

**మెదక్ జిల్లా తెలుగు వెలుగు శివ్వంపేట ప్రతినిధి**

ప్రతి పుణ్యకార్యములో మనం చేసే అన్నదానం యొక్క పుణ్యఫలమెంతో గొప్పదని బగలాముఖీ ట్రస్ట్ చైర్మన్, అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ అన్నారు. శుక్రవారం కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా శివ్వంపేట శ్రీబగలాముఖీ శక్తిపీఠంలో అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులందరికి స్వర్గీయ జిన్నారం పెద్దగోని లింగయ్య గౌడ్ - అంజమ్మ జ్ఞాపకార్థం శ్రీగురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్, శ్రీబగలాముఖీ ట్రస్ట్ సభ్యులు, హైకోర్టు న్యాయవాది జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్ - రమాదేవి దంపతులు తమ స్వంత డబ్బులతో అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈసందర్భంగా వెంకటేశ్వర శర్మ మాట్లాడుతూ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంగా వెలుగొందబోతున్న గూడూరు శ్రీగురుపీఠం నిర్మించడమే కాకుండా నూతన దేవాలయలకు విరాళాలు, పాఠశాల విద్యార్థులు, కళాశాల విద్యార్థులకు సహకారం, సామాజిక కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా ప్రతినిత్యం ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టే శివకుమార్ - రమాదేవి దంపతులు ప్రతి పౌర్ణమి పర్వదినం మాదిరిగానే కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజలకు విచ్చేసిన అమ్మవారి భక్తులందరికి తమ స్వంత డబ్బులతో అన్నదానం నిర్వహిస్తున్న శ్రీగురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్, శ్రీబగలాముఖీ ట్రస్ట్ సభ్యులు, హైకోర్టు న్యాయవాది జిన్నారం పెద్దగోని శివకుమార్ గౌడ్ - రమాదేవి దంపతుల కుటుంబసభ్యులకు అమ్మవారి పరిపూర్ణ అనుగ్రహం ప్రతినిత్యం ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, శివకుమార్ గౌడ్ దంపతులను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు వెంకటేశ్వర శర్మ అన్నారు. ఈకార్యక్రమంలో శ్రీబగలాముఖీ ట్రస్ట్ అడ్మినిస్ట్రేటర్ జిన్నారం పెద్దగోని సూర్యం కుమార్ గౌడ్ దంపతులు, అడ్వకెట్ శ్రీనివాస్, శివ్వంపేట మాజీ ఉపసర్పంచ్ రాజీపేట పద్మ వెంకటేష్, పిల్లుట్ల డాక్టర్ సంద్ర సుదర్శన్, దొడ్ల అశోక్, ఉదండపురం ప్రకాష్, కాములయ్యగారి అర్జున్, కొంతాన్ పల్లి సత్యనారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు...

**తెలుగు వెలుగు న్యూస్ పెద్ద శంకరంపేట్**

పెద్ద శంకరంపేట తో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.. శుక్రవారం ఉదయం నుండే మహిళలు పిల్లలు పెద్దలు తమ గృహాలలో తులసి ఉసిరి చెట్లకు ప్రత్యేకంగా పలు రకాల పూలతో అందంగా అలంకరించి పూజలు నిర్వహించారు.. పేట మండల పరిధిలోని కొప్పల్ ఉమా సంగమేశ్వర స్వామి దేవాలయంలో.. పేటలోని శివాలయం విట్టలేశ్వర మాణిక్ ప్రభు తదితర దేవాలయాలలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి స్వామివారి దర్శనం చేసుకున్నారు.. ఆయా గ్రామాలలో సైతం దేవాలయాల్లో గృహాలలో మహిళలు దీపాలు వెలిగించి కార్తీక పౌర్ణమి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు...






# అతిథి ఉపాధ్యాయ పోస్టులకు ఈ నెల 16 న ఇంటర్వ్యూ

**తెలంగాణ తెలుగు వెలుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ : 15**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని మహాత్మ జ్యోతిబాపూలే (బాలురు ), గురుకుల పాఠశాల మరియు కళాశాలలో అతిధి ఉపాధ్యాయ పోస్టులకు ఈ నెల 16న ఇంటర్వ్యూలను నిర్వహిస్తామని జిల్లా సమన్వయకర్త బీ. శ్వేత తెలిపారు. ఆమె మాట్లాడుతూ బోటనీ, గణితం, ఇంగ్లీష్,తెలుగు, హిందీ సబ్జెక్టులకై అర్హులైన ఎంఎస్సీ, బీఈడీ, ఎం ఏ, టెట్ అభ్యర్థులు ఈ నెల 16న మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల, కళాశాలలో సంబంధిత సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని తెలిపారు.




# రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు

**అదనపు కలెక్టర్ నగేష్**

**(తెలుగు వెలుగు ప్రతినిధి),**

పాపన్న పేట మండలం ఎల్లాపూర్ లో ఉన్న సత్య సాయి రైస్ మిల్ ను ఆకస్మికంగా జిల్లా ఎస్పీతో తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం సేకరించిన అనంతరం రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు . లారీలను బయట నిలపకుండా చూడాలని,లారీల లోడింగ్- అన్లోడింగ్ ప్రక్రియ త్వరితగతులు చేపట్టాలని, రైస్ మిల్లుల్లో కూలీలను పెంచుకోవాలని, లారీలను పెంచుకోవాలని, మిల్లుల యజమానులకు తెలిపారు.




# గ్రూప్ -3 పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు

**పరీక్ష కేంద్రాల దగ్గర 144 సెక్షన్ అమలు**

**జిల్లా ఎస్పీ కె.నారాయణ రెడ్డి**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి**

**నవంబర్ 15 తెలుగు వెలుగు :**

జిల్లా లో ఈ నెల 17, 18వ తేదీలలో జరుగనున్న గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా బందోబస్త్ ఏర్పాట్లు చేయడం జరిగింది అని జిల్లా ఎస్పీ కె.నారాయణ రెడ్డి,ఐపీస్ తెలియజేయడం జరిగింది. అందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడం జరిగింది.గ్రూప్-%×××% సర్వీసెస్ పరీక్షల కోసం జిల్లాలో 31 పరీక్షా కేంద్రాలు నామినేట్ చేయబడ్డాయి.వికారాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 14, తాండూరు టౌన్ పరిధిలో 11 పోలీస్ స్టేషన్,పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో 05,చెంగోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 01 ఉన్నాయి.ఈ నేపథ్యంలో వికారాబాద్ పీఎస్, పరిగి,చెంగోముల్, తాండూరు టౌన్ పీఎస్‌లలో పటిష్టమైన బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగింది.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడం జరుగుతుంది. కావున పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎవరు కూడ గుమికుడి ఉండవద్దు. జిరాక్స్ సెంటర్, ఇతర దుకాణాలు మూసి ఉంచాలి. ప్రశ్నపత్రాల లీకేజీలు, మాల్ ప్రాక్టీస్ వంటి వాటికి ఆస్కారం లేకుండా , పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవడం జరిగింది అని ఎస్పీ తెలిపినారు. మొత్తం జిల్లాలో 118 మంది పోలీస్ అధికారులతో భద్రత ఏర్పాట్లు చేయడం జరిగింది. అందులో 2 సిఐ అదికారులు, 11 మంది ఎస్ఐ అధికారులు, 29 మంది ఏఎస్ఐ/హెచ్‌సి అధికారులు, 76 మంది పోలీస్ కానిస్టేబుల్ అధికారులు ఇట్టి బందోబస్త్



లో పాల్గొంటారు అని ఎస్పీ తెలిపినారు.గ్రూప్-%×××% సర్వీసెస్ పరీక్షలు రాసే అభ్యర్థులు పరీక్షలకు సంబంధించిన నియమ,నిబంధనలు పాటించి అధికారులకుసహకరించాలని, పరీక్ష కేంద్రాలకు చేరుకొనే సమయంలో అభ్యర్థులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లు అయితే ఆయా పరిధిలోని పోలీస్ అధికారులకు, డైల్ 100 కు సంప్రదించాలని ఎస్పీ తెలియజేయడం జరిగింది.

# లగచర్ల లో జరిగిన సంఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

**అక్రమంగా రైతుల పైన పెట్టిన కేసులను వెంటనే ఎత్తి వేయాలి**

**ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై మహేందర్, బి మల్లేష్**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 15 తెలుగు వెలుగు:**


లగచర్ల సంఘటనను ఖండిస్తూ ఈ సందర్భంగా ఏ ఐ కె ఎం స్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.మహేందర్, బి.మల్లేష్ మాట్లాడుతూ గత ఆరు ఏడు నెలలుగా ఫార్మా కంపెనీకి మా భూములు ఇవ్వమని చెప్తూ దఫ దఫాలుగా అక్కడున్న రైతులు శాంతియుత ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు ప్రభుత్వం వారి అభ్యంతరాలను వినకుండా రైతులను భయభ్రాంతులకు గురి చేసి అక్రమంగా భూములు లాక్కోవాలని చూస్తుంది. ఈ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజా సంక్షేమం కు దోహదపడకుండా కార్పోరేట్ శక్తులకు పని చేసే విధంగా వ్యవహరిస్తుంది. నిరుపేద రైతులు సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూములు కాకుండా అదే కొడంగల్ ప్రాంతంలో వేల ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆ భూములను విడిపించి అక్కడ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించండి కానీ నిరుపేదల భూముల జోలికి వెళ్లడం సరైన పద్ధతి కాదని అన్నారు.రైతుల పైన పెట్టినటువంటి కేసులు వెంటనే వెనక్కి తీసుకోవాలి. ఫార్మా కంపెనీ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




# వరుసగా రెండు ఉద్యోగాలు సాధించిన ముత్యంపేట ముత్యం

**తెలంగాణ తెలుగు వెలుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ : 15**

కౌటాల: కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన జాడి రాహుల్, ఒకే సంవత్సరంలో వరుసగా రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి యువతకు ఒక గొప్ప ఆదర్శంగా నిలిచాడు. రాహుల్ తల్లిదండ్రులు కీర్తి శేషులు బావుజీ, తల్లి కవిత అన్నయ్య సాయి కృష్ణ. తల్లి వ్యవసాయం పనులు చూసుకుంటూ ఇద్దరు పిల్లలను కష్టపడి చదివించింది. తల్లి కష్టాన్ని వృధా చేయకుండా రాహుల్ పట్టుదలతో చదివి తన లక్ష్యాలను సాధించాడు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంలో కొన్నిసార్లు వైఫల్యాలు ఎదురైనప్పటికీ. అయినా నిరాశ చెందకుండా మరోసారి ప్రయత్నించాడు. ఫలితంగా, 2024లో ఏ ఆర్ కానిస్టేబుల్ గా ఎంపికైన రాహుల్, ప్రస్తుతం గ్రూప్ 1 ఫలితల కోసం ఎదురుచూస్తున్నాడు. గ్రూపులో విజయం సాదించి తన తండ్రి కోరిక నెరవేర్చాలని తన కోరిక అని తెలిపారు. తాజాగా, గ్రూప్ 4 లో జూనియర్ అసిస్టెంట్ సర్వే సెట్టిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఉద్యోగానికి ఎంపికైన రాహుల్ వరుసగా 2 ఉద్యోగాలు సాధించి యువతకు ఒక గొప్ప ప్రేరణ గా నిలిచాడు. వరుసగా రెండు ఉద్యోగలు సాధించిన రాహుల్ ను గ్రామస్తులు అభినందించారు.



# ఏడుపాయల వన దుర్గా అమ్మవారి పల్లకి సేవ

**(తెలుగు వెలుగు ప్రతినిధి),**

ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ భవాని దేవస్థానం నందు కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కార్యనిర్వహణాధికారి మరియు అర్చకులు లక్ష దీపారాధన కార్యక్రమం మరియు ఆకాశదీపం మరియు గంగా హారతి మరియు తిప్పోత్సవం మరియు పల్లకి సేవ నిర్వహించడం జరిగిం. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది మరియు పాపన్నపేట్ పోలీస్ సిబ్బంది మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# ధ్యాన మనో ప్రస్థానం నందు కార్తీక పౌర్ణమి వేడుకలు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 15 తెలుగు వెలుగు :**

విశ్వస్పూర్తి వారి దివ్య ఆశీస్సులతో ధ్యాన మనో ప్రస్థానం నందు కార్తీక పౌర్ణమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించడం జరిగిందనిడా.గౌరీశంకర్,శేషగిరి,లక్ష్మణ్ లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి ప్రత్యేకత అయిన జ్యోతిని వెలిగించడం ఆచారంగా కొనసాగుతుందన్నారు.దీనిని మనిషి జ్ఞాన జ్యోతిగా భావించి జీవితంలో మార్పును తెచ్చుకోవాలన్నారు. గురువు యొక్క మూలమంత్రాన్ని దాని విశిష్టతను సైంటిఫిక్ గా ధ్యానం చేసి ఈ మూల మంత్రం పఠనం ద్వారా క్రియాశక్తిని జ్ఞాన శక్తిని పెంపొందించుకోగలరని వివరించారు తద్వారా గురువు విశ్వశక్తి ఈ మంత్రంలో నిక్షిప్తమైందని తెలిపారు. డాక్టర్లు అయినా తాము మెడికల్ రిపోర్ట్స్ ను పరిశీలించి రోగ నిర్ధారణ చేయగలం,కానీ గురువు తాను విశ్వశక్తి ద్వారా రోగి యొక్క సమస్యను తెలుసుకుని పరిష్కార మార్గాన్ని సూచిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.





# మోతీ నగర్లో అక్రమ నిర్మాణాల జోరు...





పట్టించుకోని అధికారులు...

అధికారుల ఉదాసీన వైఖరి

కారణంగా విచ్చలవిడిగా

బహుళ అంతస్తులు భవనాలు...

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసిన

పట్టించుకోని వైనం...

**తెలుగు వెలుగు ప్రతినిధి**

కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని మోతీ నగర్ లో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఎలాంటి పర్మిషన్లు తీసుకోకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న సదరు బిల్డర్లపై అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు కనబడడం లేదు. అక్రమ నిర్మాణాల విషయంలో ఫిర్యాదు చేసిన పట్టించుకున్న దాఖలాలు కనబడడం లేదు. అక్రమ నిర్మాణాలు చేపడుతున్న బిల్డర్లు ఇచ్చే మామూళ్లకు ఆశపడుతున్న అధికార యంత్రాంగం నిర్మాణాల విషయంలో చూసి చూడనట్టు వ్యవహరించడం ఎక్కడ పడితే అక్కడ విచ్చలవిడిగా బహుళ అంతస్తుల భవనాలు నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తూనే ఉన్నాయి. ప్రధానంగా మోతీ నగర్ పరిధిలోని పి ఆర్(పాండురంగారావు నగర్) నగర్లో గత కొన్ని రోజుల నుండి నిబంధనలకు విరుద్ధంగా మునిసిపాలిటీ నుండి ఎలాంటి పరిమిషన్ తీసుకోకుండానే అక్రమ నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. దాదాపు 100 గజాల నుండి మొదలుకొని 200 గజాల వరకు 5 అంతస్తుల భవనాలను యదేచ్ఛగా నిర్మిస్తూ పరిసర ప్రాంత వాసులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. చుట్టుపక్కల సెట్ బ్యాక్ సైతం వదలకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతూ అధికారులకు సవాల్ విసరడం ఇక్కడ పరిపాటిగా మారింది. స్థానికంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్న విషయాన్ని ఫిర్యాదు రూపంలో సంబంధిత అధికారులకు తెలియజేసిన వాటిని అధికారులు బుట్ట దాఖలు చేయడంతో అక్రమ నిర్మాణదారులకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. సదరు నిర్మాణదారులు వారికి ఉన్న స్థలంలో నిర్మాణాలు చేపట్టడమే కాకుండా రోడ్డు స్థలాన్ని సైతం కబ్జా చేస్తూ నిర్మాణాలను కొనసాగిస్తుండడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇప్పటికైనా అధికారులు మోతీ నగర్ లోని పిఆర్ నగర్ కాలనీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై కొరడా జులిపించి స్థానికులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## పవిత్రమైన కార్తీక పౌర్ణమి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ నేత,కంటెస్టడ్ కార్పోరేటర్ కూన శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేక పూజలో పాల్గొన్నారు..

**తెలుగు వెలుగు ప్రతినిధి**

గాజులరామరం డివిజన్ పరిధిలోని శ్రీ నల్లగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా సముహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు,అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కూన శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.అనంతరం దేవస్థానం కమిటీ శ్రీనివాస్ గౌడ్ ని సన్మానించారు.ఈ సందర్భంగా పాల్గొన్న భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి,స్వామివారి కృపకు పాత్రులు కాగలరని శ్రీనివాస్ గౌడ్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అమర ఇంద్రసేన గుప్తా,కూన రవీందర్ గౌడ్,కమిటీ సభ్యులు ఆర్ బాలరాజు,పెంటా రెడ్డి,శ్రీరాములు,ఆర్ యాదగిరి,యాము సాగర్, నరసింహారెడ్డి,పెంటారెడ్డి,ఇంద్రసేనారెడ్డి,సంజీవరెడ్డి,కూన రాఘవేంద్ర గౌడ్,మోహన్ రెడ్డి సురేష్,నాగిళ్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు..





## అర్హులైన వారందరూ కల్యాణ లక్ష్మీ పథకాన్ని వినియోగించుకోవాలని తెలిపిన

నియోజవర్గ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి..

**తెలుగు వెలుగు ప్రతినిధి**


కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 డివిజన్ జై రామ్ నగర్ వాసులు అనిల్ సోదరి కె.భారతి కి రూ.1,00016/- ల కల్యాణ లక్ష్మి చెక్కును నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అందజేశారు.అనంతరం హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన వారందరూ కల్యాణ లక్ష్మీ పథకాన్ని వినియోగించుకోవాలని,పేద ప్రజల సంక్షేమ ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బెకు శ్రీనివాస్,ఎన్.ఎం.సి బీసీ-సెల్ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్,కుమార్ యాదవ్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీధర్ వర్మ,అనిల్,సీనియర్ మహిళ కాంగ్రెస్ నాయకురాలు లక్ష్మి,అండాలు తదితరులు పాల్గొన్నారు..



## ఎన్టీఆర్ నగర్ శ్రీ నల్ల పోచమ్మ ఆలయానికి జిల్లా గణేష్ వితరణ...

**తెలుగు వెలుగు ప్రతినిధి**

శే లింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్ లో గల ఎన్ టి ఆర్ నగర్ శ్రీ నల్లపోచమ్మ, ఎల్లమ్మ అమ్మవారి ఆలయానికి స్థానిక నాయకుడు జిల్లా గణేష్ విరాళంగా 20 వేల రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కార్తీక పూర్ణమి సందర్భంగా ఆలయ కమిటి సభ్యులు మలేష్, నాగరాజు, సాయి, తదితరుల సమక్షంలో విరాళాన్ని అందజేశారు. ఈ ఆలయం నిర్మాణదశలో ఉన్నందున దాతలు ఆలయ కమిటీ సభ్యులకు సహకరించి ఆలయ నిర్మాణంలో భగస్వామ్యులు అవ్వాలని వారు కోరారు.



## ఘనంగా బీసు వెంకటేష్ గౌడ్ జన్మదిన వేడుకలు:

**తెలుగు వెలుగు ప్రతినిధి**

జై గౌడ ఉద్యమ రాష్ట్ర అధికార ప్రతినిధి మదర్ తెరిసా వికలాంగుల సంఘం వ్యవస్థాపకులు బీసు వెంకటేష్ గౌడ్ జన్మదిన వేడుకలు శుక్రవారం చింతల్ డివిజన్ లోని భగత్ సింగ్ నగర్ లో గల తన కార్యాలయంలో సన్నిహితులు అభిమానుల మధ్య ఘనంగా జరుపుకున్నారు.ముందుగా హాజరైన పలువురు ఆయన చేత కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గౌడ్ నివాసానికి వెళ్లి ఆయన సమక్షంలో జరుపుకున్నారు.ఎమ్మెల్యే శాలువా కప్పి బీసు వెంకటేష్ గౌడ్ కు ఆయన జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బీసు వెంకటేష్ మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలు ఇంతటి పండుగ వాతావరణంలో జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో సామాజిక సేవ కార్యక్రమాలు విస్తృతం చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో బి.ఆర్ఎస్ పార్టీ మైనార్టీ సీనియర్ నాయకులు మక్సుద్ అలీ,వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్,శ్రీకాంత్,వారాల వినోద్ కుమార్,గుబ్బల లక్ష్మీనారాయణ,మహమ్మద్ శౌకత్ అలీ,జాన్ తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు..



## సంక్షేమ నేత,ఎమ్మెల్యే కెపి.వివేకానంద కి పలు ఆహ్వానాలు,వినతులు..

**తెలుగు వెలుగు ప్రతినిధి**

కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు,ప్రజలు,నాయకులు,అభిమానులు,కార్యకర్తలు,సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద ని కలిసి వారి,వారి ఇళ్లలో నిర్వహించనున్న శుభకార్యాలకు ఆహ్వానిస్తూ పలు ఆహ్వాన పత్రికలు అందజేయగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు..



## తెలంగాణ సమాజం ఎప్పటికీ కేటీఆర్ ఆడే నికృష్ట రాజకీయ క్రీడను సహించదు...

లగచర్ల దాడిలో మొదటి ముద్దాయి కేటీఆరే,

చేసిన తప్పుకు శిక్ష అనుభవించాల్సిందే...

టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం

**తెలుగు వెలుగు ప్రతినిధి**

తెలంగాణ సమాజం ఎప్పటికీ కేటీఆర్ ఆడే నికృష్ట రాజకీయ క్రీడను సహించదనీ,లగచర్ల దాడిలో మొదటి ముద్దాయి కేటీఆరేనని చేసిన తప్పుకు శిక్ష అనుభవించాల్సిందేనని టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం పేర్కొన్నారు.గాంధీ భవన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం మాట్లాడారు. తెలంగాణలో నికృష్టమైన రాజకీయ క్రీడకు కేటీఆర్ తెర తీశారని, అధికారం పోయిందనే అక్కసుతో కేటీఆర్ అనువనువు ప్రభుత్వ కార్యక్రమాలను అడ్డుకోవడమే ఎజెండాగా బిఆర్ఎస్ కుట్ర పన్నుతోందని విమర్శించారు. తెలంగాణ రైతాంగం మీకు ఓట్లు వేయలేదని వారిమీద కక్షకట్టి కేటీఆర్ రెచ్చగొడుతున్నారని, గుమ్మడికాయ దొంగ ఎవరు అంటే కేటీఆర్ భుజాలు తడుముకుంటున్నారని, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ద్వారా కేటీఆర్ లగచర్ల కుట్ర చేసారని అన్నారు. మల్లన్నసాగర్ కోసం గత ప్రభుత్వం 12 గ్రామాల ప్రజలను బెదిరించి, దౌర్జన్యం చేసి భూసేకరణ చేసిందని, పదేండ్లు రాష్టంలో అప్రకటిత ఎమర్జెన్సీ బిఆర్ఎస్ అమలు చేసిందని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు సొంత పార్టీ నేతలు ఒక్కరితో అయిన మాట్లాడారా, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా కేటీఆర్ ను నమ్మడం లేదన్నారు, అభివృద్ధిని అడ్డుకోవడానికి కేటీఆర్ నీచాతి నీచమైన కుట్రలకు పాల్పడుతున్నాడని, దళిత, గిరిజన, బీసీ బిడ్డల జీవితాల్లో వెలుగులు నింపడానికీ, ఉపాధి కల్పనకు ప్రభుత్వం కొడంగల్ లో భూ సేకరణ జరుపుతుందని అన్నారు. కాలుష్య రహిత ఫార్మా విలేజ్ లో తీసుకురావడం ప్రభుత్వ ఆలోచనని, పరిశ్రమలు వస్తే తెలంగాణ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే కేటీఆర్ కుట్రలు పన్నుతున్నారని సత్యం శ్రీరంగం అన్నారు.




## శ్రీహరి నగర్ లో నీటి ఎద్దడి తీర్చాలని ఎమ్మెల్యే కృష్ణారావుకు వినతి.

**తెలుగు వెలుగు ప్రతినిధి**

బాలాజీ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీహరి నగర్ లో ఎదుర్కొంటున్న నీటి ఎద్దడిని నివారించాలని కోరుతూ కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకి శ్రీహరి నగర్ లో కాలని వాసులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. స్థానికంగా ఎదుర్కొంటున్న నీటి సమస్య వివరించిన అధ్యక్షులు జయరాజ్ ,కాలని వాసులు సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై స్కానుకూలంగా స్పందించిన కృష్ణారావు సంబంధిత అధికారులతో చర్చించి సాధ్యమైనంత తొందరలో నీటి సమస్యను పరిష్కరిస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.




## కార్తీక పౌర్ణమి వేడుకల సందర్భంగా ప్రత్యేక పూజలలో

జనసేన పార్టీ నాయకుడు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్...

**తెలుగు వెలుగు ప్రతినిధి**

కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలోని భరత్ నగర్ కాలనీలో గల శ్రీ హరి హర దేవస్థాన చైర్మన్ నాగిరెడ్డి ఆహ్వానం మేరకు కార్తీక మాసం సందర్భంగా శివాలయంలో అభిషేకం మరియు ప్రత్యేక పూజలలో కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్ , కలిగినీడి ప్రసాద్, అడబాల షణ్ముఖ,పాదం సూర్య,గడ్డం వీర , పులగం సుబ్బు మరియు కమిటీ సభ్యులు మూర్తి, వర్రె నాగరాజు, అశోక్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ ని కలిసిన నియోజకవర్గ ప్రజలు :

**తెలుగు వెలుగు ప్రతినిధి**

మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ని షాపూర్ నగర్ లోని తన నివాసం వద్ద పలువురు నాయకులు,పలు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు,ప్రజలు మర్యాదపూర్వకంగా కలిసి,వివిధ కాలనీలలో సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు.పలు వినతులు స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే వాటి పరిష్కారం కోసం,కాలనీల అభివృద్ధి కోసం సత్వర చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.పలువురు మాజీ ఎమ్మెల్యే గారికి పలు శుభకార్యాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలు అందజేశారు..



## రూ.2 లక్షలకు పైబడిన వాళ్ళ

# రుణమాఫీ

### రుణమాఫీపై త్వరలోనే ప్రకటన చేస్తాం

### వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల వెల్లడి

**హైదరాబాద్, నవంబర్ 15తెలుగు వెలుగు :**

రూ.2లక్షలకు పైబడిన వాళ్ళ రుణమాఫీ పై త్వరలోనే ప్రకటన చేస్తామని వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుడ్ న్యూస్ చెప్పారు. రైతు భరోసా సబ్ కమిటీ నివేదిక రాగానే రైతులకు అందజేస్తామన్నారు. ఈ ఏడాది వరి సాగులో తెలంగాణ టాప్ స్థానంలో నిలిచిందన్నారు. ఒక కోటిన్నర లక్షల ఎకరాల దిగుబడితో పంజాబ్ రాష్ట్రాన్ని వెనక్కి నెట్టామన్నారు. గతంలో 41లక్షల ఎకరాలల్లో ఉన్న దొడ్డు ధాన్యం ఈ ఏడాది 21లక్షలకు పడిపోయిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సన్న ధాన్యం దిగుబడి పెరిగిందని, దేశ వ్యాప్తంగా సన్న ధాన్యానికి డిమాండ్ పెరిగిందన్నారు. 25 జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో ఈ రోజు నాటికి 17 జిల్లాల్లో మాత్రమే జరిగాయన్నారు. 9.7 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ళు ఇప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా చేశారన్నారు. 6 వందల 25 కోట్లు ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు డబ్బులు అందించామన్నారు. బీజేపీ %-% బీఆర్ఎస్ పార్టీ నాయకులు రైతుల మనోధైర్యం దెబ్బతినే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. గతంతో పోల్చితే ఉత్పత్తి, కొనుగోళ్లు పెరిగాయన్నారు. అధికారం పోయినంత మాత్రాన ఇంతగనం ఆందోళన అవసరం లేదన్నారు. వాళ్ళ పార్టీలో ఆధిపత్యపోరు కోసం రైతులను ఇబ్బంది పెట్టకండి అని సూచించారు. రైతుల పై ఒత్తిడి లేదు.. ఓపెన్ మార్కెట్ లో అవకాశం ఉన్నా అమ్ముకోవచ్చన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే ప్రతీ గింజా మేము కొంటామన్నారు. కేంద్రం గైడ్లైన్స్ లో మార్పులు చేయాలని కోరుతున్నామని తెలిపారు.



## కేటీఆర్ నీ పొలిటికల్ డ్రామాలు ఆపు

### టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ హితువు

**హైదరాబాద్, నవంబర్ 15తెలుగు వెలుగు :**

కేటీఆర్ నీ పొలిటికల్ డ్రామాలు ఆపాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ హితువు పలికారు. మీరు పవర్ కోసం రాజకీయంగా దిగజారడం మంచిది కాదని ఫైర్ అయ్యారు. మీరు అధికారం కోసం ఎవరినైన వదిలిపెట్టరని అన్నారు. ఎవరి పైననైన దాడులు చేస్తారని అర్థం అయిందన్నారు. మీ రాజకీయం కోసం పొలిటికల్ గా ఎవరినైన వాడుకుంటారన్నారు. అధికారులపై దాడులు చేయడం దేశం మొత్తం చర్చ జరుగుతుందన్నారు. మీరు రాజకీయాలకు తెలంగాణ ప్రతిష్ట దిగజార్చకండి అన్నారు. మీ రాజకీయాలకు తెలంగాణ ప్రజలు చరమ గీతం పాడుతారన్నారు. రైతుల పేరు మీద గుండాలను పంపించి దాడులు చేయించారని మండిపడ్డారు. రైతుల మీద కేసులు పెట్టొద్దని ప్రభుత్వం చెప్పింది, వాళ్ళమీద కేసులు పెట్టలేదన్నారు. దాడులకు పురిగొల్పిన వాళ్లు, కారణమైన అల్లరి మూకలపై మాత్రమే కేసులు పెట్టారన్నారు. ఇప్పటి కైన పొలిటికల్ డ్రామాలు ఆపాలని కేటిఆర్ కు హితువు పలికారు.



## కృషి మాత్రమే

## దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తుంది

### ఇన్ఫోసిస్ అధినేత ఎన్ఆర్ నారాయణ మూర్తి

**న్యూఢిల్లీ, నవంబర్ 15తెలుగు వెలుగు :**



యువత వారానికి 70 గంటలు పని చేయాలని తాను చేసిన ప్రకటనను ఐటీ రంగ ప్రముఖుడు, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణ మూర్తి మరోసారి సమర్థించారు. కృషి మాత్రమే భారతదేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తుందన్నారు. సీఎన్‌బీసీ గ్లోబల్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో ఆయన ఈ వారానికి 70 గంటల పని గురించి మరోసారి ప్రస్తావించారు. "క్షమించండి, నా అభిప్రాయం మారలేదు. నేను చనిపోయే వరకు ఈ ఆలోచన నాలో ఉంటుంది." అని ఆయన స్పష్టం చేశారు. 1986లో వారానికి 6 రోజుల పని నుంచి 5 రోజులకు మారినప్పుడు.. తాను చాలా బాధపడ్డానన్నారు. దేశాన్ని అభివృద్ధి చేయాలంటే విశ్రాంతి తీసుకోవాల్సిన అవసరం లేదని, కొన్ని త్యాగాలు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీని కూడా ప్రస్తావిస్తూ.. మోడీ వారానికి 100 గంటలు పనిచేస్తున్నారని చెప్పారు. ఆయన అంత కష్టపడగలిగితే మనం ఎందుకు చేయలేమని ప్రశ్నించారు.మనం కూడా పనిచేసి ఈ దేశాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలో అనే అంశంపై ఆలోచించలన్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జర్మనీ, జపాన్‌లు ఎలా అభివృద్ధి చెంది మళ్లీ ధనిక దేశాలుగా మారాయో ఒక్కసారి తెలుసుకోవాలన్నారు. మనం వారిని చూసి నేర్చుకోవాలని అభిప్రాయపడ్డారు. భారతదేశం కూడా ఈ మార్గాన్ని అనుసరించాలని, దాని ద్వారానే దేశ పునర్నిర్మాణం సాధ్యమవుతుందని సూచించారు. జర్మనీ, జపాన్ ప్రజలు చేసిన ప్రయత్నాలే మనం కూడా చేయాలని చెప్పారు. తాను తన జీవితాంతం ఈ ఆలోచనను అనుసరిస్తానని.. ఎల్లప్పుడూ 14 గంటలు పనిచేశాస్తానన్నారు. వారంలో ఆరున్నర రోజులు పని చేస్తూనే ఉన్నానని చెప్పారు. రోజూ ఉదయం 6:30 గంటలకు ఆఫీసుకు చేరుకునేవాడిని, తిరిగి రాత్రి 9 గంటలకు ఇంటికి బయలుదేరేవాడినని చెప్పారు. ఈ జీవనశైలికి తాను గర్వపడుతున్నారు. ప్రపంచంలో విజయానికి ఒకే ఒక్క మార్గమని.. అది కష్టపడి పనిచేయడమేనని 78 ఏళ్ల వ్యాపారవేత్త స్పష్టం చేశారు. సాధారణంగా%ొ% భారత్‌లో రోజుకు 8గంటల పనిగంటలు ఉంటాయి. ప్రైవేట్ సెక్టార్‌లో వారానికి ఒక రోజు సెలవు ఉండగా%ొ% ఐటీ సెక్టార్‌లో మాత్రం శని, ఆదివారాలు సెలవు. ఈ లెక్కన వారానికి ఒక్కో ఉద్యోగి దాదాపు 50 గంటల వరకు పనిచేస్తుంటారు. అయితే%ొ% ఇది సరిపోదని.. వారానికి 70 గంటల పనిచేయాలన్నది ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి వాదన అంటే. రోజుకు సగటును%ొ% 12గంటలు పనిచేయాలని ఆయన చెప్తున్నారు. దేశం కోసం శ్రమిస్తామని యువత ప్రతిబూని పనిచేయాలని ఆయన వాదన. గతంలో కూడా ఆయన ఈ విషయాన్ని నొక్కి చెప్పారు. ప్రస్తుతం మరోసారి గుర్తుచేశారు.

# కాంగ్రెస్ విజయోత్సవ వేడుకలకురంగం సిద్ధం

### ఏడాది పాలనపై ఫోకస్ పెట్టేలా కార్యక్రమాలు

**హైదరాబాద్,నవంబర్15తెలుగు వెలుగు :**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకుంటున్న క్రమంలో విజయోత్సవాలు ఘనంగా నిర్వహించబోతున్నారు. ఏడాలిలో ప్రభుత్వం సాధించిన విజయాలు, చేపట్టిన కార్యక్రమాలు తదితరాలను ఫోకస్ చేస్తూ కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. డిసెంబర్ 7వ తేదీకి రేవంత్ సర్కారు ఏర్పడి ఏడాది కావొస్తున్న నేపథ్యంలో.. ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణంలో ప్రజా పాలన విజయోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించింది ప్రభుత్వం. ఈమేరకు ప్రజాపాలన-విజయోత్సవాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష చేశారు. ప్రజాపాలన-విజయోత్సవాల్లో శాఖలవారీగా, విభాగాల వారీగా ప్రభుత్వం తొలి ఏడాదిలో సాధించిన విజయాలను, చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం ఆదేశించారు. ఈసందర్భంగా డిసెంబర్ 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాలపై చేపట్టే కార్యక్రమాలను సీఎంకు అధికారులు వివరించారు. ఈ నెల 19న వరంగల్ వేదికగా.. 22 జిల్లాల్లో ఇందిరా మహిళాశక్తి భవనాలకు శంకుస్థాపన చేస్తారు. విజయోత్సవాల్లో భాగంగా వరంగల్, కరీంనగర్.. మహబూబ్‌నగర్ జిల్లాల్లో సీఎం రేవంత్ బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. ఇక డిసెంబర్ 7,8,9 తేదీల్లో విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేలా ప్లాన్ చేసింది. డిసెంబర్ 7న ట్యాంక్‌బండ్‌పై, 8న సచివాలయంలో .. 9న నెక్లెస్ రోడ్‌లో విజయోత్సవ వేడుకలు జరపనున్నారు. విజయోత్సవాల్లో భాగంగా డిసెంబర్ 9న సచివాలయంలో తెలంగాణతల్లి విగ్రహావిష్కరణ చేయనున్నారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు రాష్ట్రవ్యాప్తంగా మహిళలను ఆహ్వానించాలని నిర్ణయించారు. మహిళా సాధికారత, రైతుల సంక్షేమాన్ని సభల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే నియోజకవర్గాల వారీగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. దీంతో రాష్ట్రమంతా పండుగ వాతావరణం నెలకొననుంది.

# హైదరాబాద్‌ను వేధిస్తున్న ట్రాఫిక్

### వర్షాకాలంలో వరదల్లా మారుతున్న రోడ్లు

### ఈ రెండు ప్రధాన సమస్యలపై ఫోకస్

### పక్కా ప్రణాళికకు సిద్ధం అవుతున్న సర్కార్

**హైదరాబాద్,నవంబర్15తెలుగు వెలుగు :**



విశ్వ నగరంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ ప్రధానంగా ట్రాఫిక్, వరదల సమస్యలను ఎదుర్కొంటోంది. నిత్యం ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా మారాయి. అలాగే వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికే రోడ్లు నదులను తలపిస్తున్నాయి. ఈ రెండు అంశాలపై రేవంత్ సర్కార్ తీవ్రంగా ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ట్రాఫిక్‌పై ఇప్పటికే చర్చ నడుస్తోంది. రోడ్లపైకి రోజూ వందలాదిగా కొత్త వాహనాలు రావడం కూడా తలనొప్పిగా మారింది. అలాగే ఇరుకు రోడ్లు కూడా ఇక్కట్ల పాటు చేస్తున్నాయి. ఈ క్రమంలో అవసరమైన చోట అండర్ పాస్‌లో, బ్రిడ్జిలు, రోడ్డు వెడల్పు వంటి కార్యక్రమాలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. దీనిని ట్రాఫిక్ పోలీస్ విభాగం పరిశీలిస్తోంది. యూటర్న్‌లు కూడా తీవక్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. తార్నాక యూ టర్న్ తొలగించాలని ఇటీవలే నిర్ణయించారు. అలాగే ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద కూడా యూటర్న్ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. దీనిని కూడా తొలగించాలని కోరుతున్నారు. ఇలా నగరంలో అనేక చోట్ల, ప్రధానంగా మెట్రోల వద్ద యూటర్న్‌లు ట్రాఫిక్ కష్టాలను పెంచుతున్నాయి. ఇకపోతే వరదనీరు నేరుగా మూసీలో కలవకుండా నాలాలన్నీ ఆక్రమణలకు గురయ్యాయి. ఇప్పటికే హైడ్రా వీటిని పరిశీలించి నివేదిక సిద్ధంచేసింది. ఈ క్రమంలో ఆక్రమణల తొలగింపు, నాలాల విస్తరణ వంటి చర్యలను తీసుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో వరద ముప్పు నుంచి హైదరాబాద్ మహా నగరాన్ని రక్షించేందుకు మహా ప్రణాళిక సిద్ధమవుతోంది. నగరంలో మూసీకి ఇరువైపులా 15 వరకూ చెరువులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. వరద నీటిని తొలుత ఈ చెరువుల్లోకి, అక్కడ నుంచి మూసీలోకి మళ్లించడం ద్వారా వరద ముప్పును ఎదుర్కోవచ్చనే అలోచనతో ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఇప్పటికే అనేక చెరువులు కబ్జాకు గురయ్యాయి. ఉన్నవాటిల్లో పూడిక పేరుకుపోయింది. చెరువుల్లోకి కలిసే నాలాలూ పూడిపోయాయి. అందుకే చెరువుల ప్రస్తుత సామర్థ్యం, వాటి పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపైనా అధ్యయనం చేస్తున్నారు. చెరువులకు చేరిన నీరు మూసీలో కలిసేలా వ్యూహరచన చేస్తున్నారు. మూసీ సుందరీకరణ పథకానికి ఇది ఊతమిస్తుందని అధికార వర్గాలు తెలిపాయి. నగరపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ కార్యాచరణ ప్రణాళిక రూపొంది స్తోంది. 2050 అవసరాలను దృష్టిలో ఉంచుకొని వివిధ అంశాలపై రూపొందిస్తున్న మహా ప్రణాళికలో వరద మళ్లింపే కీలకమైనది. ఫిబ్రవరి నెలాఖరుకల్లా ఈ ప్రణాళిక సిద్ధం కానుందని సమాచారం.గతంలో ఎన్నడూ లేని విధంగా ఉన్నట్లుండి ఒకేసారి కుండపోత వర్షం కురుస్తుండడంతో నగర రోడ్లు నదులను తలపిస్తు న్నాయి. వరదపోయే మార్గాలు మూసుకుపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గతంలో హైదారాబాద్,ఇటీవల విజయవాడలో జరిగిన వరద బీభత్సం తెలిసిందే. 2020 సంవత్సరంలో హైదరాబాద్ కూడా ఇలానే వరదలతో వణికిపోయింది. రాబోయే రోజుల్లో ఇలాంటి పరిస్థితులు మరింతగా ఉండే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో వరదల నుంచి హైదరాబాద్‌ను రక్షించేందుకు నగరపాలక పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. 2050 నాటికి అవుటర్ రింగు రోడ్డు పరిధిలో అభివృద్ధి చెందే నగరం అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూపొందిస్తున్న ఈ ప్రణాళికలో వరద మళ్లింపు కీలకమైనది. హైదరాబాద్‌లో ఇప్పుడున్న నాలా వ్యవస్థ రోజుకి 8 సెంటీమీటర్ల వర్షాన్ని మాత్రమే తట్టుకోగలదు. ఒక్క వర్షానికే హైదరాబాద్‌లోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అవుతున్నాయి. రోజుల తరబడి బురదతో జనం అల్లాడిపోయారు.

## పతంజలికి యజమాని నేను కాదు..

### ఈ సామ్రాజ్యం మొత్తం దేశ ప్రజలదే

### రామ్‌దేవ్ బాబా కీలక ప్రకటన

**న్యూఢిల్లీ, నవంబర్ 15తెలుగు వెలుగు :**

పతంజలి యాజమాన్యానికి సంబంధించి యోగా గురువు బాబా రామ్‌దేవ్ పెద్ద విషయం చెప్పారు. లక్షల కోట్ల రూపాయల ఆస్తులకు తాను గానీ, ఆచార్య బాలకృష్ణకు గానీ యజమాని కాదని బాబా రామ్‌దేవ్ స్పష్టం చేశారు. హరిద్వార్‌లోని పతంజలి యోగపీఠ్‌లో సైక్లింగ్ చేస్తున్న ఆయన కంపెనీ యాజమాన్య హక్కులకు సంబంధించిన మొత్తం విషయాన్ని స్పష్టం చేశారు. ఈ సామ్రాజ్యం మొత్తం దేశ ప్రజలదేనని, వారే లబ్ధిదారులని అన్నారు. పతంజలి ఆస్తులపై కూడా కొందరికి చెడు చూపు ఉందన్నారు. స్వదేశీ కంపెనీ ప్రయాణం గురించి.. దాని సామ్రాజ్యం గురించి కూడా వివరించారు.లక్షల కోట్ల విలువైన ఈ పతంజలి సామ్రాజ్యం మొత్తం, ఇంత పెద్ద ఆచారం ఎలా వచ్చిందో, దాని యజమాని ఎవరు అని ప్రజల దృష్టిలో ఉందని రామ్‌దేవ్ అన్నారు. నిరామయం, యోగా గ్రామ్, పతంజలి యోగపీఠ్, పతంజలి గురుకులం, పతంజలి వెల్‌నెస్, యూనివర్సిటీ మొదలైన వందలాది సేవా సంస్థలను తాము నడుపుతున్నట్లు గుర్తుచేశారు. ఈ పనులతో పాటు, తాము ఈ ప్రచారాన్ని చాలా దూరం తీసుకెళ్లామని చెప్పారు. నేడు మనం దేశం మొత్తం మీద 100కి పైగా పెద్ద సంస్థలను స్థాపించినట్లు తెలిపారు. క్యాపిటల్ మార్కెట్‌లో దీని మొత్తం వాల్యుయేషన్ రూ. లక్ష కోట్ల కంటే ఎక్కువ ఉంటుందని వెల్లడించారు.మన యోగా గురువు సోదర సోదరీమణులు లక్షకు పైగా చోట్ల యోగాను ముందుకు తీసుకెళ్తున్నారని బాబా రామ్‌దేవ్ అన్నారు. ఇందులో ఇక్కడ కనీసం 10 లక్షల మందికి శిక్షణ ఇచ్చామని తెలిపారు. జిల్లా స్థాయిలో 20-25 లక్షల మందికి శిక్షణ ఇచ్చామన్నారు. నేడు కనీసం 25 లక్షలకు పైగా సీనియర్ యోగా ఉపాధ్యాయులు తమతో కలిసి సేవ చేస్తున్నారన్నారు. విద్యా బానిసత్వం, ఆర్థిక సైద్ధాంతిక బానిసత్వం నుంచి విముక్తి పొందడానికి తాము ఎన్నో ప్రయత్నాలు చేసినట్లు చెప్పుకొచ్చారు. లక్షల కోట్ల విలువైన ఈ సామ్రాజ్యం ఉద్భవించడానికి చాలా ప్రయత్నాలు జరిగాయన్నారు. పతంజలికి తాను లేదా ఆచార్య బాలకృష్ణ ఓనర్ అన్న మాటలను మరోసారి రామ్‌దేవ్ ఖండించారు. పతంజలి సామ్రాజ్యం గురించి సవివరమైన సమాచారం ఇస్తూ.. 'స్వామి రామ్‌దేవ్ దాని యజమాని కాదు.. ఆచార్య బాలకృష్ణ యజమాని కాదు.. దాని యజమాని మొత్తం దేశం, దాని ప్రజలు. ఈరోజు మనం చేసిన ఆరోగ్యం, విద్య, పేదరికం, ప్రకృతి, పరిశోధన, దానధర్మాలు, లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసి చేసిన కృషిని మొత్తం బేరీజు వేసుకుంటే ఈ ప్రయాణం ఇలాగే కొనసాగాలన్నదే ఏకైక లక్ష్యం. దీని నిర్వహణ వ్యయం రూ.200 కోట్లు.' అని చెప్పారు.

......




## భూములు లేని నిరుపేదలను రెచ్చగొట్టారు

### బీఆర్ఎస్ నేతల కనుసైగల్లో లగచర్లలో దాడులు

### ఉద్యోగులను భయభ్రాంతలకు గురిచేశారు

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం

**భైంసా, నవంబర్ 15తెలుగు వెలుగు :**

నిర్మల్ జిల్లా భైంసాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతల కనుసైగల్లో వారి స్వార్థం కోసం నిస్వార్థంతో పనిచేసే ఉద్యోగులను భయభ్రాంతలకు గురిచేశారని మండిపడ్డారు. వారి ఫోన్లో ఏమాట్లాడారో చూసామని, భూములు లేని నిరుపేదలను రెచ్చగొట్టారు.. కలెక్టర్‌ను చంపాలని రెచ్చగొట్టారని ఆయన ఆరోపించారు. పింక్ కలర్ అసలు నాయకుల పాత్ర ఉందో దాన్నంతా ప్రభుత్వం ఎక్స్ రే తీసినట్ట అంతా బయకు తీస్తదని ఆయన అన్నారు. తప్పు చేసిన వారిని వదిలిపెట్టదని, గత ప్రభుత్వ నాయకుల్లా కాదు.. ప్రతి పేదవాడికి ఇళ్లు ఇవ్వాలనేది మా ప్రభుత్వ చిత్తశుద్ధి అని ఆయన అన్నారు.సగం కట్టి వదిలేసిన ఇండ్లపై రివ్యూ చేస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి తీరుతామన్నారు మంత్రి పొంగులేటి. జనవరి నెల నుంచి తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి సన్న బియ్యం అందిస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా రైతు పండించిన ప్రతీ గింజ కొంటామన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. అంతేకాకుండా%ొ% రైతుల కోసం అని కల్లాల బాట, మరో బాట అంటూ ఎవ్వరు పాదయాత్ర చేసి మోకాళ్లు అరగగొట్టుకోవాల్సిన పనిలేదని, డిసెంబర్ లోపు పక్కగా మిగిలిన రైతులకు రుణ మాఫీ చేస్తామని మంత్రి పోగులేటి హామీ ఇచ్చారు. మిగిలిన 13 వేల కోట్లు చెల్లిస్తామని, త్వరలో రైతు భరోసా ఒక కిస్తి చెల్లిస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు.



# ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కార్తీక పౌర్ణమి శోభ

**భక్తుల రాకతో ఆలయాలు కిటకిట**

**వేకవ జామునుంచే నదీ స్నానాలు**

**దీపాలు వెలగించి మొక్కులు తీర్చుకున్న మహిళలు**

**హైదరాబాద్/విజయవాడ,నవంబర్ 15తెలుగు వెలుగు :**

కార్తీక పౌర్ణమి పర్వదినంతో ప్రముఖ ఆలయాలకు, నదీతీరాలకు భక్తులు పోటెత్తారు. కార్తిక పౌర్ణమి సందర్భంగా శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాన్నాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. సముద్ర, నదీతీరాల్లో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. వేకవ జామునే నదీతీర ప్రాంతాల్లో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. అటు శైవాలయాలు, ఇటు వైష్ణవాలయాలు కిటకిటలాడాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆధ్యాత్మిక శోభన సంతరించుకుంది, తెల్లవారుజాము నుంచే గోదావరి స్నానాలకు, శివాలయాలకు పోటెత్తారు భక్తులు. రాజమండ్రి పుష్కర్ ఘాట్ వద్ద గోదావరి పుణ్యస్నానా కోసం జల్లు స్నానాలను ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్తీక శుద్ధ పౌర్ణమి లేదా కార్తీక పున్నమి గా పిలవబడే కార్తీకమాసంలో శుక్లపక్షంలో పున్నమి తిథి దీపావళి పండగ వెళ్ళిన 15వ రోజు వస్తుంది. హిందువులు అత్యంత పరమ పవిత్రమైన కార్తీక మాసంలోని పౌర్ణమి తిథి కావడంతో శివాలయాలకు , శైవ వక్షేత్రాలైన ద్రాక్షారామం, సామర్లకోట, పిఠాపురం పాదగయ, కోనసీమలో పలు పుణ్యక్షేత్రాలకు చేరుకుని పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు, మహాభారత కథనాన్ని అనుసరించి కార్తీకేయుడు తారకరుని సంహరించిన రోజునే కార్తీక పౌర్ణంగా పిలుస్తారని పురాణాలు చెబుతున్నాయి. మహాశివరాత్రి తర్వాత శివుడికి అత్యంత ప్రీతికరమైన రోజుగా కార్తీకమాసం అంటారు. కార్తీక పౌర్ణమి రోజున చేసే నదీ స్నానం దీప దానం, శివాయల దర్శనం, విశేష పూజలు చేస్తే ఎంతో పుణ్యం ఫలమని నమ్మకం. ఈ నెల అంతా కార్తీక మహా పురాణాన్ని పారాయణం చేస్తారు. దేవాలయాలో కార్తీక పురాణ శ్రవణం ఏర్పాటు చేస్తే ఎంతో పుణ్యఫలం అని బ్రాహ్మణులు చెబుతున్నారు, వెయ్యిళ్ల రాక్షసుల పాలన అంతరించిన సందర్భంగా మహాశివుడు తాండవం చేశాడని పురాణాలు కూడా



చెబుతున్నాయి. అందుకే కార్తీక పౌర్ణమి రోజు గోదావరి స్నానం నదీ స్నానమాచరించి శివుడికి ప్రత్యేక పూజలు చేయడానికి ఆలయాలకు క్యూ కట్టారు భక్తులు. శివాలయంలో 365 ఒత్తులతో కూడిన దీపాన్ని వెలిగిస్తే పుణ్యఫలం దక్కుతుందని నమ్మకం. దీంతో గోదావరి జిల్లాల్లోని ఆధ్యాత్మిక కేంద్రాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఇకపోతే విజయవాడ కృష్ణాఘాట్, విశాఖ బీచ్, శ్రీశైలం,శ్రీకాళహస్తి, తిరుపతిల్లో లక్షవల్లుతు వెలగించారు. స్వామికి అభిషేకాలు చేయించారు. కాళేశ్వరం, ధర్మపురి, బాసర గోదావరి తీరాల్లో భక్తులు పోటెత్తారు. ఉదయమే భక్తులు నదీస్నానాలు ఆచరించి పూజలు చేశారు. ఉసిరి దీపాలను వెలగించారు. అమరావతిలో కృష్ణమ్మ చెంత మహిళలు తెప్పలు వదిలారు. సూర్యలంక, చీరాల, చినగంజాం, పెదగంజాం సముద్ర తీరాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు స్నానమాచ రించారు. దక్షిణ కాశీగా పేరొందిన శ్రీశైలంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ద్రాక్షారామం, కోటప్పకొండ, శ్రీకాళహస్తి, మహానంది తదితర పుణ్యక్షేత్రాల్లో భక్తుల రద్దీ నెలకొంది.

# ఆమ్ ఆద్మీ పార్టీలో చేరిన కాంగ్రెస్ కీలక నేత

**న్యూఢిల్లీ, నవంబర్ 15తెలుగు వెలుగు :**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. కాంగ్రెస్‌కు చెందిన వీర్‌సింగ్ ధింగన్ ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ వీర్ సింగ్ దింగన్ ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వీర్‌సింగ్ ధింగన్‌ను పార్టీలో చేర్చుకోగా, పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కూడా సీమాపురి నుంచి ఆయనకు అసెంబ్లీ ఎన్నికల టిక్కెట్టు ఇస్తామని వేదికపై నుంచి ప్రకటించారు. పార్టీ, ఈ దేశం ఎవరి వారసత్వం కాదని, మంచి వ్యక్తులు ఎక్కడ ఉంటే వారికే టిక్కెట్లు ఇవ్వాలని అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. వీర్ సింగ్ దింగన్ జీ ఆమ్ ఆద్మీ పార్టీలో చేరడం మాకు చాలా సంతోషంగా ఉందని కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీ రాజకీయాల్లో వీర్ సింగ్ దింగన్ జీ చాలా కీలకమైన వ్యక్తి. వీర్ సింగ్ దింగన్ జీ ఆమ్ ఆద్మీ పార్టీలో చేరడం మాకు చాలా సంతోషంగా ఉందని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీ రాజకీయాల్లో వీర్ సింగ్ దింగన్ జీ చాలా పెద్ద వ్యక్తి.. ఢిల్లీ రాజకీయాలు, సామాజిక రంగంలో చాలా ఏళ్లుగా క్రియాశీలంగా ఉంటూ ప్రజాసేవ చేస్తున్నారు. వీర్ సింగ్ దింగన్ పార్టీలోకి రావడంతో, ఆమ్ ఆద్మీ పార్టీకి చాలా బలం వస్తుంది. ముఖ్యంగా దళిత సమాజానికి ఆమ్ ఆద్మీ పార్టీ చేసే పనులకు కూడా ఎంతో బలం వస్తుంది. ధింగన్ సాహెబ్ సీమాపురి ప్రాంతంలో ఎన్నో పనులు చేశారు, ప్రజాసేవ చేశారు, ప్రజలు ఇప్పటికీ ఆయనను గుర్తుంచుకుంటారు.ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ తన పనుల వల్ల ఓట్లు అడుగుతుందని అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. పని చేసి ఉంటే ఓటేయండి, లేకపోతే ఓటేయకండి అని పార్టీ చెబుతోంది. ఆ చర్యల ఫలితమే నేడు చాలా మంది మంచి వ్యక్తులు ఇతర పార్టీల నుండి ఆమ్ ఆద్మీ పార్టీ వైపు చూస్తున్నారు. ఓ వైపు ప్రజానీకం ఆమ్ ఆద్మీ పార్టీకి అండగా నిలుస్తుండగా, మరోవైపు ఆ పార్టీలోని మంచి నాయకులు కూడా ఆమ్ ఆద్మీ పార్టీలో చేరాలని కోరుతున్నారని కేజ్రీవాల్ అన్నారు. గత వారం భారతీయ జనతా పార్టీకి చెందిన కొంతమంది నాయకులు చేరారు. ఈ రోజు వీర్ సింగ్ ధింగన్ జీ చేరుతున్నారు, కాబట్టి వచ్చే ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పూర్తి బలంతో మంచి మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందని నేను భావిస్తున్నాను. నేను మరోసారి వీర్ సింగ్ జీని పార్టీలోకి స్వాగతిస్తున్నాను మరియు ఆయనకు శుభాకాంక్షలు



తెలియజేస్తున్నాను అన్నార కేజ్రీవాల్. ఆమ్ ఆద్మీ పార్టీలో చేరిన సందర్భంగా వీర్ సింగ్ దింగన్ మాట్లాడుతూ.. "అరవింద్ కేజ్రీవాల్ ఆశీస్సులతో ఈరోజు ఆప్‌లో చేరుతున్నాను. కాంగ్రెస్, బీజేపీలు ప్రజలను దోపిడీ చేశాయని మీ అందరికీ తెలుసు. కాంగ్రెస్ వాళ్ళు మొదట లోపల ఒక మాట, బయట ఇంకోటి చెబుతారు. ఎక్కడో మేయర్ ఎన్నికల్లో కాంగ్రెస్ బీజేపీని గెలిపించిందని, అందుకు చింతిస్తున్నాను. లోపల సెట్టింగ్ ఏమిటో, కుమ్మక్కు ఏమిటో నాకు తెలియదు. ఇతర పార్టీలు దళితుల సమస్యపై ఖచ్చితంగా బాకా ఊదాయి కానీ కేజ్రీవాల్ జీ వారి కోసం పని చేసారు." అన్నారు.ఆమ్ ఆద్మీ పార్టీలో పెద్ద ఎత్తున టిక్కెట్లు కట్ చేయడం, బయటి నేతలను చేర్చుకోవడంపై అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ.. మంచివాళ్లందరికీ టిక్కెట్లు రావాలని అన్నారు. ఎవరి పార్టీ వారసత్వం కాదు, దేశం ఎవరి వారసత్వం కాదు. మంచి వాళ్లకు టిక్కెట్లు రావాలి, అవకాశం రావాలి, అంతే. బిర్సా ముండా తర్వాత సరాయ్ కాలే ఖాన్ పేరును మార్చడంపై కేజ్రీవాల్ మాట్లాడుతూ.. ఇది మంచి విషయం.. దానిని స్వాగతిస్తున్నామన్నారు.

# చివరిదశకు మహారాష్ట్ర ఎన్నికల పోరు

**నాందేడ్ తదితర ప్రాంతాల్లో పవన్ కళ్యాణ్ ప్రచారం**

**అమరావతి,నవంబర్15తెలుగు వెలుగు :**

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం చివరి దశకు చేరింది. ప్రచార గడువు పద్దెనిమిదో తేదీన సాయంత్రం ముగియనుంది. సమయం ముగియడంతో పెద్ద ఎత్తున సభలు, సమావేశాలు నిర్వహించడానికి బీజేపీ నేతలు ఏర్పాట్లు చేశారు. మరోమారు అక్కడ అధికారం సాధించేందుకు బిజెపి తనముందున్న అన్ని అస్త్రాలను వినియోగిస్తోంది. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ తరపున ఎన్డీఏ నేతలు రంగంలోకి దిగుతున్నారు. చంద్రబాబుతో పాటు పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు మహారాష్ట్ర వెళ్తున్నారు. శని, ఆదివారాల్లో పవన్ కల్యాణ్ నాందేడ్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేయనున్నారు. మహారాష్ట్రలో తెలుగు వారు ఉన్న పలు ప్రాంతాల్లో పవన్ కల్యాణ్ ప్రచారం సాగనుంది. నాందెడ్‌లో తెలుగు మూలాలున్న ప్రజలు ఎక్కువగా ఉన్నారు. అందుకే వీరిని ఆకట్టుకునేందుకు పవన్ కల్యాణ్‌తో ప్రచారం చేయించాలని నిర్ణయించారు. పవన్ కల్యాణ్ నాందేడ్ ప్రాంతంలో మొత్తం మూడు బహిరంగసభల్లో పాల్గొంటారు. ఇతర ప్రాంతాల్లోనూ వారి పర్యటన ఉంటుంది. పవన్ కల్యాణ్‌తో పాటు మంత్రి సత్యకుమార్ కూడా ఈ ప్రచారంలో పాల్గొంటారు. నాందేడ్‌కు బీజేపీ తరపున ఎన్నికల ఇంచార్జ్‌గా ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. పవన్ కళ్యాణ్ ప్రచారం అంశాన్ని సోషల్ మీడియాలో ధృవీకరించారు. ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి గత నెల రోజులుగా నాందేడ్‌లోనే బీజేపీ ఎన్నికల ప్రచారాన్ని సమన్వయం చేసుకుంటున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా బీజేపీ ముఖ్య నేతలు అంతా ఇప్పటికే ఒక విడత నాందేడ్‌లో ప్రచారం పూర్తి చేశారు. పవన్ కల్యాణ్, సత్యకుమార్ నాందేడ్ ప్రాంతంలో మూడు సభల్లో పాల్గొంటారు. ఇతర ప్రాంతాల్లోనూ విస్తృతంగా ప్రచారం చేస్తారు. పవన్, సత్యకుమార్ ప్రచారం వల్ల బీజేపీ విజయావకాశాలు మరింత మెరుగుపడి అభ్యర్థుల మెజార్టీలు భారీగా పెరుగుతాయని ఎన్నికల ఇంచార్జ విష్ణువర్ధన్ రెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు. నాందేడ్ ప్రాంత అభివృద్ధి, అక్కడి ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని బీజేపీ కూటమి చేసిన కృషి ఇక్కడి ప్రజలు మరోసారి బీజేపీ కూటమిని ఆదరిస్తారని నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. నాందేడ్ ఎన్నికల ఇంచార్జిగా బీజేపీ నాయకత్వం బాధ్యతలు అప్పగించిన తర్వాత నెల రోజులుగా అక్కడ ప్రచారాన్ని సమన్వయం చేసుకుంటున్నానని బీజేపీ విజయం ఎలాంటి డౌట్ లేదని ఆయన అంటున్నారు.



# మైనర్ భార్యతో లైంగిక సంబంధం అత్యాచారమే

**సమ్మతి వయస్సు 18 ఏళ్లు పైబడి ఉంది**

**అలాంటివాటికి రక్షణ చట్టం అంగీకరించదు**

**బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ సంచలన తీర్పు**

**బాంబే, నవంబర్ 15తెలుగు వెలుగు :**



ఏకాభిప్రాయంతో మైనర్ భార్యతో సెక్స్ చేసిన అది అత్యాచారంగానే పరిగణించబడుతుందని బాంబే హైకోర్టు తీర్పు చెప్పింది. అలాంటి చర్యలకు సంబంధించిన చట్టపరమైన రక్షణ చట్టం అంగీకరించదని చెప్పింది. తన భార్యపై అత్యాచారం చేసిన వ్యక్తికి 10 ఏళ్ల శిక్షను సమర్థిస్తూ బాంబే హైకోర్ట్ నాగ్‌పూర్ బెంచ్ వ్యాఖ్యానించింది. సమ్మతి వయస్సు 18 ఏళ్లు పైబడి ఉందని పేర్కొంటూ, న్యాయమూర్తి జిఏ సనప్‌తో కూడిన ధర్మాసనం ఇలా వ్యాఖ్యానించింది. 18 ఏళ్ల కన్నా తక్కువ వయసు ఉన్న అమ్మాయితో లైంగిక సంబంధం పెట్టుకోవడం అత్యాచారంగా పరిగణించాల్సిందే అని, ఆమెని వివాహం చేసుకున్నా, లేకున్నా సంబంధం లేదని చెప్పింది. భార్య లేదా భార్యగా చెప్పబడుతున్న అమ్మాయి వయసు 18 ఏళ్ల కంటే తక్కువ ఉన్నప్పుడు భార్యతో ఏకాభిప్రాయ శృంగారం చేశామంటే రక్షణ చట్టాలు అందుబాటులో ఉండవని హైకోర్టు నొక్కి చెప్పింది. కింది కోర్టు విధించిన 10 ఏళ్ల శిక్షను హైకోర్టు సమర్థించింది. కేసు వివరాల ప్రకారం.. వ్యక్తి బలవంతంగా లైంగిక సంబంధం పెట్టుకున్నాడు, ఫలితంగా బాలిక గర్భం దాల్చింది. అయితే, వీరిద్దరి వివాహ సంబంధం చెడిపోవడంతో భార్య సదరు వ్యక్తిపై ఫిర్యాదు చేసింది. వారిద్దరి మధ్య పెళ్లి జరిగినప్పటికీ.. ఆ వ్యక్తి ఆమె సమ్మతికి వ్యతిరేకంగా లైంగిక సంబంధం పెట్టుకున్నాడని బాధితురాలు చేసిన ఆరోపణల్ని దృష్టిలో పెట్టుకున్న కోర్టు, అది అత్యాచారం అని పేర్కొంది. ప్రస్తుతం బాధితురాలు మహారాష్ట్ర వార్ధాలో ఆమె తండ్రి, సోదరీమణులు, అమ్మమ్మతో కలిసి నివసిస్తోంది. బాధితురాలు ఈ పరిణామం నుంచి బయటకు వచ్చే సమయానికి ఆమెకు 3-4 ఏళ్లు నిందితుడైన వ్యక్తితో శృంగార సంబంధం ఉంది.కుటుంబ పరిస్థితుల కారణంగా సమీపం పట్టణానికి వలస వచ్చిన అమ్మాయిని, నిందితుడు అనుసరించాడు. ఆమెని పికప్ డ్రాప్ చేసేవాడు. చివరకు ఆమెను లైగింకంగా వాడుకున్నాడు. ఫలితంగా ఆమె గర్భం దాల్చింది. మొదట్లో నిందితుడు అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చాడు. నిందితుడు తన ఇరుగుపొరుగు సమక్షంలో అద్దె ఇంటిలో ఆమెకు శ్రీమంతం చేశాడు. ఆ తర్వాత నుంచి అమ్మాయిపై శారీరక దాడులు చేయడం ప్రారంభించాడు. అబార్షన్ చేయించుకోవాలని ఒత్తిడి చేశాడు. ఆమెకు పుట్టబోయే బిడ్డ వేరే వ్యక్తి వల్ల కలిగిందని ఆరోపించాడు. వేధింపులు తట్టుకోలేక బాధితురాలు 2019లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో నిందితుడిని అరెస్ట్ చేశారు. తమ లైంగిక సంబంధం అంగీకారంతోనే జరిగిందని నిందితుడు ఆరోపించాడు. ఈ కేసులో నేరం జరిగిన సమయంలో బాధితురాలి వయసు 18 ఏళ్ల కన్నా తక్కువగా ఉందని కోర్టు నిర్ధారించింది. డీఎన్ఏ నివేదిక కూడా పుట్టిన బిడ్డ వీరిద్దరికే పుట్టినట్లు కోర్టు నిర్ధారించింది. కింది కోర్టు విధించిన శిక్షను సమర్థించింది.

# ప్రజాస్వామ్యంలో సుప్రీంకోర్టు కీలకం..

**ఎవరైనా సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించాల్సిందే**

**రాజ్యాంగ విరుద్ధంగా వక్ఫ్ బోర్డును తీసుకొచ్చిన కాంగ్రెస్**

**సుప్రీంకోర్టుకు మించి వక్ఫ్ బోర్డుకు అధికారాలిచ్చారు**

**వక్ఫ్ బోర్డు అనేది ఒక క్రూరమైన హాస్యం**

**చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శలు**

**హైదరాబాద్, నవంబర్ 15తెలుగు వెలుగు :**

ఔరంగజేబు విధానాలు ఇప్పటికీ ప్రజలను పీడిస్తున్నాయని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 300 ఏళ్ల క్రితం ఔరంగజేబు నోటి మాటతో భూములు ఇచ్చి ఉండొచ్చు. కానీ, నేడు కుప్పలు కుప్పలుగా డాక్యుమెంట్స్‌తో ఆ భూములు మావి అని అంటున్నారు. ప్రజాస్వామ్యంలో సుప్రీంకోర్టు కీలకం.. ఎవరైనా సుప్రీంకోర్టు ఆదేశాలు పాటించాల్సిందే. రాజ్యాంగానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ వక్ఫ్ బోర్డును తీసుకొచ్చింది. సుప్రీంకోర్టుకు మించి వక్ఫ్ బోర్డుకు అధికారాలిచ్చారు. వక్ఫ్ బోర్డు అనేది ఒక క్రూరమైన హాస్యం. నవ్వాలో.. ఏడవాలో.. బాధపడాలో తెలియని పరిస్థితి. శీతాకాల సమావేశాల్లో వక్ఫ్‌బోర్డు బిల్లు పార్లమెంట్‌లో పాస్ అవుతుంది. వక్ఫ్ బోర్డు సవరణ చట్టం ముస్లిం సమాజానికి వ్యతిరేకం కాదని ఎంపీ అన్నారు.




# ఎస్ఈసీఐ షోకాజ్ నోటీసు

**రిలయన్స్ పవర్‌కు భారీ ఎదురుదెబ్బ**

**న్యూఢిల్లీ, నవంబర్ 15తెలుగు వెలుగు :**

రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆర్థిక కష్టాలు తొలగి లాభాల్లోకి వస్తుండగా మళ్లీ పెద్ద చిక్కుల్లో పడ్డారు. నకిలీ బ్యాంక్ గ్యారెంటీని సమర్పించినందుకు రిలయన్స్ పవర్ కంపెనీ, దాని అనుబంధ సంస్థపై క్రిమినల్ ప్రొసీడింగ్‌లను ఎందుకు ప్రారంభించకూడదని కోరుతూ భారతదేశ క్లీన్ ఎనర్జీ ఏజెన్సీ ఎస్ఈసీఐ షోకాజ్ నోటీసు పంపింది. గత వారం సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్.. రిలయన్స్ పవర్, దాని యూనిట్లలో ఒక యూనిట్ విదేశీ బ్యాంక్ గ్యారెంటీకి నకిలీ ఎండార్స్‌మెంట్‌ను సమర్పించిందనే ఆరోపణలపై మూడేళ్లపాటు వేలంలో పాల్గొనకుండా నిషేధించింది. తాజాగా రిలయన్స్ పవర్‌కు అనుబంధ సంస్థ అయిన రిలయన్స్ ఎన్‌యు బీఈఎస్ఎస్ సమర్పించిన బ్యాంక్ గ్యారెంటీ కూడా నకిలీదని ఎస్ఈసీఐ తన నోటీసులో పేర్కొంది. ఎస్ఈసీఐ చర్య తర్వాత గురువారం బీఎస్ఈలో రిలయన్స్ పవర్ షేర్లు 1.53 శాతం పడిపోయి రూ.36 దగ్గర స్థిరపడ్డాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో రూ. 2,878.15 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని నమోదు చేసి రుణ రహితంగా మారిన కొద్ది రోజులకే అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ పవర్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది.




# కన్నడ రాష్ట్రంలో లిక్కర్‌షాప్స్ ఓనర్స్ ఆందోళన బాట

**ఈనెల 20న వైన్‌షాపుల మూసివేత**

**కర్ణాటక, నవంబర్ 15తెలుగు వెలుగు :**

మద్యం ప్రియులకు బ్యాడ్ న్యూస్. ఎక్సైజ్ అధికారుల దోపిడిని అరికట్టాలంటూ కన్నడ రాష్ట్రంలో లిక్కర్ షాప్స్ ఓనర్స్ ఆందోళన బాట పట్టబోతున్నారు. ఈ సందర్భంగా కర్ణాటకలోని మద్యం దుకాణాలు నవంబరు 20వ తేదీన మూత పడబోతున్నాయి. ఎక్సైజ్ శాఖలోని అవినీతి, రాష్ట్ర సర్కార్ పట్టించుకోకపోవడంతో.. 20వ తారీఖున మద్యం అమ్మకాలను పూర్తిగా నిలిపివేస్తామని కర్ణాటక మద్యం వ్యాపారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి బి.గోవిందరాజ హెగ్డే తెలిపారు. తమ ఒక్క రోజు నిరసన వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు దాదాపు 120 కోట్ల రూపాయల నష్టం కలుతుందని వెల్లడించారు.అలాగే, నవంబరు 20వ తేదీన బెంగళూరులోని ఫ్రీడం పార్కు దగ్గర మద్యం వ్యాపారుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని ప్రధాన కార్యదర్శి గోవిందరాజ హెగ్డే వెల్లడించారు. లంచాల కోసం ఎక్సైజ్ అధికారుల తమపై వేధింపులు, యథేచ్ఛగా సాగుతున్న కల్తీ లిక్కర్ అమ్మకాలతో తాము విసిగి వేసారి పోయామని ఆయన చెప్పుకొచ్చారు. తమ డిమాండ్లపై చర్చించేందుకు ఎక్సైజ్, పోలీసు విభాగాల ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఈ సందర్భంగా కోరారు. రాష్ట్ర ఆర్థిక శాఖలో ఎక్సైజ్ విభాగాన్ని విలీనం చేయాలని డిమాండ్ చేశారు.



# ప్రధాని నరేంద్రమోడీ ప్రయాణిస్తున్న విమానంలో సాంకేతిక లోపం

**డియోఘర్, నవంబర్ 15తెలుగు వెలుగు :**

ప్రధాని నరేంద్రమోడీ ప్రయాణిస్తున్న విమానంలో సాంకేతిక లోపం ఏర్పడింది. జార?ండ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని, తిరిగి ఢిల్లీకి వచ్చే సమయంలో విమానంలో టెక్నికల్ స్నాగ్ ఏర్పడింది. జార?ండ్ డియోఘర్‌లో ఈ ఘటన జరిగింది. సాంకేతిక లోపాన్ని సరిదిద్దే వరకు విమానం అక్కడే ఉంటుంది. దీంతో ప్రధాని ఢిల్లీకి తిరిగి రావడం ఆలస్యం కానుంది. గిరిజనుల ఐకాన్ బిర్సా ముండా వార్షికోత్సవాన్ని జనజాతీయ గౌరవ్ దివస్‌గా జరుపుకునేందుకు, దీంతో పాటు నవంబర్ 20న జార?ండ్ రాష్ట్రంలో జరగబోయే రెండో విడత అసెంబ్లీ ఎన్నికలకు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ రోజు ప్రధాని మోడీ రెండు ర్యాలీల్లో ప్రసంగించారు.



# ప్రధాని సమాజాన్ని విభజిస్తున్నారు

## ఆయన చేస్తున్న ప్రసంగాలే ఉదాహారణ

## ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ విమర్శలు

**మహారాష్ట్ర, నవంబర్ 15తెలుగు వెలుగు :**

ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగాలతో సమాజాన్ని విభజిస్తున్నారని ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ విమర్శించాడు కొద్ది రోజులుగా ఆయన చేస్తున్న ప్రసంగాలు, లేవనెత్తుతున్న అంశాలను చూస్తే ఈ విషయం అర్థమవుతోందన్నారు. ఓ జాతీయ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చిన పవార్ మహాయుతి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మహారాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో విముఖత ఏర్పడిందన్నారు. ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మతతత్వ రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలు 'విడిపోతే చస్తారు' అనే నినాదంతో వారిలో భయాన్ని, అభద్రతను సృష్టిస్తున్నారని విమర్శించారు. ఆయన మాటలను భాజపా నాయకులు, ఎన్డీఏ మిత్రపక్షాలు సైతం వ్యతిరేకించాయన్నారు. ఎన్సీపీలో చీలిక ఏర్పడినా తమ వర్గానిదే గెలుపు అని శరద్ పవార్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ప్రజల మద్దతు పొందగలననే నమ్మకం ఉందని తెలిపారు. ప్రభుత్వంపై యువత, రైతులు అసంతృప్తితో ఉన్నారని.. అదే తమకు అనుకూలంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజల్లో తమకు మద్దతు తగ్గుతోందని గుర్తించిన మహాయుతి సర్కారు మహిళలకు డబ్బులు పంచే పథకాలను రూపొందిస్తోందని ఆరోపించారు. కానీ.. మహిళలు డబ్బును చూడరని, అభివృద్ధి, భద్రతను కల్పించే ప్రభుత్వాలను ఆదరిస్తారని పేర్కొన్నారు.గతంలో మహారాష్ట్రలో ఎన్సీపీని కింది స్థాయి నుంచి పటిష్ఠంగా నిర్మించడానికి శరద్ పవార్‌తో కలిసి ఆయన సోదరుడి కుమారుడు అజిత్ పవార్ కృషి చేశారు. అయితే శరద్ పవార్ అజిత్‌ను కాదని తన కుమార్తె సుప్రియ సూలేకు పార్టీ పగ్గాలు ఇవ్వాలని చూడడంతో అజిత్ ఆగ్రహంతో పార్టీ నుంచి విడిపోయారు. ఇలాంటి వ్యక్తిగత కారణాలతోపాటు పలు సైద్ధాంతిక విభేదాలూ ఎన్సీపీ చీలికకు దారి తీశాయి. ఇక ఈ ఎన్నికల్లో ఏ వర్గం అసలుదో ప్రజలు తేల్చనున్నారు.



# అజిత్ పవార్ దశాబ్ధాలుగా లౌకికవాది

## హిందూ వ్యతిరేక భావజాలంతో ఉన్నాడు

## అజిత్ పవార్ వ్యాఖ్యలపై దేవేంద్ర ఫడ్నవీస్ ఆగ్రహం

**మహారాష్ట్ర, నవంబర్ 15తెలుగు వెలుగు :**

యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ చేసిన "బాటేంగే తో కటేంగే"( విడిపోతే నాశనమైపోతాం అనే నినాదం మహారాష్ట్రలో సంచలనంగా మారింది. ఈ నినాదం బీజేపీ కూటమిలో కూడా చిచ్చురేపుతోంది. బీజేపీ మహాయుతి కూటమిలో భాగస్వామ్య పక్షంగా ఉన్న అజిత్ పవార్ ఈ నినాదాన్ని వ్యతిరేకించాడు. ఇది జార?ండ్, యూపీ ప్రాంతాల్లో పనిచేస్తుందని కానీ, మహారాష్ట్రలో నినాదం పనిచేయదంటూ ఇటీవల వ్యాఖ్యానించారు. అజిత్ పవార్ వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం, బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ విరుచుకుపడ్డారు. "అజిత్ పవార్ దశాబ్ధాలుగా లౌకికవాద, హిందూ వ్యతిరేక భావజాలంతో ఉన్నాడు. సెక్యులరిస్టులుగా పిలుచుకునే వారులో నిజమైన సెక్యులరిజం లేదు. హిందుత్వను వ్యతిరేకించడం సెక్యులరిజమనే వ్యక్తులతో అతను ఉన్నాడు. ప్రజల మానసిక స్థితిని అర్థం చేసుకునేందుకు అతడికి కొంత సమయం పడుతుంది" అని దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. ఈ వ్యక్తులు ప్రజల సెంటిమెంట్లు అర్థం చేసుకోలేదు, వారికి ప్రకటన యొక్క అర్థాన్ని తెలుసుకోలేరు, వారు వేరే ఏదైనా చెప్పాలనుకుంటున్నారు అని ఆయన అన్నారు.అజిత్ పవార్‌తో పాటు బీజేపీ నేతలు పంకాజా ముండే, అశోక్ చవాన్ కూడా ఈ నినాదంపై పెదవివిరిచారు. దివంగత బీజేపీ అగ్రనేత గోపీనాథ్ ముండే కుమార్తె ముండే మాట్లాడుతూ.. "తన రాజకీయాలు భిన్నమైనవని, ఒకే పార్టీకి చెందినప్పటికీ దీనికి మద్దతు ఇవ్వబోనని అన్నారు. ప్రతీ మనిషిని ఏకం చేయడమే నాయకుడి పని కాబట్టి, మేము మహారాష్ట్రకు అలాంటి టాపిక్స్ తీసుకురావాల్సిన అవసరం లేదు" అని అన్నారు. యోగి ఆదిత్యనాథ్ నినాదం ఇటీవల హర్యానా ఎన్నికల్లో బలంగా పనిచేసింది. హిందువులు అంతా ఐక్యంగా ఉండాలన్నదే ఆ నినాదం అర్థం, విడిపోతే నాశనం అవుతామని బంగ్లాదేశ్‌లోని హిందువుల పరిస్థితిని గురించి వ్యాఖ్యానించారు. మరోవైపు కాంగ్రెస్ చేస్తున్న "కులగణన" అనే ప్రతిపాదనకు వ్యతిరేకంగా ప్రధాని నరేంద్రమోడీ "ఏక్ హైతో సేఫ్ హై" (కలిసి ఉంటేనే సేఫ్) అని మరో నినాదం లేవనెత్తారు. మహారాష్ట్రలోని 288 స్థానాలకు నవంబర్ 20న ఓటింగ్ జరగనుంది. నవంబర్ 23న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.



# కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒక్కటే

**హైదరాబాద్,నవంబర్15తెలుగు వెలుగు :**

మాజీ సిఎం కెసిఆర్ బాటలోనే.. రేవంత్‌రెడ్డి ప్రయాణిస్తున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ ల డిఎన్ఏ ఒక్కటేనని.. రెండు పార్టీలు డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. మాటలు, విమర్శలతో రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్, బిఆర్ఎస్ లతో తెలంగాణకు ఒరిగిందేమి లేదని కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రాష్ట్రం ఏటిఎంగా మారిందని ఆరోపించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మరోసారి ఫైరయ్యారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే బస్తీ దావఖానాలు నడుస్తున్నాయని ఆయన చెప్పారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఆలయాలపై దాడులు జరుగుతుంటే.. ప్రభుత్వం, పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్చల ద్వారా పరిష్కరించాల్సిన వ్యవహారం.. కలెక్టర్ పై దాడి వరకు వెళ్లింది. సిఎం సొంత నియోజకవర్గంలో దాడి జరగడం, రైతుల అరెస్టులు.. అసలు ఏం జరుగుతుందని సర్కార్‌ను నిలదీశారు. రైతులకు బోనస్ ఇస్తామని..బోగస్ చేశారని మండిపడ్డారు. ఇచ్చిన హామీ మేరకు బోనస్ ఇచ్చే సత్తా ఈ సర్కార్ కు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఏ హామీని నెరవేర్చడం లేదని విమర్శించారు. తెలంగాణలో అభివృద్ధి కుంటుపడిందని.. రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదన్నారు. మూసీ ప్రక్షాళనకు బిజెపి వ్యతిరేకం కాదని.. పేదల ఇండ్లు కూలగొట్టకుండానే ప్రక్షాళన చేయొచ్చని చెప్పారు. తెలంగాణ సమాజాన్ని అవమానించేలా రేవంత్‌రెడ్డి మాటలున్నాయని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చురకలు అంటించారు. పేద ప్రజలకు అన్యాయం చేయొద్దని అంటే బుల్డోజర్లతో తొక్కిస్తా అంటావా.. తొక్కించు మేము కూడా చూస్తామని సవాల్ విసిరారు. 'సిస్టం మీకు మాత్రమే ఉందా.. మాకు లేదా.. చట్టం లేదా' అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నామని ఏది పడితే అది మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. రేవంత్ ఇలా మాట్లాడితే పేదల కోసం తాము చావడానికి కూడా సిద్ధమని అన్నారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సవాల్‌ను తాము స్వీకరిస్తున్నామన్నారు. వారి కోసం తమ పదవులు త్యాగం చేసేందుకు తాము రెడీగా ఉన్నామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. 'మా ఎమ్మెల్యే , ఎంపీ పదవులు వదులుకునేందుకు రెడీ. శనివారం రాత్రి బీజేపీ అధ్వర్యంలో మూసీ బాధితుల ఇంట్లోనే ఉంటాం, అక్కడే పడుకుంటాం. మా పార్టీ ఎంపీలు , ఎమ్మెల్యేలు మూసీ , హైడ్రా బాధితుల ఇళ్లలో ఉండాలని నిర్ణయించాం. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తే మేము మూడు నెలలు అక్కడే ఉండేందుకు సిద్ధం. వచ్చే రోజులన్నీ బీజేపీవే. రాబోయే రోజుల్లో మీమే అధికారంలోకి రాబోతున్నం. కేటీఆర్ అరెస్ట్ అంటూ కాంగ్రెస్ డ్రామా ఆడుతుందని కిషన్‌రెడ్డి విమర్శించారు. మహారాష్ట్రలో రేవంత్‌రెడ్డి ఏ మొఖం పెట్టుకుని ప్రచారం చేస్తున్నారని కిషన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. తెలంగాణలో ఆరు గ్యారంటీలు అమలు చేశామని, మహారాష్ట్ర ఎన్నికల

మొదటి పేజీ తరువాయి

ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి అబద్దాలు చెబుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. మాటలు ప్రజలకు.. మూటలు పార్టీకి అన్నట్లుగా.. కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి మహారాష్ట్రలో ఏ ముఖం పెట్టుకుని ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు. అశోక్‌నగర్ లైబ్రరీ వద్ద నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇంకా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించలేదు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లలో వైఫల్యం చెందిందన్నారు. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుచేయలేదని విమర్శించారు. హైదరాబాద్ శిల్పకళావేదికలో ఈనెల 21 నుంచి 24 వరకు లోక్ మంథన్ నిర్వహించనున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బేగంపేట పర్యాటక భవన్‌లో లోక్ మంథన్‌పై కేంద్రమంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లో ఈ ఏడాదిలో అంతర్జాతీయ సాంస్కృతిక మహోత్సవంగా లోక్‌మంథన్‌ను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈనెల 21న స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, 22న లోక్‌మంథన్‌ను రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ప్రారంభిస్తారని కిషన్‌రెడ్డి వెల్లడించారు. అదేవిధంగా 24న జరిగే ముగింపు కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, గజేంద్ర సింగ్ షేకావత్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కవులు, కళాకారులు, విదేశీ అతిథులు హాజరుకానున్నట్లు కేంద్రమంత్రి పేర్కొన్నారు. 'రేవంత్ రెడ్డి తెలంగాణలో ఏం చేశారో చెప్పి మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలి. నువ్వు సీఎం అయ్యాక చేసింది ఏంటంటే రెచ్చగొట్టే ప్రసంగాలు , విద్వేష పూరిత వ్యాఖ్యలు తప్ప ఏం ఉంది. మాజీ సీఎం కేసీఆర్ తిట్టినా తిట్ల పురాణాన్ని రేవంత్ రెడ్డి , కేటీఆర్‌లకు అందించినట్లు ఉంది. కేసీఆర్ , రేవంత్ రెడ్డిలు నిరుద్యోగులకు ఏం చేశారు. ధాన్యం కొనుగోళ్లలో ఫెయిల్ అయ్యారు. ఏ మొహం పెట్టుకుని మహారాష్ట్ర రైతులకు హామీ ఇస్తున్నారు. కౌలు రైతులు , రైతు కూలీల హామీలు ఏమయ్యాయి. 11నెలల్లో ఎంతమందికి రుణామాఫీ చేశారు. పోలీసులు గతంలో ఫామ్‌హౌస్‌ల కోసం పని చేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి కోసం పనిచేస్తున్నారు. హైదరాబాద్‌లో దేవాలయాలపై దాడులు జరుగుతుంటే ఏం చేస్తున్నారు.మజ్లిస్ ఆదేశాలకు తలొగ్గి రాహుల్ గాంధీ ద్వారా అసదుద్దీన్ ఓవైసీ హైదరాబాద్ నగర కమిషనర్‌ను ట్రాన్స్‌ఫర్ చేశారు. ఇక్కడ ఇవన్నీ చాలవన్నట్లు మహారాష్ట్ర ప్రచారానికి రేవంత్ వెళ్తున్నారు. కలెక్టర్ల మీద దాడులు, రైతుల మీద కేసులు తప్పా రేవంత్ రెడ్డి సర్కార్ ఏం చేస్తుంది. జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లకు కోట్ల రూపాయాలు పెండింగ్‌లో ఉన్నాయి. కేసీఆర్ పుణ్యమా అని రూ. 8లక్షల కోట్లు అప్పు ఏర్పడింది. కేసీఆర్ , రేవంత్ రెడ్డి వైఖరీ ఓటు బ్యాంకు రాజకీయం చుట్టూ తిరుగుతుంది' అని కిషన్ రెడ్డి విమర్శించారు.

# సోయాబీన్‌కు రూ.7000 ఎంఎస్ ప్లస్ బోనస్ ఇస్తాం

## ఉల్లికి సరైన మద్దతు ధర నిర్ణయించేందుకు కమిటీ

## పత్తికి మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకుంటాం

## మహా రైతులతో వీడియో కాల్‌లో రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ, నవంబర్ 15తెలుగు వెలుగు :**

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ దూసుకుపోతుంది. అన్ని వర్గాల వారికి ఉపయోగపడేలా పథకాలు రచిస్తూ ముందుకు వెళుతోంది. ఆ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ సైతం మహారాష్ట్ర ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ మహారాష్ట్ర రైతులతో వీడియో కాల్ మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు తమ బాధలను రాహుల్ గాంధీకి చెప్పుకుని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రాహుల్ ఎన్నికల్లో గెలిపిస్తే పలు హామీలు అమలు చేస్తామని వారికి చెప్పారు. వచ్చే డబ్బులతో తమ బిడ్డలను ఏం చదివిస్తామో.. ఏం తిండి పెడతామో అర్థం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మహారాష్ట్ర రైతుల కోసం మహావికాస్ అఘాడీ కూటమి చారిత్రాత్మక అడుగులు వేస్తామని హామీ ఇచ్చారు. సోయాబీన్ కు క్వింటాలుకు రూ.7000 ఎంఎస్ ప్లస్ బోనస్ ఇస్తామని చెప్పారు. ఉల్లికి కూడా సరైన మద్దతు ధర నిర్ణయించేందుకు కమిటీ వేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా పత్తికి కూడా మద్దతు ధర ఇచ్చి ఆ రైతులను సైతం ఆదుకుంటామని చెప్పారు. గత మూడు ఎన్నికలలో సోయాబీన్ కు రూ.6వేల రూపాయలు ఎంఎస్పీ ఇస్తామని బీజేపీ వాగ్దానం చేసిందని చెప్పారు. కానీ నేటికీ రైతులు తమ రక్తం, చెమటతో పండించిన సోయాబీన్ కు రూ.3వేల నుండి రూ.4వేల రూపాయలకు అమ్ముతున్నారని చెప్పారు.



# పినాకా రాకెట్ లాంచర్‌ను పరీక్షించిన డీఆర్‌డీఓ

**న్యూఢిల్లీ, నవంబర్ 15 తెలుగు వెలుగు :**



పినాకా రాకెట్ లాంచర్‌ను శుక్రవారం డీఆర్డీవో విజయవంతంగా పరీక్షించింది. ప్రపంచవ్యాప్తంగా ఆ వెపన్ సిస్టమ్‌కు డిమాండ్ ఉన్న నేపథ్యంలో.. అడ్వాన్స్‌డ్ గైడెడ్ వెపన్ సిస్టమ్‌ను డీఆర్డీవో డెవలప్ చేసింది. పినాకా ఆయుధ వ్యవస్థకు చెందిన రేంజ్, కచ్చితత్వాన్ని, స్థిరత్వాన్ని, ఫైరింగ్ రేట్‌ను పరీక్షించారు. ప్రొవిజినల్ స్టాఫ్ క్వాలిటేటివ్ రిక్వైర్మెంట్స్ ట్రయల్స్‌లో భాగంగా పినాకా వెపన్ సిస్టమ్‌ను టెస్ట్ చేశారు. పినాకా లాంచర్ల ద్వారా 12 రాకెట్లను ఫైరింగ్ చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మేకిన్ ఇండియా ఉత్పత్తికి రక్షణ శాఖ ఊతం ఇస్తున్న సందర్భంగా ఇతర దేశాలు ఆ వెపన్ సిస్టమ్‌పై ఆసక్తి చూపుతున్నాయి. పినాకా మల్టీ బారెల్ రాకెట్ లాంచర్ పై ఫ్రాన్స్ ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. అమెరికాకు చెందిన హిమార్స్ సిస్టమ్‌తో సమానంగా పినాకా వెపన్ సిస్టమ్‌ను పోల్చుతున్నారు. రక్షణ ఉత్పత్తుల్లో పినాకా ఎగుమతి రికార్డు సృష్టించనున్నది. ఆర్మేనియా తొలుత వీటి కోసం ఆర్డర్ ఇచ్చింది. ఆర్మీని బలోపేతం చేసుకునేందుకు ఫ్రాన్స్ కూడా ఆ వెపన్ సిస్టమ్‌పై ఇంట్రెస్టింగ్‌గా ఉన్నది. మరికొన్ని వారాల్లో ఆ సిస్టమ్‌ను టెస్ట్ చేయనున్నట్లు ఫ్రాన్స్ తెలిపింది. శివుడి విల్లును పినాకం అని పిలుస్తారు. ఆ పేరుతో రాకెట్ సిస్టమ్‌ను డెవలప్ చేశారు. భారత ఆర్మీ వద్ద ఉన్న రష్యన్ గ్రాడ్ బీఎం-12కు రీప్లేస్మెంట్‌గా ఈ రాకెట్ సిస్టమ్‌ను తయారు చేశారు. 1999లో కార్గిల్ యుద్ధ సమయంలో దీన్ని వినియోగించారు. వ్యూహాత్మకంగా ఎత్తు ప్రదేశాల్లో ఉన్న పాకిస్థాన్ స్థావరాలను పికానా సిస్టమ్ ద్వారా పేల్చివేశారు. ఆర్మమెంట్ రీసర్చ్ అండ్ డెవలప్మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఈ పినాకా రాకెట్ సిస్టమ్‌ను డెవలప్ చేసింది. మల్టీ బారల్ రాకెట్ సిస్టమ్‌లో రెండు పాడ్స్ ఉంటాయి. వీటిల్లో ఆరేసి రాకెట్లను నింపుతారు. ఆ తర్వాత కేవలం 44 సెకన్లలోనే ఆ 12 రాకెట్లను ఫైర్ చేస్తారు. 700 %ఇ% 500 మీటర్ల ఏరియా ఆ ఫైరింగ్‌తో నేలమట్టం అవుతుంది. ఆ సిస్టమ్‌లో ఉన్న బ్యాటరీ మొత్తం 72 రాకెట్లను ఫైర్ చేయగలదు.

# ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత

## రైతులకు ఇబ్బంది రాకుండా చర్యలు

## మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**సిద్దిపేట,నవంబర్15తెలుగు వెలుగు :**

వికారాబాద్ కలెక్టర్‌ను కొట్టడం తప్పే అంటున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అరెస్టులు చేయొద్దంటున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఓ కేంద్రమంత్రి మాట్లాడే మాటలేనా అని ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కలెక్టర్‌ను కొట్టినా అరెస్టులు వద్దంటున్న కిషన్ రెడ్డి కేంద్ర మంత్రి పదవికి అర్హుడా అని ప్రశ్నించారు. బాధితులు నిరసన తెలపడంలో తప్పులేదని.. కానీ అధికారులపై దాడి చేయడం తప్పన్నారు. కలెక్టర్‌ను కొట్టే ధైర్యం వీరికి ఎక్కడి నుంచి వచ్చిందని అడిగారు. పైనున్న నాయకుల ప్రోత్సాహం వల్లనే కదా అని ప్రశ్నించారు. కొండపాక మండలం దుద్దెడ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పొన్నం సందర్శించి, సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ఎలాంటి ఇబ్బందులు ఉన్న రైతులు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సన్న వడ్లు పండించిన రైతులకు గిట్టుబాటు ధరతో పాటు 500 బోనస్ ఇవ్వడం జరుగుతుందని.. కానీ ప్రతిపక్ష పార్టీల నాయకులు రాద్ధతం చేయకుండా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా కో సీనియర్ అధికారి నియమించి ధాన్యం కొనుగోలను పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. కాళేశ్వరం లేకున్నా కాళేశ్వరం ద్వారా పంటలు పండాయి అంటున్నారు బీఆర్ఎస్ నాయకులు.. కానీ రాష్ట్రంలో అత్యధికంగా పంటలు పండాయని తెలిపారు. రైస్ మిల్లర్ల విషయంలో ఎక్కడ ఇబ్బంది లేదన్నారు. 20 మంది డిఫల్టర్లు ప్రభుత్వ బకాయిలు చెల్లించి కొనుగోలులో పాల్గొనాలని తెలిపారు. 101 మంది రైస్ మిల్లర్లు ఉన్నారని.. వారు బ్యాంక్ గ్యారంటీ ఇచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 35 శాతం కుటుంబ సర్వే పూర్తయిందని తెలిపారు. కోటి 16 లక్షల ఇండ్లను 87 వేల మంది ఎన్యుమరేటర్లతో సర్వే చేయిస్తున్నామన్నారు. ఎన్యుమరేటర్లు తమ ఐడీ కార్డుతో పరిచయం చేసుకోవాలని.. దురుసుగా ప్రవర్తిస్తే చర్యలు ఉంటాయని తెలిపారు. మేడ్చల్ వద్ద రోడ్డుపై సర్వే పెపర్లపై సమాచారం లేదని.. అలాంటిది జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సర్వేపై ప్రభుత్వాన్ని అప్రదిష్టపాలు చేయడానికి సోషల్ మీడియా వేదికగా విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



# ఫిలిప్పీన్స్‌లో మెడికో అనుమానాస్పద మృతి

## సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరుకు చెందిన స్నిగ్ధగా గుర్తింపు

**హైదరాబాద్,నవంబర్15తెలుగు వెలుగు:**



విదేశాలలో ఉన్నత చదువుల కోసం వెళ్లిన మరో తెలుగు విద్యార్థి చనిపోవడం కలకలం రేపుతోంది. ఫిలిప్పీన్స్‌లో ఎంబీబీఎస్ చదువుకుంటున్న సంగారెడ్డి జిల్లాకు చెందిన చింత స్నిగ్ధ అమనునాస్పద స్థితిలో మృతిచెందారు. అయితే పుట్టినరోజు నాడే స్నిగ్ధ చనిపోవడంతో ఆమె మృతిపై కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌రు మండలంలోని ఇంద్రేశం గ్రామానికి చెందిన చింత స్నిగ్ధ ఫిలిప్పీన్స్‌లో ఎంబీబీఎస్ చేస్తున్నారు. మనీలాలోని పెర్పెక్చువల్ హెల్త్ యూనివర్సిటీలో మెడిసిన్ రెండో సంవత్సరం చదువుతున్నారు. ఆమె పుట్టినరోజున విష్ చేద్దామని ఫ్రెండ్స్ ఆమె గదికి వెళ్లారు. కానీ అప్పటికే స్నగ్ధ అనుమానాస్పద స్థితిలో చనిపోయి కనిపించారు. తమ కూతురు చనిపోయిందని తెల్లవారు జామున 3 గంటల సమయంలో సమాచారం రావడంతో విద్యార్థిని స్నిగ్ధ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆమె తండ్రి చింత అమృతరావు మెదక్ పట్టణం విద్యుత్ శాఖలో డీఈగా విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నత చదువుల కొరకు విదేశాలకు వెళ్లిన కుమార్తె ఆకస్మిక మరణాన్ని కుటుంబం జీర్ణించుకోలేకపోతోంది. అది కూడా పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాల్సిన కుమార్తె ఇక ప్రాణాలతో లేదని తెలియడంతో వాళ్లు కన్నీటి పర్యంతమవుతున్నారు. కుమార్తె స్నిగ్ధ మృతదేహాన్ని స్వస్థలానికి రప్పించేందుకు ఏర్పాట్లు చేయాలని ఫిలప్పీన్స్ అధికారులతో మాట్లాడాలని తెలంగాణ ప్రభుత్వాన్ని అమృత్‌రావు కోరారు.

Editor: Gunnala Anil Reddy Address: Krushi Nagar, Sharelingampalli Mandalam, Ranga Reddy (Dist) Telangana

Cell: 9705043131, 9948462690